www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

శనివారం 8-3-2025 | హైదరాబాద్ ప్రచురణ | Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 09, సంచిక : 166 పేజీలు : 8, వెల: రూ.5.00

రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు

విశాలాంధ్ర - ఖమ్మం : చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులను వానాకాలంలోపు పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల, బారుగూడెంలలో పర్యటించారు. ఆరెంపుల గ్రామంలో కోటి 76 లక్షల రూపాయలతో చేపట్టిన అరెంపుల సబ్ స్టేషన్ నుండి ముత్తగూడెం, శ్రీనగర్ కాలనీ రోడ్డు వయా నల్లచెరువు బీటీరోడ్డు నిర్మాణ పనులకు, బారుగూడెంలో 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, బారుగూడెం నుంచి పోన్నెకల్ - ఆరెంపుల రోడ్డు వరకు 72 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం మంజూరు చేసి ప్రారంభించిన పనులను రాబోయే వానాకాలం లోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. గ్రామాలలో చేపట్టిన పనులు నాణ్యతతో ఉండాలని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా చిత్తశుద్ధితో ప్రజలకు ఇచ్చిన కొన్ని హామీలను అమలు చేశామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల కష్టాలు తెలుసుకుని వాటిని తీర్చేందుకు పనిచేస్తుందని అన్నారు. బారుగూడెం గ్రామానికి కోటి 75 లక్షల వరకు అభివృద్ధి పనులు చేపట్టామని, పాఠశాల అభివృద్ధి, త్రాగునీటి ట్యాంక్ నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేశామని అన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకం, సన్న వడ్లకు బోనస్ అమలు చేశామని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం, 500లకు గ్యాస్ సిలిండర్ సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా వంటి కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. ఆర్థిక పరిస్థితులను బాగు చేస్తూ క్రమ పద్ధతిన ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని మంత్రి అన్నారు. అనంతరం మంత్రి (16) మంది డబల్ బెడ్రూం లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఆర్డీఓ నరసింహారావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తిని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వ హాస్టళ్లలో, పాఠశాలల్లో నెలకొన్న స్థితిగతులను జిల్లా అధికారులు స్వయంగా పర్యటించి తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఫలితాలు కనిపిస్తున్నాయి. స్వయంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లాలోని వివిధ శాఖల హాస్టళ్లను, ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను చక్కదిద్దుతున్నారు. ఈ క్రమంలో భాగంగానే శుక్రవారం పాల్వంచ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో భోజనం చేస్తూ వారితో మమేకమై పాఠశాల స్థితిగతులతో పాటు వ్యక్తిగత వివరాలు, వారి బాగోగులను తెలుసుకున్నారు. రోజు వండి పెడుతున్న భోజనం నాణ్యతపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టిక ఆహారం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఆహార పదార్థాలను వృధా చేయకూడదని సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు చదువులతో పాటు క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ వంట పత్రాలు, వండే పరిసర ప్రదేశం ఇంకా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలకు మంజూరైన స్పోర్ట్స్ మెటీరియల్ కిట్లను ఆయన పరిశీలించారు. భోజనం చేసేందుకు వీలుగా కిచెన్ సెట్, ఐరన్ పొయ్యి ఏర్పాటు, బల్లలు, బెంచీలు విద్యార్థులకు ప్రత్యేకంగా లంచ్ బాక్స్‌తో కూడిన బ్యాగ్‌ను ఏర్పాటు చేసేందుకు నివేదికలు అందించాల్సిందిగా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖఅధికారి వెంకటేశ్వరచారి, జిల్లా కోఆర్డినేటర్ సైదులు, సతీష్ కుమార్, ఎంఈఓ రామ్మూర్తి, ప్రధానోపాధ్యాయురాలు పద్మలత పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - వనపర్తి : మార్చి 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటల్ అధికారులకు పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిలో మొత్తం 6,853 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో చీఫ్ సూపరింటెండెంట్లదే ప్రధాన బాధ్యత అని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఏసీజీ గణేష్, చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇతర విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుడు మల్లయ్య సేవలు మరువలేనివి

విశాలాంధ్ర- తొర్రూరు: స్వాతంత్ర సమరయోధులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి మల్లయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్ అన్నారు. గురువారం రాత్రి అనారోగ్యంతో దాసరి మల్లయ్య మృతిచెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. అనేకమంది కాంగ్రెస్ నాయకులను తయారు చేశాడని, ఆయన సేవలను కాంగ్రెస్ పార్టీ మరువ లేదని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య, ఏఎంసి డైరెక్టర్ కంచర్ల వెంకటా చారి, నాయకులు గుండాల నర్సయ్య, వెంకన్న యాదవ్, రామ్మూర్తి యాదవ్, గూడెల్లి రామచంద్రయ్య, కృపాకర్ రాజు, యూత్ పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్, భూతం భరత్, చిట్టిమల్ల మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజారామ్, కానిస్టేబుల్ సుధాకర్‌ను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఐజి చంద్రశేఖర్ రెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర పోలీస్‌స్టేషన్‌పైన విశ్రాంతి గదిలో ఇద్దరు బయట వ్యక్తులతో కలిసి మద్యం సేవించారని, సిబ్బందిపై ఆరోపణతో ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కాగా ఇట్టి ఘటనపై విచారణ జరిపి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై రిపోర్ట్ పంపామని దీనిపై ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ ఐ.జి. చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

రాజీ మార్గమే రాజ మార్గం

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాజి మార్గమే రాజ మార్గము క్షణికావేశాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు కేసుల రాజి మార్గము ద్వారా జీతాలను సరిచేసుకోవచ్చు. అని జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆదేశాల మేరకు శనివారం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షుడు మరియు ప్రధాన జిల్లా న్యాయమూర్తి ఎం.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూ వివాదాలు, సైబర్ క్రైమ్ కేసులు, ఇతర సివిల్ దావాలు పరిష్కరించుకోవచ్చని, ఈ జాతీయ లోక్అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, న్యాయవాదులు, ఇన్సూరెన్సు అధికారులు, రెవిన్యూ అధికారులు మరియు బ్యాంకు అధికారులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని కక్షిదారులందరు వినియోగించుకొని తమ కేసులు రాజీ చేసుకోగలరని సూచించారు.

ప్రజల వెన్నంటి వుండేది కమ్యూనిస్టు పార్టీనే...

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్రజల కష్ట నష్టాల్లో అన్ని వేళల వెన్నంటి ఉండేది కమ్యూనిస్టు పార్టీ యే అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబీర్ పాష అన్నారు. అధికారం ఉన్న లేకున్నా ప్రజల కోసం పాటుపడేది, సమస్యలపై ఉద్యమించేది కేవలం కమ్యూనిస్టు పార్టీయేనని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల, పెద్దతండా గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు సాబీర్ పాషా సమక్షంలో సిపిఐ పార్టీలో చేరారు. వారందరికీ ఎర్ర కండువా కప్పి పార్టీలోకి ఆత్మీయంగా అహ్వానించారు. అనంతరం పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మారుమూల ఏజెన్సీ గ్రామాలపై ప్రేత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేస్తున్నారని వివరించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. సిపిఐ పార్టీలో బరపటి రాంబాబు, ముక్కెర రమేష్, ముక్కెర రాంప్రసాద్, తూనెం సతీష్, రామగిరి గోపి, నన్య, మహంకాళి సందీప్, బాలిన రాజు, మాడెం బాలకృష్ణ, బానోత్ కిషన్, ధారావత్ మంగ్య,భానోత్ విఠల్, ధారావత్ శివ, భూక్య వీరన్న, భూక్యా వెంకటేష్, గంగరబోయిన వీరబాబు, సిక్కుల సాగర్, మేకల వెంకటేష్,భానోత్ నాగరాజు, భానోత్ గణేష్, భానోత్ దేవా, మేకల ప్రభయ్య,బానోత్ శత్రు, మేకల రాజబాబు, మేకల ఎల్లయ్య, పెద్ద బొమ్మ ప్రసాద్, లకావత్ మురళి, భుక్యా సుమన్, భూక్య రామదాస్, బుక్యా కిషన్, భూక్య రమేష్, నూనవత్ నర్సింగ్ మరికొందరు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దీటి లక్ష్మి పతి, కంటెం శ్రీనివాస్, మిర్యాల రాము, ఎర్రయ్య, దేవరగట్ల రాంబాబు, మాడెం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా విద్యావేత్త అవార్డుకు సంధ్యారాణి ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్ పట్టణంలో గల సిద్ధార్థ్ మాడల్ హై స్కూల్ సంధ్యారాణికి ఉత్తమ విద్యావేత్త అవార్డు వరించింది. ఈ అవార్డును తెలంగాణలోని గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే.సంధ్యారాణి మాట్లాడుతూ మెదక్ అంటే మెతుకు సీమే కాదు మేధావుల సీమ అని నిరూపించాలనే సంకల్పంతో ఈ విద్యారంగంలోకి అడుగు పెట్టి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం జరిగిందన్నారు. విద్యా సంస్థల చైర్మన్ కే.శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ 2001లో స్థాపించబడిన సిద్ధార్థ్ విద్యాసంస్థల ద్వారా ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులుగా మార్చినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచీల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులు దేశానికే మూలవాసులు

విశాలాంధ్ర - గూడూరు, కొత్తగూడెం : భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో ఆదివాసులు నివసిస్తున్నారని ఆదివాసులు పల్లెలకు కాదు పట్టణాలకు భారతదేశానికే మూలవాసులని తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పొడుగు రామారావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటనుండి అనేక హక్కులను కల్పించిన భారతదేశ ప్రభుత్వమని అన్నారు. ఆదివాసులకు ప్రత్యేకమైన భూభాగాన్ని కేటాయించి ఐదు ఆరవ షెడ్యూల్ను గుర్తించి ప్రత్యేకతను ఐటీడీఏ ద్వారా ఆదివాసులకు ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోని ముప్పై ఆదివాసి తెగలకు నివసిస్తుంటే అట్టి తెగలకు రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని హక్కులను కల్పించిందని రామారావు అన్నారు. 1976లో ఇందిరమ్మ లంబాడీలను అభివృద్ధి చేయడం కొరకై ఎమర్జెన్సీ పరంగా వారిని మైదాన ప్రాంత గిరిజనులుగా గుర్తించి ఎస్టీ జాబితాలో కొనసాగడం జరిగిందని పేర్కొన్నారు. వారు ఎస్టీలు కారని ఆయన తెలిపారు.

మహిళల సంరక్షణకు అధిక నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - కారేపల్లి : మహిళల సంరక్షణ కొరకు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని పేదలకు నిత్యావసర వస్తువులు అందించే ప్రజాపంపిణీ వ్యవస్థకు నిధులు తగ్గించి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ విమర్శించారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకోని కారేపల్లి మండల పరిధిలోని గాంధీనగర్‌లో ఈసం లక్ష్మి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఐద్వా నేత మెరుగు రమణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య చీలికలు తేవటానికి మను ధర్మాన్ని ముందుకు తీసుకవస్తుందన్నారు. కుల, లింగ వివక్ష అంతర్భాగమైన మనుధర్మంతో తన పబ్బం గడుపుకోవాలని చూస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్ పథకం ఆహ్వానించదగినద్కెనా బస్ సంఖ్య పెంచకుండా మహిళలను కించపరిచేలా ఉచిత బస్ ఉందన్నారు. ప్రతి గ్రామానికి బస్‌లను నడపాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఉచిత బస్, ఉచిత కరెంట్‌లను మాత్రమే అమలు చేస్తుందన్నారు. సదస్సుకు ముందు గాంధీనగర్ మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఐద్వా నాయకురాళ్లు కే.నీలిమ, బీ.అచ్చమ్మ, కే.సుజాత, జీ.జగ్గమ్మ పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సురేష్ కుమార్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్, ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్, ఎంప్లాయ్ ట్రేడ్ యూనియన్ 2025 క్యాలెండర్‌ను, శుక్రవారం ఏటూరునాగారం సామాజిక వైద్యశాల సూపరెంట్ డాక్టర్ సురేష్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి హెడ్ నర్సు, సిబ్బంది,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కార్పొరేట్ వ్యవస్థకు పొత్తులుగా మారిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వ్యతిరేకంగా వ్యవసాయ రంగం దెబ్బతిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ఆరోపించారు. శుక్రవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో జరిగిన పాల్వంచ మండల రైతు సంఘం ప్రథమ మహాసభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలుత రైతు సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొ రేట్ శక్తులు అనుకూలంగా మూడు నల్ల చట్టాలను దొడ్డి దారిన అమలు చేయడా నికి ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. వ్యవసాయ రంగం దెబ్బతిస్తే దీని ప్రభావం దేశంలోని అన్ని రంగాలపై పడి తీవ్ర నష్టాలు సంభవిస్తాయన్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా శక్తివంతంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో బికెఎంయు జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావు నిమ్మల రాంబాబు, నరటి రమేష్, వేములపల్లి శ్రీను, డిహెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, ప్రజాసంఘాల నాయకులు వేములపల్లి రాజశేఖర్, భూక్యా విజయ, జకరయ్య, వైఎస్ గిరి, కంగర అప్పారావు, బానోత్ రంజిత్, జరుపుల మోహన్, బాదే చెన్నయ్య, ఎడవల్లి క్రిష్ణ, భీమా నాయక్ పాల్గొన్నారు. అనంతరము పాల్వంచ మండలం రైతు సంఘం అధ్యక్షులుగా కొంగర అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా బానోత్ రంజిత్‌తో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులను మహాసభలో ఎన్నుకన్నారు.

జాకబ్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

విశాలాంధ్ర ప్రతినిధి - పెద్దపల్లి, సింగరేణి : ప్రముఖ ప్రజానాట్యమండలి కళాకారుడు, నాయకుడు సె.హెచ్ జాకబ్ విగ్రహావష్కరణ ఈనెల 9, ఆదివారం ఉదయం గోదావరిఖని న్యూఅశోక్ టాకీస్ ముందు జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ప్రజానాట్యమండలి కళాకారుడు, జాతీయ నాయకుడు కె.స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయుసి నాయకులు వి.సీతారామయ్య, పలువురు దళిత, బిసి సంఘాల నాయకులు, పుర ప్రముఖులు, ప్రజానాట్యమండలి, అరసం నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పాత బస్టాండ్ పనులు పున: ప్రారంభం

విశాలాంధ్ర - వనపర్తి : పాత బస్టాండ్ పున ప్రారంభించడానికి అధికారులు గుత్తేదారులు పని ప్రారంభించడంతో మూడు సంవత్సరాలుగా పోరాటం చేసిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు అక్కడికి వెళ్లి పనులు పరిశీలించి అధికారులను విషయం అడిగి తెలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల ప్రజల ఇబ్బందులు తొలగిపోతున్నందుకు సంతోషపడుతున్నామని అఖిలపక్ష ఐక్యవేదిక ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని ఇబ్బంది కలిగినచో అక్కడే పోరాటం మొదలవుతుందని అధ్యక్షుడు సతీష్ యాదవ్ తెలిపారు. ఇందుకు సహకరించిన అధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అక్కడ 40 సంవత్సరాల నుండి చిరు వ్యాపారం చేసుకున్న వారికి కూడా సౌకర్యాలు కల్పించాలని వారికి తగు రక్షణ కల్పించాలని ఐక్యవేదిక డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్ యాదవ్‌తో పాటు రాష్ట్ర టిడిపి నాయకులు కొత్తగొల్ల శంకర్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శివకుమార్, పుట్టపాక బాలు రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల పరిధిలోని పులగం బండ తండా ప్రాథమిక పాఠశాల యందు శుక్ర వారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఇందులో భాగంగా కలెక్టర్గా బానోతుదీక్షిత డీఈఓ గా బానోతు అలేఖ్య ఎంఈఓగా బానోతునాని ఎమ్మార్వోగా బాణోతు సుశాంత్ ప్రధానోపాధ్యాయులుగా బానోతు రామ్‌చరణ్, ఉపాధ్యాయులుగా పిల్లలు అలరించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ ఉపాధ్యాయులు వరప్రసాద్ మరియు ఉషారాణి మరియు అంగన్వాడీ టీచర్ సైదమ్మలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్‌డిఓ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల పరిధిలో గురువారం జూనియర్ కాలేజిలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని నేరేడుచర్ల తహసీల్దార్ సురిగి సైదులు హుజూర్ నగర్ ఆర్‌డీఓ శ్రీనివాస్ తనిఖీ చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

పార్టీ విస్తృతికై కార్యాచరణ

సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సంస్థాగత నిర్మాణం, పార్టీ విస్తృతికై కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ శతాబ్ది ఆవిర్భావ ఉత్సవాల నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసే దిశగా కార్యక్రమాలు ఉండాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో జాగర్లమూడి రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ ఇది మహాసభల సంవత్సరమని ప్రజా సంఘాల మహాసభలతో పాటు పార్టీకి సంబంధించి శాఖ, మండల, జిల్లా మహాసభలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఖమ్మంజిల్లాలో ఏప్రిల్ 15 నాటికి గ్రామశాఖ మహాసభలను పూర్తి చేయాలని ఆయన సూచించారు. గ్రామశాఖ మహాసభల - సందర్భంగా ఉత్సాహపూరిత వాతావరణం నెలకొనేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సభలు డిసెంబర్ 26న ఖమ్మంజిల్లాలో జరగనున్నాయని ఆయన తెలిపారు. 30 దేశాల నుంచి అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు జాతీయ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనున్నారని ఈ సందర్భంగా లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. లబ్దిదారులను ప్రభుత్వ సానుకూలురుగా మార్చుకోవడంలో వైఫల్యం ఎంఎల్సీ ఎన్నికలపై పడిందని హేమంతరావు అభిప్రాయపడ్డారు. ప్రజా సంఘాలు పార్టీ, మండల కమిటీలు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట కార్యక్రమం రూపొందించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని యాసంగికి సంబంధించి కోతలు ప్రారంభమైనందున ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న సిపిఐ నేత సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : సఫయ్ బస్తీలోని రాష్ట్ర మైనారిటీ నాయకులు, ఉర్దూ ఘర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి కార్యాలయంలో, ఓల్డ్ డిపో మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొన్నారు. ఇఫ్తార్ అనంతరం సాబీర్ పాషా మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాసం (రోజా) ఉంటున్న జిల్లా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ఉపవాసాలు పేదల, అన్నార్తుల ఆకలి దప్పులు ఎలా ఉంటాయో స్వయంగా ముస్లింలు తమ అనుభవాల ద్వారా తెలుసుకోవాలని సృష్టికర్త విధిగా నిర్ణయించినట్లు తెలిపారు. వ్యక్తి నిర్మాణం, సోదర భావం, పరోపకారాన్ని నేర్పుతూ ఈ రంజాన్ మాసం ముస్లింలకు ఒక శిక్షణ ఇస్తుందన్నారు. ఇస్లాంలోని ఐదు మూలస్తంభలో ఉపవాసాలు, జకాత్‌లు కూడా ముఖ్యమన్నారు. స్తొమత ఉన్న ప్రతి ముస్లింలు తమ సంపాదనలో 2.5 శాతం జకాత్ నిరుపేద లకు అందిస్తే అల్లాహ్ కరుణ లభిస్తుందన్నారు. ఈ ఇఫ్తార్ విందులో ఉర్దూగర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషితో పాటు ముస్లిం మత పెద్దలు రంజాన్ ఖాన్, ఎండ్ అన్వార్, బాబుజాని, సైయ్యద్ తాజద్దీన్, ఎండ్. జమాల్, ఇక్బాల్ ఖురేషి, ఎండీ హమీద్, బడా బచ్చ తదితరులు పాల్గొన్నారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు జీవో 22 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : రాష్ట్రవ్యాప్తంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు జీవో నెంబర్ 22 ప్రకారం కొత్త వేతనాలు అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ యువజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం హైదరాబాదులో కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల అందరిని కార్పొరేషన్ చేయడం వల్ల ప్రభుత్వానికి చాలా మేలు జరగడమే కాకుండా ప్రభుత్వం నేరుగా జీఎస్టీ చెల్లించే అవసరం లేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వమే ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల వేతనాలపై జీఎస్టీ ప్రభుత్వమే చెల్లించటం వల్ల నష్టం జరుగుతుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వారందరికీ ఉద్యోగ భద్రత, వేతనాల పెంపుతోపాటు ఏజెన్సీలకు కమిషన్ ల చెల్లిపు దందా ఆగిపోతుందన్నారు. సుమారు పది నెలల నుంచి ఔట్సోర్సింగ్ యాజమాన్యాలు జీతాలు ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. సరిగ్గా పీఎఫ్ లు, ఈఎస్ఐలు ఏజెన్సీలు కట్టడం లేదని ఆరోపించారు. తెలంగాణ సాధన కోసం విద్యార్థులు, యువకులు ఎన్నో ప్రాణాలు త్యాగం చేశారని అలాంటి రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి నియామకాలు ఇంత దారుణం ఎందుకని కోటా శివశంకర్ ప్రశ్నించారు.

ఉపాధ్యాయులుగా బోధించి ఆకట్టుకున్న విద్యార్థులు

విశాలాంధ్ర - గార్ల : విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా అవతారమెత్తి తోటి విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలను బోధించారు. స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం మండల పరిధిలోని పెద్దకిష్టాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు ఉదయాన్నే ఉపాధ్యాయుల్లా ముస్తాబై ఎంతో ఉత్సాహంతో పాఠశాలకు వచ్చారు. చాలా బాధ్యతయుతంగా వివిధ సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులుగా చక్కగా బాధ్యతను నిర్వర్తించి ఆకట్టుకున్నారు. తమ ఉపాధ్యాయులను అనుకరిస్తూ చేపట్టిన విధులు అబ్బురపరిచాయి. దీంతో ఆ పాఠశాలలో పండుగ వాతావరణం ఏర్పడింది. ఎంఈఓ గా సోమేశ్వర్, హెచ్ఎమ్ గా హిమబిందు వ్యవహరించారు. అనంతరం పాఠశాల హెచ్ ఎమ్ జి. వీరభద్రం ఆధ్వర్యంలో ఉత్తమ బోధన అందించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామ, నాగేశ్వరావు, వేణు కుమార్, రాంబాబు, రాజు కుమార్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన జకాత్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర - కొత్తగూడెం : సమాజంలో పేదరిక నిర్మూలన కోసమే ఇస్లాంలో జకాత్ తప్పనిసరిగా చేయడం జరిగిందని జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్ - రామవరం శాఖా అధ్యక్షుడు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు. శుక్రవారం ప్రత్యేక నమాజ్ సందర్భంగా రామవరం నాగయ్య గడ్డ జమ్ జమ్ మసీదులో ఆయన మాట్లాడారు. ఇస్లాం మౌలిక విశ్వాసాలలో జకాత్ ఒకటన్నారు. ధనికులు సంవత్సరం పాటు తమ వద్ద నిలువ ఉన్న ధనంలో రెండున్నర శాతం జకాత్ స్వచ్ఛందంగా పేదలకు విధిగా పంచాలన్నది అల్లాహ్ ఆదేశమన్నారు. జకాత్ సమాజంలో ధనిక -పేదల మధ్య తారతమ్యాన్ని దూరం చేస్తుందని వివరించారు. రంజాన్ మాసం లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యధికంగా దాన ధర్మాలు చేసేవారన్నారు. రంజాన్ ఉపవాసాల అసలు ఉద్దేశం కూడా ఆకలి అంటే ఏమిటో ఆచరణాత్మకంగా అనుభవించాలానే ఉద్దేశమన్నారు. పేదసాదల పట్ల సానుభూతి వహించ వలసిన మాసం అని ముహమ్మద్ ప్రవక్త తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ అధ్యక్షుడు ఖాసిం సెట్, పెద్దలు రెహాన్, యాకుబ్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

www.visalaandhra.com
శనివారం
8-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి: 09, సంచిక: 166
పేజీలు: 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
స్థాపితం: 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



బీఎడ్ పరీక్ష పేపర్ లీక్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఎడ్ ప్రశ్నపత్రం లీక్ అయింది. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు ఈ ప్రశ్న పత్రం సోషల్ మీడియాలో వైరల్ అయింది. గుంటూరు జిల్లాలోని ఓ కళాశాల యాజమాన్యమే ఈ ప్రశ్న పత్రం లీక్ చేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు ప్రాస్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పరీక్ష నిర్వహించారు. అయితే అరగంట ముందే ఈ పరీక్ష పత్రం లీక్ కావడం గమనార్హం. మరోవైపు మార్చి 6వ తేదీ నుంచి బీఎడ్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజే

- మిగతా 5 లో

కుప్పకూలిన యుద్ధ విమానం

పంచకుల: భారత వైమానిక దళానికి చెందిన జాగ్వార్ యుద్ధ విమానం హర్యానాలోని పంచకులలో శుక్రవారం కుప్పకూలింది. శిక్షణా కార్యక్రమంలో భాగంగా అంబాలా ఎయిర్‌బేస్ నుంచి బయలుదేరిన విమానం కొద్ది సేపటికే కూలింది. అయితే పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనపై శాఖాపరమైన దర్యాప్తు జరుపుతున్నట్టు అధికారులు తెలిపారు. 'సాంకేతిక లోపం కారణంగా ఈ దురదృష్టకర ఘటన చోటుచేసుకుంది. విమానాన్ని నివాస ప్రాంతాలకు దూరంగా నడిపి పైలట్ సురక్షితంగా

- మిగతా 5 లో

ధారావి ప్రాజెక్టు ఆపలేం: సుప్రీం

న్యూఢిల్లీ: ధారావి పునరుద్ధరణ ప్రాజెక్టు (డీఆర్‌పీ) పనులను ఆపేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. బాంబే హైకోర్టు ఆదేశాన్ని అదానీ గ్రూప్‌కు అనుకూలంగా మార్చేందుకు నిరాకరించింది. యూఏఈకి చెందిన సెక్ లింక్ టెక్నాలజీస్ కార్పొరేషన్ దాఖలు చేసిన ఫిర్యాదుపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ధారావి ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ పనులు ఇప్పటికే మొదలయ్యాయి... కొన్ని రైల్వే క్వార్టర్లను కూల్చారని తెలిపింది. సెక్‌లింక్ మునుపటి బిడ్‌ను రద్దు చేసి అదానీ ప్రాపర్టీస్ లిమిటెడ్‌కు ధారావి ప్రాజెక్టును

- మిగతా 5 లో

కుటుంబ సర్వే అధ్యయనానికి మేధావులతో
స్వతంత్ర హోదా కమిటీ

నెల రోజుల్లో ప్రణాళిక శాఖకు నివేదిక: భట్టి

విశాలాంధ్ర–హైదరాబాద్: సమగ్ర కుటుంబ (ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధ్యయనానికి సామాజికవేత్తలతో స్వతంత్ర హోదాతో కమిటీ ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సమగ్ర సర్వే సమాచారాన్ని విశ్లేషించి చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం సలహా కమిటీ సభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మన్‌గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారని వివరించారు. నిపుణుల కమిటీ సర్వే నివేదికను నెల రోజుల్లో ప్రణాళిక శాఖకు అందజేయాలని సూచించారు. సామాజిక న్యాయానికి పునాది వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సర్వే నిర్వహించినట్టు చెప్పారు. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్ గా ఏర్పాటు చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సర్వే జరిపించినట్లు తెలిపారు. పొరపాట్లు, అపోహలకు తావు లేకుండా సమగ్ర కుటుంబ సర్వే అధ్యయనంలో మేధావులను భాగస్వాములను చేసి స్వతంత్ర హోదా కల్పించినట్టు పేర్కొన్నారు. ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో బకాయిల చెల్లింపు

ప్రభుత్వ ఉద్యోగులు తమ బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదని, అధికారంలోకి వచ్చాక రూ. పదివేల కోట్ల బకాయిలు చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సచివాలయంలో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... ఉద్యోగులు... తాము దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను అర్థం చేసుకొని ఓ నిర్ణయం తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.ఐదు వేల కోట్లు పెండింగ్‌లో ఉంచి వెళ్లిందని, 14 నెలల కాలంలో కొంత మొత్తంలో బకాయిలు జమ అయ్యాయని వివరించారు. మరో ఎనిమిది వేల కోట్లు జమ చేయాల్సి ఉందన్నారు. ఏప్రిల్ నుంచి ప్రాధాన్యత క్రమంలో ప్రతినెల రూ.500 నుంచి రూ. 600 కోట్ల వరకు బిల్స్ క్లియర్ చేస్తామన్నారు. తమ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తేదీనే జీతభత్యాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 13 లక్షల మంది (ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్) సిబ్బంది ఉన్నారని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ తదితర బిల్లును మాత్రమే పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. తమది ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, నాన్ గెజిటెడ్, గెజిటెడ్, వివిధ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు, మున్సిపల్, వైద్య ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ప్రజాభవన్‌లో అన్ని పార్టీల ఎంపీలతో భేటీ

▸ కేంద్రంపై ఒత్తిడికి ప్రభుత్వం కీలక నిర్ణయం 5లో

ఆర్టీసీ ఉద్యోగులకు 2.5 శాతం డీఏ

- సంస్థపై ప్రతినెలా రూ.3.6 కోట్ల భారం
- మహిళా సాధికార దిశగా అడుగులు: పొన్నం

విశాలాంధ్ర – హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. యాజమాన్యంతో చర్చించి 2.5 శాతం డీఏ ప్రకటిస్తున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీనివల్ల ఆర్టీసీపై ప్రతి నెల రూ.3.6 కోట్ల భారం పడనుందని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 150 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారన్నారు. దాదాపు రూ.ఐదు వేల కోట్లు సంస్థకు చెల్లించినట్టు పేర్కొన్నారు. ప్రతి రోజూ 14 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారన్నారు. దీంతో ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగినా వారు నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి అభినందించారు. ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తోందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా మొదటిసారి మహిళా సంఘాలచే బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకిచ్చి యజమానులను చేస్తూ మహిళా

- మిగతా 5 లో

డీలిమిటేషన్‌పై సమష్టి పోరు

జేఏసీ ఏర్పాటుపై 22న చెన్నైలో సమావేశం
చంద్రబాబు, రేవంత్ సహా ఏడుగురు సీఎంలకు స్టాలిన్ ఆహ్వానం

చెన్నై: హిందీ వివాదం, లోక్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై కేంద్రానికి, తమిళనాడు ప్రభుత్వానికి మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. సీఎం స్టాలిన్‌తో పాటు అధికార డీఎంకే పార్టీ నేతలు కేంద్రంపై విరుచుకుపడుతున్నారు. డీలిమిటేషన్ తమ హక్కుల్ని కాలరాస్తాయని, రాష్ట్రంలో ఎంపీ సీట్లు తగ్గుతాయని స్టాలిన్ చెబుతున్నారు. ముఖ్యంగా జనాభా నియంత్రణలో మెరుగుగా వ్యవహరించిన దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని స్టాలిన్ వాదిస్తున్నారు. అయితే, ఒక్క సీటు కూడా తగ్గదని కేంద్రం హామీ ఇచ్చినప్పటికీ... ఈ వ్యవహారం రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఈ క్రమంలో కేంద్రం ప్రతిపాదించిన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ సర్కారు చేపట్టిన పునర్విభజన కసరత్తుకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీల 'జాయింట్ యాక్షన్ కమిటీ'లో భాగస్వాములు కావాలని శుక్రవారం ఆయన ఏడు రాష్ట్రాల సీఎంలు... పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, బీజేపీ పాలిత ఒడిశా ముఖ్య మంత్రి మోహన్ చంద్ర మాఝి, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అలాగే ఈ రాష్ట్రాలలోని ప్రతిపక్ష పార్టీలు, బీజేపీకి చెందిన సీనియర్ రాజకీయ నాయకులకు లేఖలు రాశారు. మార్చి 22న చెన్నైలో జరిగే సమావేశానికి హాజరై సమష్టి కార్యాచరణను రూపొందించాల్సిందిగా కోరారు. "డీలిమిటేషన్ (పునర్విభజన) అనేది సమాఖ్యవాదంపై ప్రత్యక్ష దాడి. పార్లమెంటులో మన హక్కును తొలగించడం ద్వారా జనాభా నియంత్రణకు సహకరించిన రాష్ట్రాలను శిక్షించడం. ఈ అన్యాయాన్ని మేము అనుమతించబోము" అంటూ స్టాలిన్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. వచ్చే ఏడాది తమిళనాట ఎన్నికలు జరగనున్న క్రమంలో నూతన విద్యావిధానంలో భాగంగా కేంద్రం తీసుకొచ్చిన త్రిభాషా విధానంతో పాటు డీలిమిటేషన్‌ను స్టాలిన్ తీవ్రంగా నిరసిస్తున్నారు. ఇది రాజ్యాంగ సమాఖ్య

- మిగతా 5 లో

తొందరెందుకు?

- ఎన్ఈపీ అమలుపై డి.రాజా సూటిప్రశ్న
- ఒక భాషకే అంత ప్రాధాన్యత ఇవ్వడమేమిటని నిలదీత

న్యూఢిల్లీ: జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) అమలుకు అంత తొందరెందుకని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక భాషకే అంత ప్రాధాన్య ఇవ్వడం ఏమిటని నిలదీశారు. రాజా శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాలపై ఎన్ఈపీని హడావిడిగా రుద్దాలని ఎందుకు చూస్తున్నారని మండిపడ్డారు. ఎన్ఈపీపై అనేక విమర్శలు ఉన్నాయని, దీనిపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని రాజా చెప్పారు. ఒక భాషకు కేంద్రం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్న ఆరోపణలు, విమర్శలు ఉన్నాయని తెలిపారు. భాషపై వివాదానికి కారణం ఆర్ఎస్ఎస్, దాని అనుచరులేనని రాజా విమర్శించారు. బీజేపీ... ఆర్ఎస్ఎస్ రాజకీయ శాఖ కాబట్టి... ఆర్ఎస్ఎస్ చెప్పినట్లు బీజేపీ చేస్తోందని ఆరోపించారు. 'ఆకస్మికంగా ఎన్ఈపీని రాష్ట్రాలపై ఎందుకు రుద్దాలని చూస్తున్నారు? ఒక భాష (హిందీని ఉద్దేశించి)ను ఆపాదించేందుకేనా? ప్రత్యేకించి ఒక భాషకే ఎందుకంత ప్రాధాన్యత ఇస్తున్నారు?' అని రాజా ప్రశ్నించారు. కేంద్రం వైఖరితో తమిళనాడులో వ్యతిరేకత, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయని చెప్పారు. తమిళనాడులోని ప్రతి ఒక్కరు కేంద్రం తీరును ప్రశ్నిస్తున్నారని, ఒక భాషకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని ఆక్షేపిస్తున్నారని రాజా అన్నారు. మహారాష్ట్రలోనూ ఇలాంటి పరిస్థితి ఉందని గుర్తుచేశారు. రాష్ట్రం ఏదైనా భాషాపరమైన అసమ్మతిని రగిలిస్తున్నది ఆర్ఎస్ఎస్ కాక మరెవ్వరని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోవాలని కేంద్రానికి హితవు పలికారు.

కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం

- హైదరాబాద్‌లో సింగరేణి ఆసుపత్రి కట్టాలి
- వర్కర్ల సొంతింటి కల సాకారం చేయాలి
- సింగరేణి కార్మికుల సమావేశంలో కూనంనేని

విశాలాంధ్ర–హైదరాబాద్: కంపెనీల అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇవ్వాలని సింగరేణి కాలరీస్ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో జరిగిన 38వ నిర్మాణాత్మక సమావేశంలో కూనంనేని మాట్లాడారు. కార్మికులకు సొంతింటి కల సాకారానికి పథకాన్ని రూపొందించాలని, ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని సింగరేణి యాజమాన్యానికి సూచనలు చేశారు. సింగరేణి సంస్థను గతంలో కష్టాల నుంచి కాపాడడానికి కార్మికులు ఎన్నో త్యాగాలు చేశారని కూనంనేని గుర్తుచేశారు. కంపెనీని అగ్రస్థానంలో నిలపడానికి కార్మికులంతా తమ వంతు కృషి చేస్తారన్నారు. ఉత్పత్తిని మాత్రమే కాదు కార్మికుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. కాగా, గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ గుర్తింపు కార్మిక సంఘం తమ దృష్టికి తీసుకొచ్చిన

- మిగతా 5 లో

21 మంది ఐపీఎస్‌ల బదిలీ

విశాలాంధ్ర–హైదరాబాద్: రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీలు, ఇద్దరు డీఐజీలు, ఇద్దరు నాన్ కేడర్ ఎస్పీలు ఉన్నారు. 14 మంది ఎస్పీలకు స్థాన చలనం కల్పించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం. అదనపు డీజీ (పర్సనల్)గా అనిల్ కుమార్. ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఐడీ ఐజీగా ఎం.శ్రీనివాసులు, వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్, నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య,

- మిగతా 5 లో

21 మందికి సాహిత్య అకాడమీ
తర్జుమా పురస్కారాలు

తుర్లపాటి రాజేశ్వరి

అనిసుర్ రెహమాన్

మదన్ సోని

సాహిత్య అకాడమీ శుక్రవారం 21 మంది అనువాదకర్తలకు 2024 సంవత్సరానికిగాను పురస్కారాలు ప్రకటించింది.

5లో

ఇదీ లోకం!

సారీ 498ఎ దుర్వినియోగ మవుతుందమ్మా.. తీసేస్తే సరి!

వక్ఫ్ బిల్లును అడ్డుకుంటాం

- పార్లమెంటును స్తంభింపజేస్తాం
- ఐక్య కార్యాచరణతో విపక్షాలు ముందుకు
- జైరాం రమేశ్ వెల్లడి
- 10 నుంచి మలి దశ బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లును ముక్తకంఠంతో అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి ప్రారంభం కాబోయే మలి దశ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్న క్రమంలో దానిని అడ్డుకునేందుకు తమకున్న ఏ ఒక్క అవకాశాన్ని వదులకోబోమని ఇండియా ఐక్య సంఘటన తరపున కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఆయన శుక్రవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక విషయాలు వెల్లడించారు. పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించి... సమన్వయంతో ముందుకెళతామని జైరాం రమేశ్ తెలిపారు. కేంద్ర బడ్జెట్ మలి దశ సమావేశాలు ఈనెల

- మిగతా 5 లో

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

అన్ని రంగాల్లో రాణించాలన్నదే లక్ష్యం
పరేడ్ గ్రౌండ్‌లో మహిళా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలనలో సీతక్క

విశాలాంధ్ర–హైదరాబాద్: మహిళా ఆర్థిక స్వావలంబన దిశగా మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డి.అనసూయ (సీతక్క) అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఏర్పాట్లను కంటోన్మెంట్ శాసనసభ్యులు గణేష్, రోడ్లు భవనాలశాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇతర ఉన్నతాధికారులతో కలసి మంత్రి పరిశీలించారు. సీతక్క మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నిర్వహించనున్న మహిళా దినోత్సవ కార్యక్రమానికి మంత్రులు, శాసన మండలి సభ్యులు, ఎంపీలు,

- మిగతా 5 లో

శతవసంతాల అరుణపథం

మహిళా సమాఖ్య యుద్ధ వ్యతిరేకత

యుద్ధ వ్యతిరేకత, సకల విధ ఆయుధ పోటీకి వ్యతిరేకంగా గళం విప్పడంతో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 1954లో అవతరించింది. సీపీఐ బాటను అనుసరించే ప్రజా సంఘాలలో దాదాపు చివరన భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

సంపాదకీయం

దక్షిణాదిపై రెండు కత్తులు

దక్షిణాది రాష్ట్రాలపై నియోజకవర్గాల పునర్విభజన, బలవంతంగా హిందీని రుద్దడం అనే రెండు కత్తులు వేలాడుతున్నాయి. జనాభా లెక్కలు ముగిసిన తరవాత శాసన సభల, లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని రాజ్యాంగంలోని 82వ అధికరణం, శాసనసభ నియోజక వర్గాలను పునర్ వ్యవస్థీకరించాలని 170వ అధికరణం నిర్దేశిస్తున్నాయి. దీనికోసం పార్లమెంటు చట్టం చేయాల్సి ఉంటుంది. కరోనా మహమ్మారి విజృంభించినందువల్ల 2021లో జరగవలసిన జనాభా లెక్కల సేకరణ వాయిదా పడింది. ఆ తరవాత కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల సేకరణను సాచివేస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనలో శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల పరిధులు, ఓటర్ల సంఖ్య కూడా మారిపోతాయి. అలాగే షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు రిజర్వు చేసే స్థానాలు కూడా మారిపోవచ్చు. కొత్త నియోజకవర్గాలు ఏర్పడవచ్చు. పాతవి మారిపోనూ వచ్చు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు రిజర్వు చేయడానికి బిల్లు అయితే ఆమోదించారు. కానీ దాని అమలు జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజన తరవాత అంటున్నారు. జనాభా లెక్కల సేకరణ ఇప్పటికీ మొదలు కాలేదు. ఆ పని ముగిసి నియోజకవర్గాల పునర్విభజన 2029 సార్వత్రిక ఎన్నికలలోగా అమలయ్యే అవకాశం కనిపించడం లేదు. అంటే అయితే గియితే 2034లో అమలు కావొచ్చునేమో. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణవల్ల వివిధ రాష్ట్రాలలో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెరగనూ వచ్చు. జనాభా నియంత్రణలో ఉన్న రాష్ట్రాలలో నియోజకవర్గాల సంఖ్య తగ్గనూవచ్చు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు సానుకూల ఫలితాలు సాధించాయి. కానీ అంతిమంగా ఇది దక్షిణాది రాష్ట్రాలలో లోక్‌సభ నియోజక వర్గాలు తగ్గడానికి దారి తీసేలా ఉంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఉద్యమబాట పట్టారు. గత బుధవారం ఆయన తమిళనాడులో అఖిలపక్ష సమావేశం కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 1952, 1963, 1973, 2002లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తరవాత గత 22 ఏళ్ల నుంచి ఆ ఊసే లేదు. నికరంగా చెప్పాలంటే 1976వరకు జనాభా లెక్కలు పూర్తి అయిన తరవాత నియోజకవర్గాల పునర్విభజన కూడా జరిగింది. జనాభా నియంత్రణను సక్రమంగా అమలు చేసిన రాష్ట్రాలకు పునర్విభజన వల్ల నష్టం కలగకూడదన్న ఉద్దేశంతో ఇందిరా గాంధీ హయాంలో పునర్విభజన ఆపేశారు. 2021 జనాభా లెక్కలు పూర్తయ్యే వరకు నియోజకవర్గాల పునర్విభజన మీద నిషేధం విధించారు. 42వ రాజ్యాంగ సవరణతో ఈ నిలిపివేత చట్టబద్ధం అయింది. 2001లో నియోజకవర్గాల పరిధులను అయితే మార్చేశారు. లోక్‌సభలోనూ, శాసనసభల్లోనూ నియోజకవర్గాల సంఖ్య మాత్రం మారలేదు. దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకించినందువల్లే నియోజకవర్గాల సంఖ్య మార్చలేదు. జనాభా లెక్కలు సేకరిస్తామని, నియోజక వర్గాల పునర్విభజన కూడా పూర్తి చేస్తామని 2024 సార్వత్రిక ఎన్నికల తరవాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. పనైతే మొదలు కాలేదు. జనసంఖ్యలో మార్పుల వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ లోక్‌సభ స్థానాలు వస్తాయి. దక్షిణాది రాష్ట్రాలలో స్వల్ప మార్పులు ఉండొచ్చు. కానీ తమిళనాడుకు ఎక్కువ నష్టం కలిగే అవకాశం ఉంది. అందుకే తమిళనాడు ముఖ్యమంత్రి ఉద్యమబాట పట్టారు. 2026 కల్లా భారత జనాభా 142 కోట్లకు చేరుతుందంటున్నారు. పునర్విభజన జరిగితే కర్నాటకలో ఇప్పుడున్న 28 లోక్‌సభ స్థానాల సంఖ్య 36కు, తెలంగాణాలో లోక్‌సభ సీట్లు 17 నుంచి 20కి, ఆంధ్రప్రదేశ్ లో 25 నుంచి 28కి, తమిళనాడులో 39 నుంచి 41కి లోక్‌సభ స్థానాలు మారొచ్చు. కేరళలో జనాభా పెరుగుదల చాలా తక్కువ ఉన్నందువల్ల ప్రస్తుతం ఉన్న 20 స్థానాలు 19కి తగ్గొచ్చు. ఉత్తర ప్రదేశ్‌లో ఇప్పుడున్న 80 లోక్‌సభ స్థానాలు అమాంతం 128కి పెరిగిపోతాయి. బీహార్ లో ఇప్పుడు 40 ఉంటే 70కి పెరగొచ్చు. ఎక్కువ లోక్‌సభ స్థానాలున్న రాష్ట్రం కేంద్ర రాజకీయాలలో పెద్ద పాత్ర పోషిస్తోంది. మన ప్రధానమంత్రుల్లో ఎక్కువ మంది ఉత్తరప్రదేశ్ వారే. ఉత్తరాదిలో సీట్లు బాగా పెరిగి దక్షిణాదిలో పెద్దగా పెరగనందువల్ల జాతీయ రాజకీయాల్లో దక్షిణాది మాట చెల్లదన్న ఆందోళన బలంగా ఉంది.

నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి కలిగే నష్టం, హిందీని రుద్దే ప్రయత్నాలను నిలవరించడం కోసం బుధవారం స్టాలిన్ తమిళనాడులోని రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డి.ఎం.కె.కు ప్రధాన ప్రతిపక్షమైన ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. కూడా పాల్గొంది. 1971 నాటి జనాభా ప్రాతిపదికనే నియోజకవర్గాలను పునర్విభజించాలని, మరో 30 ఏళ్ల ఇదే ప్రాతిపదిక కొనసాగించాలని ఈ సమావేశంలో స్టాలిన్ ఒక తీర్మానం కూడా ప్రతిపాదించారు. ఎంపీల సీట్లు పెరిగితే అన్ని రాష్ట్రాలకు దామాషా పద్ధతిలో సీట్లు పెరగాలని కూడా స్టాలిన్ అంటున్నారు. స్టాలిన్ ఏర్పాటు చేసిన సమావేశానికి బీజేపీ, తమిళ్ మణీలా కాంగ్రెస్ (ఎం) లాంటి అయిదు చిన్న పార్టీలు హాజరు కాలేదు. షరా మామూలుగా తమిళనాడులో శాంతిభద్రతల పరిస్థితి క్షీణిస్తున్నందు వల్ల ఆ విషయం నుంచి జనం దృష్టి మళ్లించడానికి స్టాలిన్ ఇలాంటి పనులు చేస్తున్నారని బీజేపీ దుమ్మెత్తి పోస్తోంది. వాస్తవానికి తమిళనాడులో శాంతి భద్రతలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మరీ దిగజారిందేమీ లేదు. తమిళనాడు మౌలికంగా నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకం కాదు. కానీ జనాభా నియంత్రించడం, సంక్షేమ పథకాలు అమలు చేసినందువల్ల శిక్ష అనుభవించవలసిన పరిస్థితి రాకూడదన్నది తమిళనాడు వాదన. దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో కలిపి ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలని కూడా స్టాలిన్ ప్రతిపాదించిన తీర్మానంలో పేర్కొన్నారు. తమిళనాడు శాసనసభకు వచ్చే ఏడాది ఎన్నికలు జరగాల్సి ఉన్నందువల్ల పునర్విభజన అంశం మరింత వివాదాస్పదం అవుతోంది. జనాభా తగ్గుతున్నందువల్ల తమిళనాడుకు నష్టం కలగకూడదంటే ఒక్కో కుటుంబం 16 మంది పిల్లలను కనాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఇది ఆయన వ్యంగ్యంగా అన్న మాట మాత్రమే. నియోజకవర్గాల పునర్విభజన గురించి చర్చించడానికి వచ్చే వారం స్టాలిన్ అఖిలపక్ష సమావేశం కూడా ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే లోకసభ సభ్యుల సంఖ్య 543 నుంచి 750 దాకా పెరగొచ్చు. అదే నిష్పత్తిలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం మాత్రం పెరగదు. ఒక్క ఉత్తరప్రదేశ్ లోనే 60 శాతం సీట్లు పెరుగుతాయి. సీట్లు పెరిగే అవకాశం ఉన్న రాష్ట్రాలన్నీ బీజేపీకి ఎక్కువ బలం ఉన్న రాష్ట్రాలే. ఎన్నికలలో విజయం సాధించడానికి ఇప్పటికే అనేక వక్ర మార్గాలు అనుసరిస్తున్న బీజేపీ నియోజకవర్గాల పునర్విభజనను మరో ఆయుధంగా వినియోగించుకోవాలనుకుంటున్నట్టు ఉంది. స్టాలిన్ పోరాటం ప్రశంసనీయమైందే. కానీ నిజానికి ఇది ప్రతిపక్షాలు ఉమ్మడిగా కొనసాగించాల్సిన పోరాటం. ఈ పోరాటానికి నాయకత్వం వహించడం "ఇండియా" ఐక్య సంఘటన బాధ్యత.

రివర్స్ స్వీప్ బతుకులు

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

స్వీప్ షాట్ అంటారు క్రికెట్‌లో. అంటే బ్యాట్స్‌మన్ తనకు కుడి వైపు... లేదా..... మిడిల్ స్టంప్ మీదకు వచ్చిన బంతిని తుడిచేసే షాట్. ఏ హ్యాండ్ అయినా కావచ్చు. తుడిచేస్తున్నట్లుగా బౌండరీ లైనుకు బంతిని తరలించడం. రివర్స్ స్వీప్ అని మరో షాట్ ఉంది. అంటే కుడిచేతి బ్యాట్స్‌మెన్ ఎడమ వైపు, ఎడమ చేతి బ్యాట్స్‌మెన్ తనకు వ్యతిరేక దిశగా బంతిని పంపించడం. నిజానికి ఇది ప్రకృతి విరుద్ధం. ఆటకూ విరుద్ధమే. కానీ పరుగులే కదా ముఖ్యం. ఇలా వచ్చిన పరుగులు మరీ ముఖ్యం. మైదానంలో బ్యాట్స్‌మెన్ చుట్టూ మోహరించిన ఫీల్డర్ల కన్ను కప్పి బంతిని ఫోర్ లైన్ దాటించడమే ధ్యేయమన్న మాట. ఇంతకు ముందు సంప్రదాయ క్రికెట్‌లో ఈ బ్యాటింగ్ లేదు. ఈ వన్డేలు... ముఖ్యంగా ట్వంటీ 20 ఆధునిక క్రికెట్ వచ్చాక ఇవన్నీ చూస్తున్నాం. గొప్ప క్రికెటర్ గవాస్కర్ తన సన్నీ డేస్ ఆత్మకథలో తన బావ, ఫస్ట్ డౌన్‌లో వచ్చి తనతో అనేక భాగస్వామ్యాలు నెలకొల్పిన గుండప్ప విశ్వనాథ్ బ్యాటింగ్ గురించి రాస్తూ... "విశ్వనాథ్ ఫ్రంట్‌ఫుట్ డిఫెన్స్ ఆడితే బ్యాట్‌కి... అతను కట్టుకున్న ప్యాడ్‌కి మధ్య సూర్య కిరణాలు కూడా ప్రసరించవు" అంటాడు. అంత గొప్ప బ్యాట్స్‌మెన్ విశ్వనాథ్ అని చెప్పడానికి ఈ ఉపమానం వాడాడు గవాస్కర్. ఇలా ఉండేది క్రికెట్ ఆనాడు. రోజులు మారాయి కదా. క్రికెట్ లాగే జీవితాలు కూడా రివర్స్ స్వీప్‌లో నడుస్తున్నాయి.

ఇప్పుడంతా రివర్స్ స్వీప్ జీవితాలు. ఎంత త్వరగా ఎదిగాం. ఎన్ని కోట్లు సంపాదించాం. ఎన్ని ఇళ్లు కట్టాం. ఎంత బంగారం వెనకేసుకున్నాం అన్నదే ఇక్కడ ప్రధానం. ఇదంతా బాగానే ఉంది. ఈ ఎదుగుదలలో మనల్ని మనం కోల్పోతున్నాం కదా. మనకి మనం కాకుండా పోతున్నాం కదా. మన వారికి మనం దూరమవుతున్నాం కదా. కారులో పెళ్లికి వెళ్లినా... నడుచుకుంటూ వెళ్లినా ఒకే విధమైన గౌరవ మర్యాదలు పొందుతున్నాం కదా. పార్కింగ్‌లో కారు నిలబెట్టాక మన కాళ్ల మీదే మనం నడుచుకుంటూ వెళ్లాలి కదా. అక్కడ వండి వార్చిన పంచభక్ష్య పరమాన్నాలూ అందరూ ఆస్వాదిస్తున్నారు కదా. మహా అయితే, సూట్లు, బూట్లు, పట్టు చీరల ధగధగలు, నగల మెరుపులు మినహా మిగిలినదంతా సేమ్ టూ సేమ్ కదా. ఆ రెండు రోజుల వేడుక తర్వాత ఎవరికి వారే యమునా తీరే కదా. మరి ఈ ఆర్భాటాల వైపు చూపు ఎందుకు పడుతోంది. నేటి క్రికెట్‌ని జీవితానికి అన్వయించుకుంటే మన బతుకులు సక్రమంగానే ఉన్నాయా. రివర్స్ స్వీప్‌లో జీవితాల్లో ఎదగాలనుకుంటున్న వారికి ఆ జీవిక ఆనందాన్ని మిగులుస్తోందా. మానవ సంబంధాల వైకుంఠపాళిలో నిచ్చెనలు ఎక్కుతున్నామన్న ఆనందంలో విలువలు వదిలేసి పాము నోట్లోకి జారుకుంటున్నామనే ఎరుకలో ఉంటున్నామా. ఇంతెందుకు మన బతుకుల్ని మనం సక్రమంగానే కాపాడుకుంటున్నామా. మన సాహిత్యాన్ని మనం చదువుకుంటున్నామా. మన సినిమాలనే మనం చూస్తున్నామా. బర్గర్లు, పిజ్జాల మాయలో పడి తెలుగు భోజనాన్ని ఆస్వాదిస్తున్నామా. మంచి పద్యం ఒకటి చదివి ఎన్నాళ్లయ్యిందో మనకి గుర్తుందా. మంచి కాఫీ తాగి, మంచి మనిషి ఎదురై, మంచి పాట విని ఎన్నాళ్లయ్యిందో ఎవరైనా చెబుతారా. కంటినిండా మంచి నిద్ర పోతున్నామా. అసలు మన బతుకు పరాయి వాసనతో నిండిపోతోందనే విషయం మనం గమనిస్తున్నామా. ఇంటి ముందు ఓ పూల మొక్క, ఇంటి వెనుక తులసి మొక్క, ఇంటి స్తంభాలకు అల్లుకున్న మల్లెతీగ, ఎండ వేళ బావిలోంచి చేదుకున్న చల్లటి నీళ్లతో మన ముఖం మనం కడుక్కోవడాన్ని ఎప్పుడైనా తలచుకున్నారా. కాలాన్ని బట్టి కాకుండా ఏ కాలంలోనైనా దొరికే పళ్లు, ఫలాలు మన నోటికి రుచిని అందిస్తున్నాయా. ఏ కాలంలోనైనా దొరుకుతాయి అనే ఓ కాలాతీత ఆనందాన్ని అనుభవిస్తున్నాం కదా. ఇది రివర్స్ జీవితమే కాదు... వ్యతిరేక దిశలో తిరుగుతున్న కాల మహిమే కదా. విశ్వసృష్టి చేసిన బ్రహ్మను కాదని సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడి మాయలో మనకి తెలియకుండానే మనం పడిపోతున్నాం కదా.

కుటుంబమంతా కూర్చుని కబుర్లు కలబోసుకుంటూ గుప్పెడు మెతుకులు పంచుకుంటున్నామా. ఆ సామూహిక కుటుంబ భోజనాల గురించి ఈ తరానికి ఎవరైనా చెబుతున్నారా. అమ్మ కావచ్చు, అక్క కావచ్చు, చెల్లెలు కావచ్చు, వదినో, మరదలో, మేనత్తో, పిన్నో వండిన వంట గురించి, ఆ వంట కోసం నాన్నో, బాబాయో, బావో, మేనమామో చేసిన చేతనైన సాయం ఇప్పుడు పురుష పుంగవులు చేస్తున్నారా. అసలు అలాంటి వంటిల్లు మనకి ఎక్కడైనా తారసపడిందా. స్విగ్గి, జొమాటాలే మన వంటిల్లుగా రూపాంతరం చెంది మనల్ని మానవ సంబంధాల నుంచి దూరం చేస్తున్నాయని ఒక్కసారైనా యోచిస్తున్నామా. అరచేయంత హైబ్రీడ్ జామకాయని చిన్న చిన్న కన్నాలున్న తెల్లని ప్లాస్టిక్ సంచుల్లో చుట్టి అమ్ముతున్న వాటిని మహదానందంగా కొంటున్నాం కదా. ఆ జామకాయలు మన చిన్నప్పుడు పచ్చివే కావచ్చు... దొంగతనంగా కోసిన జామ కాయలకు సరి తూగవనే వాస్తవాన్ని అంగీకరించగలమా. అసలు జీవితాలే హైబ్రీడ్‌గా మారుతున్న గరళం మన కళ్లకి కాన వస్తోందా. జీవితాలు రివర్స్‌లో ఉన్నప్పుడు... అరచేతి వేళ్ల సందుల్లోంచి జీవితాలు జారిపోతున్నాయని ఒక్కసారైనా అనుకుంటున్నామా.

ఐదు రోజుల సంప్రదాయ క్రికెట్ నుంచి రివర్స్ స్వీప్‌లు ఎంత స్పీడుగా వచ్చాయో మన జీవితాలు కూడా అలాగే వ్యతిరేక దిశలో పరుగులు పెడుతున్నాయి. నాకు తెలియక అడుగుతున్నాను... మొత్తం జీవితాన్ని రివర్స్ చేసుకుని బాల్యంలోకి ప్రయాణించగలమా!?.. రివర్స్ జీవితాలను గడుపుతూ తలకిందులుగా వేళ్లాడుతున్నామనే స్పృహతోనే బతుకుతున్నామా...!? అసలు మనం జీవిస్తున్నామా...!? బతుకుతున్నామా...!? జీవిస్తున్నామనుకుని మరణిస్తున్నామా...!? బతుకుతున్నామనుకుని జీవచ్ఛవాలుగా మిగులుతున్నామా...!? ఈ అంశాన్నే నా అగ్రహారం కథల్లోని ఓ కథలో అన్నాను. ప్రమాదవశాత్తూ మరణిస్తున్నారని అంటున్నారు కాని... ఈ సంక్షుభిత సమాజంలో మనం ప్రమాదవశాత్తూ బతుకుతున్నాం...! అని.

ఇప్పుడు చెప్పండి అమ్మలు... అయ్యలు... "వాట్ టూ డూ... వాట్ నాట్ టూ డూ"...

– సీనియర్ జర్నలిస్టు, 99120 19929

సాధికారతతోనే మహిళాభ్యుదయం

అక్కినేని వనజ

నేటి మన జీవన విధానం మారుతోంది. చేస్తున్న వృత్తి ఉద్యోగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. నేడు మహిళ ఇంటి నాలుగు గోడలకే పరిమితం కాదు. ఒకప్పుడు స్త్రీ భర్తచాటు భార్యగా వుండేది. భర్త సంపాదిస్తే వండి పెట్టి బిడ్డల్ని సాకేది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి శరవేగంగా ప్రపంచ నలుమూలలకూ విస్తరిస్తోంది. అన్ని రంగాల్లో పురుషులతో పోటీపడుతూ మహిళ అభివృద్ధి సాధిస్తోంది. భర్తతో సమానంగా సంపాదించి తెస్తోంది. ఏ పనిలోనూ నేను స్త్రీని అన్న మినహాయింపు ఆమె కోరడం లేదు. దేనికి ఒకరి మీద ఆధారపడకూడదని స్వతంత్ర వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటోంది. అందుకు సమాజం, వ్యవస్థ దోహదం చేస్తున్నాయి. కళ్లెదుట కనిపించే ఈ మార్పుని అర్థం చేసుకుని దానికి అనుగుణంగా మారాల్సిన బాధ్యత మాత్రం పురుషుడు మర్చిపోతున్నాడు. అందుకే ఎన్నో కొత్త చట్టాల అవసరం తలెత్తుతోంది.

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లింగ వివక్ష అంతం, లింగ సమానత్వం, బాలికలు, మహిళల హక్కులు, సాధికారత దిశగా సాగుతున్న పోరాటాలు ఈ ఏడాది వేగవంతం చేయాలని ఐక్యరాజ్య సమితి ఉద్ఘాటించింది. 30 సంవత్సరాల క్రితం (1995) బీజింగ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సదస్సులో చేసిన ప్రకటన చాలా ప్రాముఖ్యత కల్గినది. 189 దేశాల నుంచి 70,000 పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. మహిళా రాజకీయ, ఆర్థిక సాధికారత దిశగా ప్రపంచ దేశాలు సాగాలని పిలుపు నిచ్చాయి. న్యాయబద్ధమైన అభివృద్ధి చెందిన సుస్థిర సమాజంలోనే మహిళలకు న్యాయం జరుగుతుంది. ఈనాటికి మహిళలపై కొనసాగుతున్న హింస, వివక్షత, దోపిడీని సవాలు చేస్తూ బాలికలు, మహిళలు పూర్తిస్థాయి మానవ హక్కుల కొరకు అవిశ్రాంతంగా పోరాడాల్సిన అవసరముంది.

19వ శతాబ్దంలో, పారిశ్రామీకరణ అభివృద్ధి చెందుతున్న తరుణంలో అమెరికా, యూరప్ దేశాలలో శ్రామిక మహిళలు, కుట్టు పరిశ్రమలలో అనేక పని గంటలు, దుర్భరమైన ప్రదేశాలలో పని చేసేవారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమాలు ప్రారంభమయ్యాయి.

వేలాది మంది శ్రామిక మహిళలు సమ్మెలు చేశారు. పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిపారు. 1907లో అమెరికాలో 15 వేల మంది శ్రామిక మహిళలు ప్రదర్శన జరిపారు. ఈ సమ్మెపై పాలకులు విరుచుకుపడ్డారు. అప్పటికే చాలా ఘటనలు చోటు చేసుకున్నాయి. అనేక మంది మరణించారు. ఈ దశలో అంతర్జాతీయ సోషలిస్టు మహిళలు క్లారాజట్కిన్ నాయకత్వాన జర్మనీలో మొట్ట మొదట సమావేశం జరిగింది. అనేక సమస్యలపై చర్చించారు. మహిళలు ఓటు హక్కు, అంతర్జాతీయ మహిళా దినం, పని గంటల భారం కుదింపు లాంటి సమస్యలపై చర్చించి తీర్మానం చేశారు. మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహించాలని ప్రకటించారు. ఈ చారిత్రక తీర్మానం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవటానికి మూలం అయింది. అప్పటి నుంచి అనేక దేశాలలో మహిళలు, శ్రామిక మహిళలు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చే విధంగా పోరాటాలు సాగించారు.

1972లో ఐక్యరాజ్య సమితి మహిళా కమిషన్ సమావేశంలో అంతర్జాతీయ ప్రజాస్వామ్య మహిళా సమాఖ్య మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరపాలని తీర్మానం ప్రవేశపెట్టారు. 1975లో ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని ఆమోదించి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినంగా ప్రకటించింది. మహిళా సంక్షేమం, అభివృద్ధి, సమానత్వం, రాజకీయ ఆర్థిక సాధికారత దిశగా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు ఐరాస విజ్ఞప్తి చేసింది. 2010 సంవత్సరంలో యుఎన్‌ఓ ప్రకటించిన సహస్రాబ్ది లక్ష్యాలలో కూడా సింహ భాగం మహిళల సమస్యలను గుర్తించారు. ఈ దశలో భారతదేశంలో అనేక మహిళా సంక్షేమ పథకాలు, విద్యాహక్కు చట్టం, మహిళలపై సాగుతున్న అత్యాచారాలు, హింసకు వ్యతిరేకంగా చట్టాలు వచ్చాయి.

ప్రపంచ స్థాయి మహిళల శిఖరాగ్ర సమావేశాలు అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాల మహిళల బహు ముఖాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయి. యుఎన్‌ఓ 1979లో మహిళా వివక్షను అంతం చేయాలని తీర్మానం చేయటం ప్రాముఖ్యత సంతరించుకుంది. 2011 సంవత్సరాన్ని భారత ప్రభుత్వం మహిళా సాధికారత సంవత్సరంగా ప్రకటించింది. ప్రతి సంవత్సరం యుఎన్‌ఓ ఒక నినాదంతో మహిళా సమస్యలను గుర్తించటం, తద్వారా ప్రభుత్వాలు ఆ వైపుగా విధానాలు రూపొందించటానికి అవకాశం ఏర్పడింది. ఇండియాలో 1950లో రాజ్యాంగం ఏర్పరచుకొన్నాక, వివక్షతకు గురవుతున్న మహిళలకు చట్టరీత్యా సమానత్వం, స్వేచ్ఛ కల్పించటం ఒక గొప్ప మలుపుగా చూడవచ్చు. సమాజంలో మహిళాభివృద్ధిని బట్టి సమాజాభివృద్ధి చూడాలన్న అంబేద్కర్, మహిళాభివృద్ధి జరిగితేనే సమాజాభివృద్ధి జరుగుతుందన్న నెహ్రూ వ్యాఖ్యలు అందరికీ శిరోధార్యం. అవనిలో సగం అంటున్నప్పటికీ స్త్రీలను రాజకీయ, ఆర్థిక రంగాలలో భాగస్వామ్యం చేయటంలో భారతదేశం చాలా వెనుకబడి ఉంది. అనేక రంగాలలో ఆకలి, దారిద్ర్యం, మహిళలలో రక్తహీనత, పని పిల్లలు, 5సంవత్సరాలలోపు పిల్లలకు పౌష్టికాహార లోపం వంటి అంశాలలో చాలా దేశాలతో పోల్చితే మనం అట్టడుగు స్థితిలో ఉన్నాం. మహిళలలో 56% రక్తహీనతతో ఉన్నారు. ఆరోగ్యకరమైన భావి భారత పౌరులను ఎలా అందించగలరో ఆలోచించాలి.

రువాండా, నార్వే, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, ఫ్రాన్స్, ఐర్లాండ్, ఫిన్‌లాండ్, కెనడా, జర్మనీలలో స్త్రీలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారు. అనేక దేశాలలో మహిళలపై హింస, వివక్షతకు వ్యతిరేకంగా స్పెయిన్, పోర్చుగల్, అర్జెంటైనా దేశాలలో చట్టాలు చేశారు. ఇప్పటికీ లింగ సమానత్వం సాధించాలంటే 179 సం॥లు పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. స్త్రీలు పెద్ద ఎత్తున అధిక శ్రమ చేస్తున్నారు. ఇంటా, బయటా శ్రమిస్తున్న మహిళకు గుర్తింపు ప్రశ్నార్థకంగా ఉంది. ఇండియాలో మహిళా శ్రామిక శక్తి సన్నగిల్లుతోంది. ఇప్పటికే 80 శాతం మంది అసంఘటిత రంగాలలో పని చేస్తున్నారు. ఉద్యోగ భద్రత, వేతనాల సమస్య, అరకొర సౌకర్యాలతో దుర్భరమైన పరిస్థితులలో పని చేస్తున్నారు. ఆర్థిక అంతరాలు పెరిగాయి. తిరిగి వలసవాద రోజుల ధోరణులు ప్రబలుతున్నాయి.

దేశంలో స్త్రీలు గౌరవప్రదమైన జీవితం సాగించటానికి అనేక అడ్డంకులు ఎదుర్కోవలసి వస్తుంది. అత్యాచార సంఘటనల పరంపరలు ఆందోళన కల్గిస్తుంది. గుజరాత్ మారణహోమంలో, మణిపూర్‌లో జరిగిన, జరుగుతున్న ఆకృత్యాలు ఆవేదనకు గురి చేస్తున్నాయి. న్యాయం కోసం సంవత్సరాలుగా ఎదురుచూపులు, ప్రశ్నిస్తున్న గొంతులను లేకుండా చేయటం, లేదా జైలు పాలు చేయటం జరుగుతోంది. సనాతన ధర్మం పేరుతో, మనువాద ధోరణులతో సమాజాన్ని తిరోగమన దశకు తీసుకువెళ్లే ప్రయత్నంలో మహిళల స్థితి మరింత దుర్భరంగా మారుతోంది. ఈ స్థితి నుంచి స్త్రీలు గౌరవప్రదమైన జీవితం మా హక్కు, అది ఒకరిచ్చే దాతృత్వం కాదు అంటూ ఉద్యమించాలి. ఐక్యరాజ్య సమితి ఇచ్చిన నినాదాన్ని లింగ అసమానతలను శాశ్వతం చేస్తున్న అడ్డంకులను పరిష్కరించే వైపుగా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. స్త్రీల రాజకీయ, ఆర్థిక సాధికారత, లింగ సమానత్వం మహిళా హక్కుల కొరకు మహిళలు సంఘటిత శక్తిగా ముందుకు రావాలి. దాని కోసం పోరాడుదాం.

– గౌరవాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య

మహిళా సమాఖ్య యుద్ధ వ్యతిరేకత

ఆర్వీ రామారావ్

మహిళా సమాఖ్య యుద్ధ వ్యతిరేకత యుద్ధ వ్యతిరేకత, సకల విధ ఆయుధ పోటీకి వ్యతిరేకంగా గళం విప్పడంతో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) 1954లో అవతరించింది. సీపీఐ బాటను అనుసరించే ప్రజా సంఘాలలో దాదాపు చివరన భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడింది. "మాకు యుద్ధం వద్దు. ఇక్కడే కాదు ప్రపంచంలో ఎక్కడా యుద్ధం వద్దు. అన్ని రకాల అణుపరీక్షలను నిలిపివేయాలని, ప్రపంచ సంక్షేమం కోసం యుద్ధాలను ఆపేయాలని, యుద్ధాలలో మనుషులను, డబ్బును, మేధస్సును వృథా చేయవద్దు. మానవ సామర్థ్యాన్ని మానవాళి సంక్షేమం కోసం వినియోగించాలి కానీ యుద్ధ సన్నాహాల కోసం కాదు" అని 1957లో విజయవాడలో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య వేదిక నుంచి ఆ సమాఖ్య అధ్యక్షురాలు పుష్పమొయీ బోస్ పిలుపు ఇచ్చారు. దీన్ని బట్టి మహిళలను సంఘటితం చేయడంలో సీపీఐ మొదటి నుంచి యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తోందని అర్థం అవుతోంది. శాంతిని కాంక్షించే వారెవరూ ఎక్కడైనా యుద్ధ వ్యతిరేకులుగానే ఉంటారు. మహిళలు మరీ ముఖ్యంగా యుద్ధాన్ని ఈసడిస్తారు. మహిళా సమాఖ్య అవతరణే ఈ నినాదాన్ని ప్రతిధ్వనించడంతో మొదలు కావడం ప్రత్యేకంగా గుర్తించదగిన అంశం.

సీపీఐ మహిళా విభాగం "భారత జాతీయ మహిళా సమాఖ్య" యుద్ధ వ్యతిరేక విధానంతోనే 1954 జూన్ 4న ఏర్పడింది. అరుణా ఆసఫ్ అలీతో సహా మహిళా ఆత్మ రక్షా సమితికి చెందిన వారు మహిళా సమాఖ్య ఏర్పాటులో పాత్రధారులయ్యారు. అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతున్న తరుణంలో, సైనిక ఒప్పందాలు కుదురుతూ, సైనిక కూటములు ఏర్పడుతున్న దశలో భారత జాతీయ మహిళా సమాఖ్య అవతరించడం స్త్రీల క్రాంతదర్శిత్వానికి అద్దం పట్టింది. భారత జాతీయ మహిళా సమాఖ్య మొదటి మహాసభ కలకత్తాలో జరిగింది. భారీ ఎత్తున మానవ హననానికి కారణమయ్యే హైడ్రోజన్ బాంబు, అణుబాంబు, క్రిమి ఆయుధాలను మహిళా సమాఖ్య ఆరంభం నుంచి వ్యతిరేకిస్తూనే వచ్చింది. విద్యా మున్షీ, ఇలా రీడ్, హజ్రా బేగం, అన్న మస్కరేన్, రేణు చక్రవర్తి, తారారెడ్డి, శాంతా దేవ్, అహసూయా జ్ఞాన్ చంద్ లాంటి వారు అంతర్జాతీయ ప్రజాస్వామ్య మహిళా సమాఖ్య, తల్లుల ప్రపంచ మహిళా సభ, ఆఫ్రో ఆసియా మహిళా మహాసభ, అమెరికాపై వియత్నాం యుద్ధంలో విజయం సాధించిన సందర్భంగా వివిధ దేశాల్లో జరిగిన మహిళా మహాసభలకు హాజరయ్యారు.

భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పాటు ప్రధాన ఉద్దేశం మహిళల హక్కులను పరిరక్షించడం. మహిళా సమాఖ్య వ్యవస్థాపక సమావేశానికి అప్పటికే పని చేస్తున్న 39 మహిళా సంఘాలు జాతీయ మహిళా సంఘాల వారు హాజరయ్యారు. వారంతా భారత జాతీయ మహిళా సమాఖ్యలో చేరిపోయారు. జాతీయ మహిళా సంఘంలో రైతులు, కార్మికులు, గిరిజనులు, దళితులు, శరణార్థులు, వృత్తి నిపుణులు, మేధావులు కూడా భాగస్వాములయ్యారు. పశ్చిమ బెంగాల్ లోని మహిళా ఆత్మ రక్షా సమితి, పంజాబ్ లోని లోక్ స్త్రీ సభ, ఒరిస్సాలోని నారీ మంగళ్ సమితి, మణిపూర్ లోని మణిపూర్ మహిళా సమితి భారత జాతీయ మహిళా సమాఖ్యలో భాగస్వాములైపోయాయి.

సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పుష్పమొయీ బోస్ ఎన్నికయ్యారు. అనసూయా జ్ఞాన్ చంద్, కపిల ఖండ్వాలా, అరుణా ఆసఫ్ అలీ, డా. నిరుపమ రథ్, దీనా పాఠక్, డా. కె.సరదమొని ఈ మహిళా సమాఖ్య అధ్యక్షులుగా పని చేశారు. సైదా హమీద 2024 నుంచి జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్నారు. అరుణా రాయ్ రెండు సార్లు అధ్యక్షులుగా పని చేశారు. 1994 నుంచి 1999 దాకా ఆంధ్రప్రదేశ్ కు చెందిన గుజ్జుల సరళా దేవి జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ల రూపకర్త, సీనియర్ పార్లమెంటేరియన్ గీతాముఖర్జీ కూడా ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ అధ్యక్షురాలిగా పనిచేశారు.

అరుణా ఆసఫ్ అలీ

రేణు చక్రవర్తి

గీతా ముఖర్జీ

గుజ్జుల సరళా దేవి

ఖర్చు భరిస్తేనే రక్షణ

నాటో దేశాలకు ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్: ఖర్చు భరిస్తేనే రక్షణ ఇస్తామంటూ నాటో సభ్యదేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. 75 ఏళ్ల నాటో మిత్రపక్షాలన్నీ రక్షణ కోసం అదనంగా వెచ్చించాల్సిన అవసరం ఉంది... ప్రస్తుత కేటాయింపులు సముచితంగా లేవు అని ఆయనన్నారు. ట్రంప్ ఓవల్ ఆఫీసు వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఇది ఇంగితజ్ఞానానికి సంబంధించిన అంశం అని చమత్కరించారు. అదనంగా చెల్లించడానికి ఇష్టపడకపోతే, నేను కూడా వారికి రక్షణ కల్పించలేను' అని ట్రంప్ అన్నారు. అయితే ఈ ఆలోచన ఇప్పటిది కాదని... చాలా ఏళ్లుగా తనకు ఉన్నదని చెప్పారు. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు కూడా నాటో మిత్రపక్షాలకు ఇదే అంశంపై చర్చించినట్లు గుర్తుచేశారు.

మీ కోసం వస్తున్నాం... వ్యోమగాములతో ట్రంప్

'మేము మీ కోసం వస్తున్నాం... మిమ్మల్ని క్షేమంగా భూమి మీదకు తెస్తాం' అని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగాములతో ట్రంప్ అన్నారు. భారత సంతతి వ్యోమగామి సునితా విలియమ్స్, బచ్ విల్మోర్ కోసం వ్యక్తిగతంగా రెస్క్యూ బృందాన్ని పంపేందుకు ట్రంప్ సిద్ధమయ్యారు. ఇదే క్రమంలో ఎలన్ మస్క్‌ను ఆశ్రయించారు. మరో రెండు వారాల్లో ఇద్దరు వ్యోమగామలు తిరిగి రాగలని ఆకాంక్షించారు. ఆ మేరకు మస్క్ ఏర్పాట్లు చేస్తున్నారని ట్రంప్ తెలిపారు. నేను నౌకలో అంతరిక్ష యానానికి వెళ్లనా అంటూ విలేకరుల్లో నవ్వులు పుట్టించారు. మస్క్ స్పందిస్తూ 'ఎనిమిది రోజుల కోసం వెళ్లిన వారు ఎనిమిది నెలలు ఉండిపోవాల్సి వచ్చింది. ఈ వ్యోమగాములను ఆరు నెలల క్రితమే స్పేస్ ఎక్స్ మరొక డ్రాగన్‌ను పంపేది కానీ అప్పటి బైడెన్ ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో వారు అక్కడే ఉండిపోయారు. ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఇద్దరు వ్యోమగాములను త్వరగా తీసుకురమ్మన్నారు' అని పేర్కొన్నారు.

పరస్పర సహకారంతోనే ఉత్తమ ఫలితాలు

భారత్-చైనా బంధంపై వాంగ్ యీ

బీజింగ్: పరస్పర సహకారంతోనే భారత్-చైనా ఉత్తమ ఫలితాలు సాధించగలవని బీజింగ్ విదేశాంగ మంత్రి వాంగ్ యీ అన్నారు. రెండు దేశాలు అన్ని స్థాయిల్లోనూ సానుకూల విజయాలు సాధించాయని తెలిపారు. భారత్-చైనా మధ్య 75ఏళ్ల సంబంధాలను గుర్తుచేసుకున్నారు. తూర్పు లడాఖ్‌లో నాలుగేళ్ల ప్రతిష్టంభనకు ముగింపు పలికిన తర్వాత అన్ని స్థాయిల్లోనూ అద్భుత ఫలితాలను కలిసి సాధించామన్నారు. వాంగ్ యీ శుక్రవారం వార్షిక విలేకరుల సమావేశంలో భారత్-చైనా ద్వైపాక్షిక బంధంపై మాట్లాడారు. కలిసి పనిచేయడమే ఉత్తమం అని అన్నారు. ఆసియాలోనే కీలకమైన తమ రెండు దేశాల మధ్య సహకారం కీలకమని... చైనా, భారత్ అధినేతల భేటీ అనంతర పరిణామాలు సానుకూలంగా పరిణమించాయని చెప్పారు. పరస్పరం విజయానికి రెండు దేశాలు సహకరించుకోవాలని సూచించారు. తమ మధ్య బంధం పటిష్ఠంగా ఉంటే ప్రపంచానికి, గ్లోబల్ సౌత్‌కు ప్రయోజనం ఉంటుందని వాంగ్ యీ చెప్పారు. తమ మధ్య వివాదాలను దౌత్యపరంగా పరిష్కరించుకోవాలని, సమష్టి ప్రయోజనాలను కాపాడుకోవాలని, సహకారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సరిహద్దు వివాదాలు లేదా ఇతర అంశాల్లో అభిప్రాయ భేదాల వల్ల మొత్తంగా ద్వైపాక్షిక బంధంపైనే ప్రభావం పడరాదని అభిప్రాయపడ్డారు. రెండు పెద్ద పొరుగు దేశాలుగా పరస్పరం సహకరించుకుంటూ విజయాల్లో తోడ్పాటు అందించుకుందామని పిలుపునిచ్చారు. డ్రాగన్‌కు, గజరాజుకు మధ్య సహకార భాగస్వామ్యమే రెండు దేశాలకు సరైన ఎంపికని వక్కాణించారు. కలిసి ముందుకెళ్లేందుకు రెండు దేశాలకు చాలా కారణాలు ఉన్నాయని, ఉమ్మడిగా మరిన్ని విజయాలు సాధించగలమని వాంగ్ యీ అన్నారు. రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాలకు ఐక్యతా మార్గమే ఉత్తమమన్నారు. ఈ ఏడాదితో చైనా-భారత్ దౌత్య బంధానికి 75 ఏళ్లు అవుతాయని, మరింత బలంగా ముందుకెళదామని, అంతర్జాతీయ వ్యవహారాల్లో గొప్ప ప్రజాస్వామ్యంగా సమష్టి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. భారత్‌తో కలిసి పనిచేసేందుకు చైనా ఎప్పుడూ సిద్ధమేనని చెప్పారు. మరింత సుస్థిరాభివృద్ధి దిశగా పురోగతి సాధించడం కోసం చైనా వేచివున్నదని వాంగ్ యీ వెల్లడించారు.

10న సౌదీకి జెలెన్‌స్కీ

కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఈనెల 10న సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. రష్యాతో యుద్ధం ముగించే దిశగా ఉక్రెయిన్, అమెరికా సీనియర్ అధికారుల చర్చలకు ముందు రోజు ఆయన సౌదీ చేరుకుంటారు. యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ కావడమే తన సౌదీ పర్యటన ఉద్దేశంగా ఎక్స్‌లో జెలెన్‌స్కీ వెల్లడించారు. అనంతరం తమ బృందం సౌదీలో ఉండి అమెరికా భాగస్వాములతో కలిసి పని చేస్తుందని తెలిపారు. శాంతికి ఉక్రెయిన్ కట్టుబడి ఉందని జెలెన్‌స్కీ వెల్లడించారు.

సిరియా ఘర్షణల్లో 70 మందికిపైగా మృతి

అలెప్పో: సిరియాలో అత్యవసర పరిస్థితి నెలకొంది. భద్రతా దళాలకు, మాజీ అధ్యక్షుడు బషర్ అసద్ విధేయ సాయుధులకు మధ్య ఘర్షణలలో 70 మందికిపైగా చనిపోయారు. ప్రభుత్వ పరిధిలో లేని ప్రాంతంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నట్లు సిరియా అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ శుక్రవారం తెలిపింది. పరిస్థితిని అదుపు చేయడం కోసం అసద్‌కు మద్దతుగా ఉన్న మైనారిటీ అలావిటే వర్గం అధిపత్య ప్రాంతంలోని లతకియా, టార్టస్ నగరాలకు, చుట్టుపక్కల పట్టణాలు, గ్రామాలకు అదనపు బలగాలను ప్రభుత్వ దళాలు అర్ధరాత్రి పంపినట్లు మీడియా పేర్కొంది. అసద్ ప్రభుత్వం కూలిన తర్వాత ఇంత తీవ్రస్థాయిలో ఘర్షణలు జరగడంతో ఇదే మొదటిసారి. శుక్రవారం ఉదయం లటాకియాలో భారీగా బలగాలు మోహరించారు. పౌరులు వీధుల్లోకి రాకుండా కర్ఫ్యూ విధించారు. ఇతర కోస్తా ప్రాంతాల్లోనూ భద్రత కట్టుదిట్టం చేశారు. అయినప్పటికీ చెదురు మదురు ఘటనలు చోటుచేసుకున్నట్లు భద్రతా దళ సభ్యులు తెలిపారు. బ్రిటన్‌కు చెందిన సిరియా అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ స్పందిస్తూ గురువారం మధ్యాహ్నం హింస మొదలు కాగా ప్రభుత్వ దళ సభ్యులు 35 మంది, అసద్ విధేయులు 32 మంది, నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించింది. బనియాస్, జబ్లే కోస్తా పట్టణాల్లోని శివారు ప్రాంతాలు ఇప్పటికీ అసద్ విధేయుల అధీనంలోనే ఉన్నాయని అబ్జర్వేటరీ చీఫ్ రమీ అబ్దురెహమాన్ తెలిపారు.

ద.కొరియా మాజీ అధ్యక్షుడు యూన్‌కు ఊరట

సియోల్: దక్షిణ కొరియాలో మార్షల్ లా అమలు చేసి క్రిమినల్ కేసులో జైలుకు వెళ్లిన మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు ఊరట లభించింది. అరెస్టు అయిన నెల తర్వాత ఆయన విడుదలకు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. విచారణకు భౌతికంగా హాజరు కాకుండా యూన్‌కు అవకాశం కల్పించింది. ఇక అభిశంసనపైనా త్వరలోనే నిర్ణయం రానున్నది. యూన్‌ను బాధ్యతల నుంచి తప్పించాలా లేదా అన్నది కోర్టు నిర్ణయిస్తుంది. అరెస్టుకు సంబంధించిన అధికారిక గడువు ముగిసినందున తనను జైలు నుంచి విడుదల చేయాలన్న యూన్ అభ్యర్థనను సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు అంగీకరించింది. ఆయనను విడుదల చేయాలని ఆదేశాలిచ్చింది. కోర్టు తీర్పును యూన్ తరపు న్యాయవాదుల బృందం స్వాగతించింది. యూన్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రాసిక్యూటర్లను కోరింది.

బీఎడ్ పరీక్ష పేపర్ లీక్

(మూడోపేజీ తరువాయి)

ప్రశ్నపత్రం లీక్ అయిందని విమర్శలు వెల్లువెత్తాయి. ఇంకోవైపు పరీక్షల నిర్వహణపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఉన్నతాధికారులను వివరణ కోరగా... ఈ అంశంపై తమకు ఫిర్యాదు అందలేదని చెప్పుకొచ్చారు. గతంలో యూనివర్సిటీ తరపున ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్‌కు పంపించి... అక్కడి నుంచి పరీక్షా కేంద్రాలకు తరలించేవారు. ఈసారి మాత్రం ప్రశ్నపత్రాలను కాలేజీలకు సీడీల్లో పంపించారు. అరగంట ముందు సీడీ పాస్‌వర్డ్‌లు యాజమాన్యాలకు పంపిస్తున్నారు. దీంతో ప్రశ్నపత్రాల విషయంలో పోలీసుల పర్యవేక్షణ లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తాయి. యాజమాన్యాలకు పాస్‌వర్డ్ రాగానే ప్రశ్నపత్రాన్ని విద్యార్థులకు పంపిస్తున్నారు.

కుప్పకూలిన యుద్ధ విమానం

(మూడోపేజీ తరువాయి)

దూకేశాడు' అని భారత వైమానిక దళం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలియజేసింది. ప్రమాదానికి దారితీసిన పూర్తి కారణాలపై శాఖాపరమైన విచారణ జరపనున్నట్టు పేర్కొంది. పంచకుల జిల్లాలోని పర్వత ప్రాంతంలో విమానం కుప్పకూలినట్టు రాయ్‌పురానీ ఎస్‌హెచ్‌ఓ మీడియాకు ఫోనులో తెలిపారు.

ధారావి ప్రాజెక్టు ఆపలేం: సుప్రీం

(మూడోపేజీ తరువాయి)

మహారాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడంపై సర్వోన్నత న్యాయస్థానాన్ని సెక్‌లింక్ ఆశ్రయించింది. బాంబు హైకోర్టు తీర్పును సవాల్ చేసింది. విచారణ క్రమంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని చెల్లింపులు ఒకే ఎస్క్రో ఖాతా ద్వారా జరగాలని సీజేఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. బాంబే హై కోర్టు తీర్పును మౌఖికంగా సమర్థించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రైల్వే లైన్ అభివృద్ధి చేస్తారు కాబట్టి బాంబే హైకోర్టు నిర్ణయం సరైనదే అని పేర్కొంది. మహారాష్ట్ర ప్రభుత్వానికి, అదానీ ప్రాపర్టీస్‌కు నోటీసులను జారీ చేసింది. తదుపరి విచారణను మే 25కు వాయిదా వేసింది. ధారావి ప్రాజెక్టు కోసం సెక్‌లింక్ టెక్నాలజీస్ గతంలో రూ.7,200 కోట్లకు బిడ్ వేసింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని 20శాతం పెంచడానికి సిద్ధంగా ఉంది. దీంతో సవరిత బిడ్‌తో అఫిడవిట్ దాఖలు చేయాలని సెక్‌లింక్‌కు సుప్రీంకోర్టు సూచించింది. కాగా, డిసెంబరు 2024లో బాంబే హైకోర్టు... మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. సెక్ లింక్‌కు సంబంధించిన 2019 బిడ్‌ను రద్దు చేసి, 2022లో కొత్త టెండర్ జారీ చేసి... ప్రాజెక్టును ఆదానీ గ్రూప్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. 2019-22 మధ్య కాలంలో కోవిడ్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, కరెన్సీ హెచ్చుతగ్గులు, వడ్డీ రేట్లలో పెంపుదల వంటి వాటి వల్ల మారిన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తమ నిర్ణయం సమర్థనీయమేనని ప్రభుత్వం వివరణ ఇచ్చుకున్నది.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

(మూడోపేజీ తరువాయి)

శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహిళా సంఘాలకు మొదటి విడతలో 150 ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. జిల్లాల నుంచి వచ్చే మహిళలందరికి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు ప్రణాళికతో వాహనాలన్నింటిని పార్కింగ్ ప్రాంతాలకు తరలించాలని, మహిళలకు ఏర్పాటు చేసిన సెక్టార్లలో తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలన్నారు. స్టేజ్ ఏర్పాట్లను ఆర్అండ్‌బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టాల్స్, తాగునీరు, వైద్యసదుపాయం, మొబైల్ టాయిలెట్స్, అగ్నిమాపక శకటాలను నిర్దేశించిన ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని మంత్రి సూచించారు. భాషా సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో 250 మంది కళాకారులచే వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యుత్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ముషరఫ్ అలీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి కమిషనర్ అశోక్ రెడ్డి, సెక్రటరీ పి. ఆర్ లోకేష్ కుమార్, ఐ అండ్ పీ ఆర్ కమిషనర్ ఎస్. హరీశ్, డీజీజీ లు తక్సిర్ ఆహ్మద్, లక్ష్మి పెరుమాళ, భాషా సంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ హరికృష్ణ, జీహెచ్ఎంసీ, విద్యుత్,పోలీస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21 మంది ఐపీఎస్‌ల బదిలీ

(మూడోపేజీ తరువాయి)

రామగుండం సీపీగా అంబర్ కిషోర్, ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధుశర్మ, భువనగిరి డీసీపీగా ఆకాంక్ష యాదవ్, మహిళ భద్రతా విభాగం ఎస్పీగా చేతన, నార్కొటిక్ బ్యూరో ఎస్పీగా రూపేశ్, కామారెడ్డి ఎస్పీగా రాజేశ్ చంద్ర, సంగారెడ్డి ఎస్పీగా పారితోశ్ పంకజ్, రాజన్న సిరిసిల్ల ఎస్పీగా జీఎం బాబా సాహెబ్, వరంగల్ డీసీపీగా అంకిత్ కుమార్, మంచిర్యాల డీసీపీగా ఎ.భాస్కర్, సూర్యాపేట ఎస్పీగా కె.నర్సింహ, హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీగా శిల్పవల్లి, ఎస్ఐబీ ఎస్పీగా సాయి శేఖర్, పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్, సీఐడీ ఎస్పీగా రవీందర్ బదిలీ అయ్యారు.

వక్ఫ్ బిల్లును అడ్డుకుంటాం

(మూడోపేజీ తరువాయి)

10 నుంచి ప్రారంభమవుతాయి. దీంతో పార్లమెంటును దద్దరిల్లించాలని 'ఇండియా' నిర్ణయించింది. వక్ఫ్ (సవరణ) బిల్లు సహా అనేక బిల్లులు చట్టసభల్లో ప్రవేశపెట్టే క్రమంలో కేంద్రాన్ని నిలదీయాలని సంకల్పించింది. వక్ఫ్ బిల్లును ముక్తకంఠంతో వ్యతిరేకిస్తామని, ఇందుకోసం అన్ని ప్రజాస్వామిక మార్గాలను అనుసరిస్తామని జైరాం రమేశ్ చెప్పారు. ప్రతిపాదిత చట్టంలోని అంశాలు, ఉద్దేశానికి ఇండియా పూర్తి వ్యతిరేకమన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై గళం వినిపిస్తామని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా పారదర్శకంగా జరగడం లేదని, ముందస్తు ప్రణాళికల ఆధారంగా పథకం ప్రకారం జరుగుతున్నాయని ఆరోపించారు. వక్ఫ్ బిల్లును కాంగ్రెస్ సహా అనేక పార్టీలు వ్యతిరేకిస్తాయని జైరాం రమేశ్ తెలిపారు. ఈ బిల్లును బుల్డోజ్ చేసిన విధానం పార్లమెంటు సంయుక్త కమిటీ ప్రక్రియను ఎగతాళి చేసిందని అసహనం వ్యక్తంచేశారు. ఒక బిల్లులోని క్లాజుల వారీ చర్చ లేకుండా సంయుక్త కమిటీ నివేదిక ఇవ్వడం పార్లమెంటు చరిత్రలోనే మొట్టమొదటిసారి జరిగిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శని, ఆదివారాలు ఇతర విపక్ష పార్టీల నాయకులతో చర్చించి పార్లమెంటులో అనుసరించాల్సిన ఐక్య వ్యూహాన్ని నిర్ణయిస్తారని చెప్పారు. వక్ఫ్ బిల్లుపై విపక్షాలన్నీ ఒకే మాటపై ఉన్నాయని అన్నారు. టీడీపీ, జేడీ(యూ) ఎంపీల్లో కాస్త గందరగోళ పరిస్థితి ఉందని... బీజేపీ ఒత్తిళ్లకు తలొగ్గి వారు ఈ బిల్లుకు మద్దతు తెలుపవచ్చని జైరాం అన్నారు. ఈ బిల్లు సభ ముందరకు వచ్చినప్పుడు జేడీ(యూ), టీడీపీ అధినేతలు నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు ఏం చేస్తారో తెలియదు కానీ వారి నిజస్వరూపం తప్పక బహిర్గతమవుతుందని వ్యాఖ్యానించారు. వక్ఫ బిల్లుపై చట్టసభలు దద్దరిల్లిపోవడం ఖాయమన్నారు. అయితే బడ్జెట్ మలి దశ సమావేశాల్లో వివిధ శాఖల పద్దులపైనా చర్చలు జరుగుతాయని జైరాం రమేశ్ తెలిపారు. ఉభయ సభల్లో కనీసం ఐదు మంత్రిత్వశాఖల చర్చ జరుగుతుందని, తమ వైపు నుంచి హోం, విద్య, సామాజిక న్యాయం, రైల్వే, ఆరోగ్యం శాఖల మీద చర్చను కోరామని, దీనిపై నిర్ణయం త్వరలోనే జరుగుతుందని అన్నారు. ఆర్థిక బిల్లు, అప్రాప్రియేషన్ బిల్లుపైనా చర్చ జరగనున్నట్లు చెప్పారు. అదే సమయంలో ఇండియా ఐక్య సంఘటనలో విభేదాలపై ప్రశ్నకు అదేమీ అసహజమైన అంశం కాదని అన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేసేందుకు ఇండియా ఏర్పాటు అయింది తప్ప అసెంబ్లీ ఎన్నికల కోసం కాదని సమాధానం చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో ఇండియా ఐక్యంగా ఉందని జైరాం రమేశ్ అన్నారు. కాగా, తొలి దశ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగగా... మలి దశ సోమవారం నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్నది.

కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం

(మూడోపేజీ తరువాయి)

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఆర్థిక సమస్యల పరిష్కారానికి కమిటీలు వేస్తామన్నారు. సింగరేణి తరపున సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని హైదరాబాద్‌లో నిర్మించాలన్న కూనంనేని సాంబశివరావు ప్రతిపాదన మేరకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్మికులకు సొంతింటి పథకం అమలునకు సాధ్యాసాధ్యాలపై కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు బలరామ్ తెలిపారు. అదే సమయంలో కార్మికులకు కొన్ని సలహాలు, సూచనలు చేశారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే ఉద్యోగులు పూర్తి పని గంటలు, యంత్రాలను సద్వినియోగించాలని అన్నారు. కంపెనీ ఆర్థిక స్థితిగతులు అర్థం చేసుకొని కార్మికుల్ని చైతన్యపరచాలని, కంపెనీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కార్మిక సంఘాలను బలరామ్ కోరారు. కోల్ ఇండియా, విదేశీ బొగ్గు ధరతో పోల్చితే సింగరేణి బొగ్గు ధరలు ఎక్కువని, అందుకే డిమాండ్ తగ్గుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.12వేల నుంచి రూ.16 వేలకు చేరుకుందన్నారు. కార్మికులు క్రమశిక్షణ పాటించాలని, నాణ్యత పెంపుదలకు మరింత కృషి చేయాలని, హాజరు సరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సోలార్ విద్యుత్ సహా ఇతర గ్రీన్ ఎనర్జీ విధానాల వైపునకు ప్రపంచం అడుగులు వేస్తున్న క్రమంలో సింగరేణి కూడా తన మనుగడ కోసం సోలార్ విద్యుత్, కీలక ఖనిజాల ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నదని బలరామ్ తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈఅండ్ఎం), ఎల్‌వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు(పీ అండ్ పీ), ఈడీ(కోల్ మూమెంట్) ఎస్‌డీఎం సుభానీ, జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం కవితా నాయుడు, జీఎంలు పాల్గొన్నారు. ఇదిలావుంటే బలరామ్ పని తీరును కార్మిక నేతల్లో కొందరు మెచ్చుకున్నారు. చైర్మన్‌గా కాకుండా కార్మిక నాయకుడిగా తమతో మమేకం అవుతారని, సమస్యలు వింటారని, సానుకూలంగా స్పందిస్తారని కొనియాడారు. చైతన్య యాత్రలో భాగంగా కార్మికుల సలహాలు విన్నారని గుర్తుచేశారు. కార్మికుల సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని బలరామ్‌ను కార్మిక నాయకులు కోరారు.

డీలిమిటేషన్‌పై సమష్టి పోరు

(మూడోపేజీ తరువాయి)

స్వభావంపై, తమిళ ప్రజలు, భాషపై ప్రత్యక్ష దాడితో సమానమని వాదిస్తున్నారు. కేంద్రం ప్రతి పాదించిన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదన వల్ల జనాభా స్థాయిలను నియంత్రించగలిగిన రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని స్టాలిన్ సీఎంలకు రాసిన లేఖలో స్పష్టం చేశారు. 1976 తర్వాత జరిగిన డీలిమిటేషన్ కసరత్తులు 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆమోదించబడిన సవరణ ద్వారా నిలిపివేయబడ్డాయని గుర్తు చేశారు. జనాభా సంఖ్య ఆధారంగా పునర్విభజన జరిగితే... ప్రస్తుత డేటా ప్రకారం, జనాభాను నియంత్రించిన రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు తగ్గుతాయి. ఉత్తరాదిలో బిజెపి పాలిత రాష్ట్రాలు సహా ఇతర రాష్ట్రాల్లో విపరీతంగా పెరిగిన జనాభా కారణంగా మరిన్ని సీట్లు పొందుతాయి. జనాభా ఆధారంగా రెండు విధానాలతో ఈ కసరత్తును పరిశీలిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. మొదటి సందర్భంలో ప్రస్తుతమున్న 543 సీట్లను పునఃపంపిణీ చేస్తారు. రెండవదానిలో మొత్తం సీట్ల సంఖ్యను 800 దాటి పెంచవచ్చు.

ఈ రెండు సందర్భాలలో 2026 తర్వాత జనాభా సంఖ్య ఆధారంగా పునర్విభజన చేపడితే జనాభా నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలు గణనీయంగా నష్టపోతాయని స్టాలిన్ హెచ్చరించారు. పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్టాలిన్ డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 2.5 శాతం డీఏ

(మూడోపేజీ తరువాయి)

సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వివిధ పథకాలు అమలులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా మొదటి దశలో 150 బస్సులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రతి మండలానికి మహిళా సమైక్య సంఘం ద్వారా ఒక బస్సు శనివారం ప్రారంభం కానుంది. ఉమ్మడి జిల్లాలైన వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్ నగర్ జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసి మహిళా సంఘాలను భాగస్వామ్యం చేశారు.

అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు రెడీ: ట్రంప్

వాషింగ్టన్: అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి లేఖ రాసినట్లు ట్రంప్ చెప్పారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ చర్చలకు వారు అంగీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇరాన్ ముందు రెండు మార్గాలున్నాయి. సైన్యాన్ని ప్రయోగించడం లేదా ఒప్పందం చేసుకోవడం. ఒప్పందానికే నేను ప్రాధాన్యం ఇస్తా. ఎందుకంటే ఇరాన్‌ను దెబ్బతీయాలనుకోవడం లేదు. చర్చలు జరుపుతారని ఆశిస్తున్నా. ఇరాన్‌కు అది చాలా ప్రయోజనకరం' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు అభివృద్ధి చేసుకోవడాన్ని నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఇదే అంశంపై ఇటీవల మాట్లాడిన ట్రంప్... దాన్ని నిరోధించేందుకుగాను వారితో ఒప్పందం చేసుకోవాలని అనుకుంటున్నానని చెప్పారు. ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా... 2018లో ట్రంప్ హయాంలోనే దాన్నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

21 మందికి సాహిత్య అకాడమీ తర్జుమా పురస్కారాలు

న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ శుక్రవారం 21 మంది అనువాదకర్తలకు 2024 సంవత్సరానికిగాను పురస్కారాలు ప్రకటించింది. తుర్లపాటి రాజేశ్వరి(తెలుగు), అనిసుర్ రెహమాన్ (ఆంగ్లం), మదన్ సోని (హిందీ)లను ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించింది. సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు శుక్రవారం న్యూఢిల్లీలోని రవీంద్ర భవన్‌లో అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన సమావేశమైంది. సాహిత్య అకాడమీ ట్రాన్స్‌లేషన్ ప్రైజ్ 2024 కోసం ఎంపిక చేసిన 21 పుస్తకాలను ఆమోదించింది. ఈ మేరకు నేషనల్ అకాడమీ ఆఫ్ లెటర్స్ ఒక ప్రకటన చేసింది. త్రిసభ్య జూరీ సిఫార్సుల ఆధారంగా ఈ పుస్తకాలను ఎంపిక చేశారని తెలిపింది. నేపాలీ, సంస్కృత భాషల్లో తర్జుమా అవార్డును తర్వాత ప్రకటిస్తారని వెల్లడించింది. గోపీనాథ్ మొహంతీ ఒడియా నవల 'దాది బుధా'ను తెలుగులో 'ఈతచెట్టు దేవుడు'గా అనువదించినందుకు తుర్లపాటి రాజేశ్వరిని సాహిత్య అకాడమీ పురస్కారం వరించింది. అలాగే 'హజారో ఖ్వాహిషే ఐసీ' అనే ఉర్దూ కవితల సంకలనాన్ని 'ది వండర్‌ఫుల్ వరల్డ్ ఆఫ్ ఉర్దూ గజల్స్'గా ఆంగ్లంలో తర్జుమా చేసినందుకు రెహమాన్ ఎంపికయ్యారు. భారతీయ ఆధునిక కళాకారుడు సయ్యద్ హైదర్ రజా ఆత్మకథ హిందీ అనువాదానికిగాను మదన్ సోనికి అవార్డు లభించింది. హరివంశ్ రాయ్ బచన్ కవిత 'మధుబాలా' మణిపూర్ అనువాదానికిగాను సోయిబంచా ఇంద్రకుమార్; కనక్ లాల్ బరువా రాసిన 'ఎర్లీ హిస్టరీ ఆఫ్ కామపుర' అస్సామీ తర్జుమాకుగాను అంజన్ శర్మ; బిషం సహ్నీ చారిత్రక హిందీ నవల 'తమస్'ను డోంగ్రీ భాషలో అనువదించినందుకు అర్చనా కేశర్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఇతర అవార్డు గ్రహీతల్లో పి.విమల (తమిళం), సిద్దాలింగ్ పట్టాన్‌శెట్టి (కన్నడ), బసుదేవ్ దాస్ (బెంగాలీ), ఉత్తర బిశ్వముతియారి (బోడో), రమణిక్ అగ్రావత్ (గుజరాతీ), , గులాం నబీ అతాశ్ (కశ్మీరీ), మిలింద్ మెహ్మాల్ (కొంకణి), కేశ్కర్ ఠాకూర్ (మైథిలి), కేవీ కుమరన్ (మలయాళం), సుదర్శన్ అతావలే (మరాఠి), సువశ్ సత్పతి (ఒడియా), చందన్ నేగి (పంజాబీ), సోహన్‌దాన్ చరణ్ (రాజస్థానీ), నజీర్ హెంబ్రమ్ (సంతలి), శోభా లాల్‌చందానీ (సింధి) ఉన్నారు. పురస్కార గ్రహీతలకు రూ.50వేల నగదు, రాగి ఫలకాన్ని అందజేస్తారు. ఈ ఏడాది చివరిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు పురస్కారాలు ప్రదానం చేస్తారు.

నేడు ప్రజాభవన్‌లో అన్ని పార్టీల ఎంపీలతో భేటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్రం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసి మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, ఆర్ఆర్ఆర్ తదితర అంశాలపై విన్నవించారు. పెండింగ్ ప్రాజెక్టుల నిధుల సాధనకు పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించే విధంగా ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా ప్రజాభవన్‌లో శనివారం అన్ని పార్టీల ఎంపీల సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన భేటీ జరగనుంది. కేంద్రం వద్ద అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలపై చర్చించనున్నారు. ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈమేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో రాష్ట్రంలో ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం ఫోన్ చేసి భేటీకి ఆహ్వానించారు. రాష్ట్రం పక్షాన సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోంది.

డిజిటల్ గోప్యతకు ముప్పు

కొత్త ఐటీ చట్టంపై కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్రం ప్రతిపాదిత ఆదాయపు పన్ను బిల్లు-2025తో పౌరుల డిజిటల్ గోప్యతకు తీవ్ర ముప్పు ఏర్పడుతుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ బిల్లులోని అంశాలను ఆయన ఖండించారు. దీని వల్ల కేంద్రానికి అపరమిత అధికారాలు అభిస్తాయని తెలిపారు. కొత్త బిల్లు... ఐటీ అధికారులకు సోషల్ మీడియా, ఈ-మెయిల్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్ ఖాతాలపై పన్ను తనిఖీ పేరుతో అపరిమిత అధికారాలను ఇచ్చేలా ఉందన్నారు. 'ఈ బిల్లులో ప్రస్తావించిన 'వర్చువల్ డిజిటల్ స్పేసెస్' వేధింపులకు, దుర్వినియోగానికి, విస్తృత నిఘాకు దారితీయవచ్చు. దేశ పౌరుల ఆర్థిక డేటా ఇప్పటికే అనేక సంస్థల అధీనంలో ఉంది. ఈ చట్టం పౌరుల ప్రాథమిక హక్కులను, డిజిటల్ గోప్యతను హరిస్తుంది' అని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చట్టాన్ని ఆధారంగా చేసుకుని కొందరు అధికారులు తమ అధికారాలను దుర్వినియోగిస్తే ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని ప్రధానిని, కేంద్ర ఆర్థిక మంత్రిని డిమాండ్ చేశారు. 'ఆదాయపు పన్ను చట్టానికి మించి పన్ను అధికారుల అధికారాల పరిధిని విస్తృతంగా పెంచుతుంది. సెక్షన్ 247 ప్రకారం, పన్ను ఎగవేత ఆరోపణలుంటే, సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఆన్‌లైన్ ఖాతాలతో సహా 'వర్చువల్ డిజిటల్ స్పేస్'ను సోదా చేయడానికి అధికారులకు అనుమతి ఇస్తుంది. ఏప్రిల్ 1, 2026 నుంచి కొత్త చట్టం అమలులోకి రానుంది. సెక్షన్ 261లో విస్తృతంగా నిర్వచించిన ఈ నిబంధన, స్పష్టమైన రక్షణలు లేకుండా డిజిటల్ భద్రతను అతిక్రమించడానికి అనుమతిస్తుంది. ఈ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం' అని కేటీఆర్ అన్నారు. ఆదాయపు పన్ను వ్యవస్థకు ప్రస్తుత నిఘా వ్యవస్థలు సరిపోతాయన్నారు. పౌరులు, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

శ్రీవిద్యకు అండ

హైదరాబాద్ సనత్ నగర్ దాసారం బస్తీకి చెందిన మల్లెల శ్రీవిద్య మళ్లీ బడి బాట పట్టింది. సరైన పత్రాలు లేక స్కూలు ప్రవేశం రద్దు కావడం... ఆధార్ రూపంలో సమస్య ఎదురు కావడంతో శ్రీవిద్య గురించి పత్రికల్లో వచ్చింది. ఇది తెలిసిన కేటీఆర్ వెంటనే స్పందించి బాలికలకు అండగా నిలిచారు. తన కార్యాలయ సిబ్బందిని బాలిక ఇంటికి పంపి... తల్లిదండ్రులతో మాట్లాడించారు. ఆధార్, బర్త్ సర్టిఫికేట్ పొందడానికి సహాయం చేస్తామన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న ఆయన శ్రీవిద్య కోసం రెండేళ్ల స్కూలు ఫీజును ముందే కట్టారు. భవిష్యత్‌లోనూ ఆమె చదువుకయ్యే ఖర్చును భరిస్తానన్నారు. దీంతో కేటీఆర్‌కు శ్రీవిద్య తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్ చొరవతో సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి అవసరమైన సర్టిఫికేట్లను ఇప్పిస్తానని శ్రీవిద్య కుటుంబానికి హామీ ఇచ్చారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు బీసీ గురుకుల విద్యార్థులు

విద్యార్థులను అభినందించిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసే ఇన్ స్పైర్ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన 50 మంది బీసీ గురుకుల విద్యార్థులను బీసీ సంక్షేమ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న పది నుంచి 15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 50 మంది బీసీ గురుకుల విద్యారులు ఎంపిక కావడం అభినందనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థులు తమ తెలివి తేటలతో ఎన్నో కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని, వారిలోని ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ వారిని ఇన్‌స్పైర్ లాంటి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాని ఆయన సూచించారు. ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్‌లో పదివేల రూపాయలు జమ అవుతాయని, ఈ డబ్బుతో వారి ఆలోచన మేరకు ప్రాజెక్టును చేసి ప్రదర్శనలో ఉంచాలని ఆయన సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులను స్కూల్ స్థాయి నుంచే భాగస్వామ్యులను చేసేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమంగా నిలిచిన ప్రాజెక్టును జాతీయ స్థాయిలో ప్రదర్శిస్తారని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ప్రతిభకు సృజనాత్మకత జోడించి ప్రాజెక్ట్ చేయాలని ఆయన సూచించారు. సామాజిక ప్రయోజనం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ప్రాజెక్ట్ చేయడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి సరికొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు రాణించినప్పుడే భవిష్యత్‌లో వారు గొప్పగొప్ప సైంటిస్ట్‌లుగా ఎదుగుతారన్నారు. విద్యార్థులకు కావల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని విజ్ఞానం పెంచుకోవడం, సృజనాత్మకత పెంపొందించుకోవడం ద్వారా తమ భవిష్యత్‌ను గొప్పగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన 50 మంది విద్యార్థులను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంజెపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. భవిష్యత్‌లో ఇలాంటివి మరెన్నో సాధించాలని సూచించారు.

జలమండలిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా ఆసుపత్రి వైద్యురాలు ఎం.అనిత (రిటైర్డ్ గైనకాలజిస్ట్) అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బోర్డు మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అటు ఇంట్లో, ఇటు బయట రెండు చోట్లా పనిచేయడం మహిళలకే చెల్లిందన్నారు. ఇంకా జలమండలి లాంటి అత్యవసర శాఖలో పనిచేయడం ఇబ్బందికరమని, అయినా కూడా సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. బోర్డులో కొత్తగా రిక్రూట్ అయిన మహిళా ఉద్యగులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవం అంత ఆషామాషీగా రాలేదని ఎంతో మంది సామాజిక సంస్కర్తల వల్ల వచ్చిందని తెలిపారు. వారి హక్కులను సమర్థంగా వినియోగించుకుని ఎదగాలని ఆకాంక్షించారు. అతిథిగా హాజరైన డాక్టర్ అనిత మాట్లాడుతూ ఉద్యోగం చేసే మహిళలు జాబ్‌తో పాటు కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అటు ఉద్యోగ జీవితాన్ని, ఇటు వ్యక్తిగత జీవితాన్ని రెండింటినీ బ్యాలెన్స్ చేసుకోవాలని సూచించారు. ఈ హడావుడిలో ఆరోగ్యంపైనా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మరో అతిథిగా వచ్చిన వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ మహిళల హక్కులకు వ్యతిరేకంగా జరిగే వాటిపైన పోరాటం చేయాలన్నారు. జలమండలి ఉమెన్స్ మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీజీఎంలు అబ్దుల్ ఖాదర్, నారాయణ, చంద్రజ్యోతి, జీఎంలు సుగంధిని, సరస్వతి, అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, జనరల్ సెక్రటరీ బిల్కిస్ బాను, ప్రతినిధులు, సభ్యులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో శక్తివంచన లేకుండా కృషి చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ వారు మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును వారి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు నూతన కమిటీని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణ చార్యులు, అభివృద్ధి కమిటీ చైర్మన్ సానాది శంకర్, కమిటీ సభ్యులు హేమంత్ కుమార్, పిట్టల గణేష్, సంజయ్, శ్రీకాంత్, సురేష్ సింగ్, ఏగొండ చారి, శోభన్, అనిత, శ్రీధర్, రత్నాకర్, వెంకటస్వామి, పద్మావతి, రవీందర్ రెడ్డి, శ్రీవారి సేవకులు సంజయ్ గుప్తా, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగుల సంఘం శుక్రవారం సనత్ నగర్ బోర్డు కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి జి.రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు సమాజ అభ్యున్నతికి మహిళలు చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. దేశాభివృద్ధిలో వారి ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. నిర్ణయాలు తీసుకోవడంలో మహిళలు స్వతంత్రంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సమస్యలను పరిష్కరించడంలో మహిళలు చూపిన ఆవిష్కరణలు ఎంతో ప్రశంసనీయం అని కొనియాడారు. ఈ వేడుకల్లో టీజీపీసీబీ యొక్క టెక్నికల్, సైంటిఫిక్, అడ్మినిస్ట్రేటివ్ మరియు అకౌంట్స్ నుండి మహిళా ఉద్యోగులు రెగ్యులర్ మరియు అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ భవన్ తలుపు తట్టిన ఫీనిక్స్ కంపెనీ బాధితులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు ఫీనిక్స్ కంపెనీపై మొబైల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలిలో మొబైల్ సొసైటీ సభ్యుల 128 మంది శుక్రవారం గాంధీభవన్‌లో మహేష్ కుమార్‌గౌడ్‌కి ఫీనిక్స్ కంపెనీ ఎండి గోపి కృష్ణ, చుక్కలపల్లి సురేష్‌లపై ఫిర్యాదు చేశారు. ఫీనిక్స్ కంపెనీ తప్పుడు పత్రాలను సృష్టిస్తూ హై కోర్ట్ తీర్పుకు వ్యతిరేకంగా తమ భూములలో అక్రమంగా దౌర్జన్యం చేస్తూ అక్రమనించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలో 1991లో అప్పటి ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని అప్పటి నుంచి తామే అక్కడ ఉన్నామని కానీ ఫీనిక్స్ కంపెనీ వాళ్ళు దొంగ డాక్యుమెంట్లను సృష్టించి తమ భూములపై అజమాయిషీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు.

పిల్లలకు క్రమశిక్షణ, చదువు, సంస్కారాన్ని నేర్పాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళలకు మహిళలే స్నేహితులని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఇలంబర్తి, ఇతర మహిళా ఉన్నతాధికా రులతో కలిసి మేయర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ పలు రంగాలలో విజయాలు సాధించి ఉన్నతంగా రాణించిన మహిళా మణులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి మహిళలో ఏదో ఒక నైపుణ్యత ఉంటుందని, దానికి మెరుగు పెట్టి అందులో రాణించాలన్నారు. ధైర్యం, స్థైర్యం, ఆత్మ నిబ్బరంతో ముందడుగు వేయాలని ఉద్బోధించారు. ప్రతి ఇంటిలో తల్లి తన పిల్లలకు క్రమశిక్షణ నేర్పాలని, చదువు, సంస్కారంతో పాటు సభ్య సమాజంలో ఏ విధంగా నడుచుకోవాలో నేర్పాలని సూచించారు. తల్లిగా ప్రతి మహిళ తమ పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. ప్రతి మహిళకు పనిచేసే చోట అన్ని వసతులతో పాటు భద్రతగా, స్వేచ్ఛగా ఫీలయ్యేలా ఉండాలన్నారు. జీహెచ్ఎంసీలో మహిళల హెల్త్ చెకప్‌కు సంబంధించి రెగ్యులర్‌గా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఫైనాన్స్ అడిషనల్ కమిషనర్‌కు సూచించారు. మహిళలందరూ మరింత ఉన్నతంగా ఎదిగి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. 30 సర్కిళ్లలో ఉత్తమ సేవలు అందించిన మహిళా శానిటరీ వర్కర్లను మేయర్, డిప్యూటీ మేయర్, కమీషనర్ ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళా ఉద్యోగులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. అడిషనల్ కమిషనర్లు పంకజ, సుభద్రాదేవి, అలివేలు మంగతాయారు, సరోజ, గీతా రాధిక, జాయింట్ కమిషనర్ ఉమా ప్రకాష్, సి.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, డి.సి ప్రశాంతి వివిధ విభాగాల మహిళా హెచ్.ఓ.డి లు, డి.సి లు, ఏ.ఎం.సి లు, ఉద్యోగిణులు, శానిటరీ మహిళా కార్మికులు పాల్గొన్నారు.

వివక్షను మరింత తీవ్రతరం చేయనున్న కొత్త కార్మిక చట్టాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మోదీ ప్రభుత్వ కొత్త కార్మిక చట్టాలు (లేబర్ కోడ్‌లు) మహిళా కార్మికులకు గణనీయమైన ముప్పును కలిగిస్తాయని, వారు ఇప్పటికే ఎదుర్కొంటున్న వివక్షను మరింత తీవ్రతరం చేస్తాయిని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని ఆందోళన వ్యక్తం చేసారు. సమాన పనికి సమాన వేతనం అనే ఆదేశాన్ని తుడిచిపెట్టడం, మహిళా కార్మికులపై వివక్షను అనుమతించడం ద్వారా ఈ లేబర్ కోడ్‌లు సమాన వేతన హక్కుపై దాడి చేస్తాయన్నారు. తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం, తెలంగాణ రాష్ట్ర కమిటీ, భారత జాతీయ మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి సంయుక్తాధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య పతాకాన్ని పి. ప్రేమ్ పావని ఆవిష్కరించినంతరం మహిళలపై వివక్షను నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ కార్యాలయం నుండి నారాయణగూడ చౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించారు. 'మహిళలపై హింసను ఆపండి', 'స్త్రీ భ్రూణ హత్యలను ఆపండి', 'కట్నం అడగడానికి బిచ్చగాడిగా ఉండకండి', 'మహిళలపై వివక్షను నిర్మూలించాలని' నినాదాలు చేసారు. ఈ సందర్భంగా పి. ప్రేమ్ పావని మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త లేబర్ కోడ్‌లు మహిళా భద్రతా చర్యలను విస్మరిస్తాయని, రాత్రి షిఫ్ట్‌లకు కేటాయించడానికి అనుమతిస్తాయని, ప్రసూతి ప్రయోజనాలను కూడా తగ్గిస్తాయని, పిల్లల సంరక్షణ సౌకర్యాల ఏర్పాటుకు అనుమతించవని, వీటితోపాటు వేతనాలను తగ్గించడం వంటివి జరిగి, శ్రామిక శక్తిలో లింగ ఆధారిత అసమానతలను శాశ్వతం చేస్తాయని తెలిపారు. వేతనంలో సమానత్వం, సామాజిక భద్రతను నిరాకరించే నూతన కార్మిక కోడ్‌ల రద్దుకై మహిళలు పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టాలని పి.ప్రేమ్ పావని పిలుపునిచ్చారు. భారత జాతీయ మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి అధ్యక్షురాలు పడాల నళిని మాట్లాడుతూ భారత రాజ్యాంగం మహిళల రక్షణ, పురోగతిని నిర్ధారించే హక్కులను అందిస్తుందని, ప్రతి స్త్రీ గౌరవం, సమానత్వం, మర్యాదతో కూడిన జీవితాన్ని గడపడానికి హక్కులు కల్పించే భారత రాజ్యాంగాన్ని నేడు మోదీ ప్రభుత్వం ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ భయం, బలవంతం, హింస లేదా వివక్షత నుండి విముక్తి పొందితేనే దేశంలో మహిళలకు నిజమైన స్వాతంత్రం లభిస్తుందని, మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా, హక్కులు, లింగ సమానత్వం కోసం బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా నేతలు షహనా అంజుమ్, అరుణ, మాధవి, ఈదమ్మ, శారదా, ఫైమీద పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో మోదీ ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలో మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు డా. కె.రజిని ఆరోపించారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్లను బిల్లును లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి ఆమోదించిన తరువాత కూడా కేంద్ర బీజేపీ ప్రభుత్వం డీలిమిటేషన్, జనగణన తరువాత అమలు చేస్తామని హామీ ఇచ్చి నేడు బుట్ట దాఖలు చేయడం దుర్మార్గమన్నారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్, అమృత ఎస్టేట్స్, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యాలయం వద్ద భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించింది. డా.కె.రజిని ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళా సమాఖ్య పతాకాన్ని ఎగురవేసి మాట్లాడుతూ కేంద్ర బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం హింస, భయం, ఆకలి, నిరుద్యోగం వంటి సృష్టించడం తప్ప దేశానికి చేసిందేమీ లేదన్నారు. వివిధ రంగాలలో మహిళలపై కొనసాగు తున్న దాడులను ఎదుర్కోవడానికి ప్రజాస్వామ్య మహిళా సంఘాలన్నీ ఏకం కావాలని, సమానత్వం, విముక్తి కోసం మన హక్కులను కాపాడుకోవడానికి ఉద్యమించాలని డా.కె.రజిని కోరారు. ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలనీ డిమాండ్ చేసారు. మహిళలపై హింస, వివక్షకు వ్యతరేకంగా ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫైమీద, ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, జె.లక్ష్మి నేతలు హైమావతి, ప్రమీల, రొయ్యల గిరిజ, మాధవి, అరుణ, చందన,మహాలక్ష్మి పాల్గొన్నారు.

సురక్షితమైన ప్రయాణం మా ప్రాధాన్యత : మెట్రో ఎండీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : మెట్రో స్టేషన్లలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన భద్రత చర్యలు చేపట్టడం వల్ల ఇప్పటి వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపారు. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఆవిష్కరణలు, వినూత్న ఆలోచనలు, శాస్త్రీయమైన ఇంజినీరింగ్ విధానాలతో ముందుకు వెళ్లడం వల్ల హైదరాబాద్ మెట్రో రైల్‌ను ప్రపంచ దేశాల సాంకేతిక పరిజ్ఞానానికి దీటుగా నిలపగలిగామని ఆయన వెల్లడించారు. బాలానగర్‌లో ఉన్న నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్ సి)లో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో మెట్రో ఎండీ ఎన్.వి.ఎస్. రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ వ్యవస్థలో చేపడుతున్న భద్రతా చర్యలను వివరించారు. మెట్రో రైల్ నిర్మాణాన్ని కేవలం ఒక ఇంజినీరింగ్ కోణంలోనే కాకుండా, జాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్న సామజిక అంశంగా చేపట్టామని అయన తెలిపారు. పీపీపీ విధానంలో చేపట్టిన ప్రపంచంలోనే మొట్టమొదటిదైనా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఎదురైనా అనేక క్లిష్టతరమైన సవాళ్ళను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ, ప్రజలకు ఒక గొప్ప రవాణా వ్యవస్థను అందించగలిగామని ఆయన చెప్పారు. భద్రత అంటే కేవలం నిబంధనలకు అనుగుణంగా ఉండటం మాత్రమే కాదు, ఒక బాధ్యత, నిబద్ధతలతో ఈ ప్రాజెక్ట్ ను మెరుగైన సాంకేతిక వ్యవస్థతో తీసుకురాగలిగామని చెప్పారు. ప్రాజెక్ట్ ప్రతి దశలో, ప్రమాద విశ్లేషణ, ప్రమాద అంచనా వేయడం వల్ల డిజైన్ దశలోనే చాలా ప్రమాదాలు రాకుండా నివారించగలిగామని ఎన్.వి.ఎస్. రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మెట్రోలో నిర్మాణం సమయంలో కానీ, ఆ తర్వాత కానీ ఇప్పటి వరకు ఒక్క ప్రమాదం కూడా జరగలేదని ఇది ఒక రికార్డని ఆయన వెల్లడించారు. ఇస్రోకి అనుబంధంగా పని చేస్తున్న ఎన్ఆర్ఎస్.సి భద్రతా చర్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తూనే, కొత్త ఆవిష్కరణలతో దేశాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్ మాట్లాడుతూ భద్రతతో పాటు, ఉద్యోగులు, సిబ్బంది శ్రేయస్సును కూడా ఈ సారి భద్రతా వారోత్సవాలలో ఇతివృత్తంగా జోడించి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. ఎన్.ఆర్.ఎస్.సిలో పని చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి భద్రత, వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. వికసిత భారత్ లక్ష్యానికి సంక్షేమం, భద్రత మూలాధారమని ఆయన అన్నారు.

ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయ మహిళా సిబ్బందికి సత్కారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో సిబ్బంది అన్ని మండలాల్లోని సర్వేయర్లందరూ కలిసి కార్యాలయంలో పనిచేసే మహిళా సిబ్బందిని యూనియన్ నాయకులు జిల్లా సర్వే అధికారి వి.శ్రీరామ్ ఘనంగా సత్కరించి జ్ఞాపకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు యాదమ్మ, భావన, లావణ్య, ధనశ్రీ, రాధ, రత్న, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ల్యాండ్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ యూనియన్ కార్యదర్శి డిఐ ప్రశాంత్, అధ్యక్షులు భీమ్లా నాయక్, సెక్రటరీ విజయకుమార్, రాజేష్, కార్యాలయ సిబ్బంది అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల క్యాంపుల నిర్వహణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ) వారి సౌజన్యంతో, ఆలింకో సంస్థ హైదరాబాద్ జిల్లాలో నాలుగు ప్రదేశాలలో దివ్యాంగులకు, వయో వృద్ధులకు సంబంధించిన సహాయ ఉపకరణాలు అందించడంలో భాగంగా ప్రత్యేకమైనటువంటి అసెస్మెంట్ క్యాంపులను ఏర్పాటు చేయడం జరిగినది. ఈ అవకాశాన్ని దివ్యాంగులు, వయోవృద్ధులు వినియోగించుకొని వారికి కావలసినటువంటి సహాయ ఉపకరణాలను పొందవచ్చును అని జిల్లా కలెక్టర్ తెలియజేయడం జరిగినది. ఈ క్యాంపులు 1. అంబర్పేట్ 2. సికింద్రాబాద్ 3.ముషీరాబాద్ 4. ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఈ క్రింద తెలియజేసిన చిరునామాలో, తేదీలలో నిర్వహించబడతాయి.

మహిళల ప్రయాణాన్ని సరసమైనదిగా మార్చిన ఫ్రెష్‌బస్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మహిళా దినోత్సవం పురస్కరించుకుని ప్రారంభించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, మార్చి 7, 8 తేదీలలో తమ అన్ని మార్గాల్లో ఫ్రెష్‌బస్‌లో ప్రయాణించే మహిళలకు ఉచిత ఫ్రెష్ కార్డులను అందిస్తోన్న ఫ్రెష్‌బస్. ఈ ఆఫర్ ఫ్రెష్‌బస్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా బుక్ చేసుకునే మహిళలకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. దీని ద్వారా, వారు తమ తదుపరి 10 ట్రిప్పులలో ప్రతిదానికీ రూ.50 తగ్గింపు పొందగలరు. ఫ్రెష్‌బస్ ఫ్రెష్ కార్డ్ తరచుగా ప్రయాణించేవారికి ప్రతి ప్రయాణంలో పొదుపును అందిస్తుంది. అందువల్ల, క్రమం తప్పకుండా ప్రయాణించే వ్యక్తులకు తాజా కార్డు మరింత ప్రయోజనకరంగా మారుతుంది. మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఫ్రెష్‌బస్ మహిళల కోసం ప్రత్యేకంగా ఫ్రెష్ కార్డును తీసుకువచ్చింది. మార్చి 7, 8 తేదీలలో ప్రయాణించే మహిళలకు ప్రత్యేకంగా ఫ్రెష్ కార్డులను అందించగలరు. దీని ద్వారా వారు తరువాత ఆరు నెలల పాటు చేసే 10 ట్రిప్పులపై రూ. 500 తగ్గింపు (ఒక్కో ట్రిప్పుకు రూ. 50 తగ్గింపు) పొందగలరు. ఈ ఆఫర్ Freshbus.com ఫ్రెష్‌బస్ యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఫ్రెష్‌బస్ వ్యవస్థాపకుడు, సీఈఓ సుధాకర్ రెడ్డి చిర్రా మాట్లాడుతూ, "ఫ్రెష్‌బస్ ప్రజలకు రవాణాను అందించడమే కాదు, వారి మాట వింటుందన్నారు. మహిళా ప్రయాణికుల నుండి అభిప్రాయాలను తీసుకోవడం ద్వారా, వారి ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచడానికి మేము గణనీయమైన చర్యలు తీసుకున్నామన్నారు. 24/7 మహిళా హెల్ప్‌లైన్‌ను ప్రారంభించామన్నారు.

సీపీఆర్ఓ కార్యాలయంలో మహిళ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సి పి ఆర్ ఓ కార్యాలయం లో పనిచేస్తున్న మహిళల ఉద్యోగులను సి.పి.ఆర్.ఓ మొహమ్మద్ ముర్తుజా, పి.ఆర్.ఓ విజయలక్ష్మి కలిసి మహిళ ఉద్యోగులను శాలువాతో సన్మానించి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆఫీస్ ఏ.ఎం శారద, ఆఫీస్ సూపరింటెండెంట్ లు శైలజ, సక్కుబాయి పద్మ, మహేశ్వరి, కొత్తగా జూనియర్ అసిస్టెంట్ నియామకం అటున కుమారి వైష్ణవీ రెడ్డి, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ లత, ఉమా, తదితరులకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఫోటో గ్రాఫర్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ రోహిత్ టైపిస్ట్ శ్రీనివాస్ ఆనంద్ ఓ.యస్.లు నర్సింగ్, రమేష్, అంజయ్య, సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్
కూకట్‌పల్లి బ్రాంచి, కూకట్‌పల్లి. ఫోన్ : 040-23154455

వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా కూకట్‌పల్లి బ్రాంచి నుండి బంగారు ఆభరణములు హామీపై ఋణము తీసుకుని బ్యాంకు నిబంధనల ప్రకారం చెల్లించనందున తేది 24-03-2025 న సోమవారం ఉదయం 11-00 గంటకు కూకట్‌పల్లి బ్రాంచి ఆవరణలో వేలం వేయుటకు నిర్ణయించడ మైనది. ఈ వేలం రద్దు చేయుటకు మరియు తేది, సమయం, స్థలం మార్చుటకు బ్యాంకు వారికి పూర్తి హక్కు, అధికారములు కలవు. బ్యాంకు నిబంధనల ప్రకారం ధరావత్తు సొమ్ము చెల్లించవలెను.

వ.నెం.	అప్పు నెం.	ఋణగ్రస్తుని పేరు
1.	JEWL/18096	వల్లపట్ల కిరణ్ S/o. వెంకయ్య

కూకట్‌పల్లి బ్రాంచి
ఫోన్ : 040-23154455

వేలం వేయు తేది : 24-03-2025
సమయం : ఉదయం 11-00 గంటలకు
స్థలం : కూకట్‌పల్లి బ్రాంచి ఆవరణలో

తేది : 7-3-2025, హైదరాబాద్ శాఖా నిర్వహణాధికారి

నేడు లక్షమంది మహిళలతో మహిళా దినోత్సవం

ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నాడు పరేడ్ గ్రౌండ్ వేదికగా మహిళా సదస్సును తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోంది. సభకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్యక్షతన సభ జరగనుంది. సభా వేదికగా లక్ష మంది మహిళల సమక్షంలో ఇందిరా మహిళా శక్తి మిషన్-2025 ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారు. మహిళా సంఘాలు ఈ ఏడాది సాధించిన విజయాలతో పాటు, మహిళా సాధికారత బలోపేతం కోసం ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలను ఇందిరా మహిళా శక్తి మిషన్-2025 లో పొందు పరిచారు. అయితే ఇందిరా మహిళా శక్తి మిషన్-2025 ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు 32 జిల్లాల నుంచి మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశాలుండటంతో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. మహిళా సభ్యులను సభకు ఆహ్వానిస్తూ మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా సమాఖ్యలకు ఆహ్వానాలు పంపారు. గౌరవ అతిథులుగా హాజరై సభను సక్సెస్ చేసి మహిళా సంక్షేమం కోసం పెద్ద పీట వేస్తున్నప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. జిల్లాల నుంచి వచ్చే మహిళల కోసం 600కు పైగా ఆర్టీసీ బస్సులను సెర్ప్ అందుబాటులో ఉంచింది. దీంతో పాటు జిల్లాకొక అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించింది. మహిళలు ఇంటి నుంచి బయలు దేరినప్పటి నుంచి ఇంటికి సురక్షితంగా చేరుకునే వరకు ఈ అధికారులు సమన్వయం చేస్తారు. ఎక్కడ ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలను కల్పించారు. సాయంత్రం ఐదు గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళలంతా అరగంట ముందే సభా స్థలికి చేరుకునేలా ప్లాన్ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి మహిళలు వచ్చే అవకాశాలుండటంతో ఏడున్నర గంటల లోపు సభను ముగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ఏర్పాట్లపై మంత్రి సీతక్క శుక్రవారం నాడు పరేడ్ గ్రౌండ్ ను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. సభకు వచ్చే మహిళలకు ఏలాంటి అసౌకర్యం జరక్కుండా ఏర్పాటు చేయాలని సూచించారు.

బీబీనగర్ ఎయిమ్స్ తనిఖీ చేసిన ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : యాదాద్రి భువనగిరి జిల్లాలో బీబీనగర్ కేంద్రంగా ఉన్న ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బీబీనగర్ (ఎయిమ్స్, బీబీనగర్) ను భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రతిరోజు ఇన్ పేషెంట్ అవుట్ పేషెంట్లు ఎంతమంది వస్తున్నారు, వాళ్లకు ఎటువంటి ట్రీట్మెంట్ అందుతుంది, అవసరమైన పేషెంట్‌లకు ఆపరేషన్లు చేస్తున్నారు లేదా అని ఆరా తీసారు. క్యూలైన్‌లో నిల్చున్న ప్రతి పేషెంట్ పలకరిస్తూ, డాక్టర్‌లు సమయానికి వస్తున్నారా, అని ఎక్యుమెంట్స్ ఉన్నాయా సౌకర్యాలు ఎలా ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. ఎయిమ్స్‌లో సిబ్బంది నియామకం జరుగుతుందా, జరిగితే ఎ ప్రాతిపాదికన జరుగుతుంది, దీనిని ఎ ఏజెన్సీ నిర్వహిస్తున్నది. లోకల్ వాళ్ళకి ఎంత వరకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సిబ్బంది నియామకంలో అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అలాంటివి జరగకుండా పారదర్శకంగా ఉండాలని అన్నారు. మిగతా సివిల్ వర్క్స్ ఎంత వరకు పూర్తి అయ్యింది, పూర్తి కాకా పోతే ఎప్పటి వరకు పూర్తి అవుతుంది, పేషెంట్‌లకు అని సౌకర్యాలతో బిల్డింగ్‌లు అందుబాటులోకి ఎప్పుడు వస్తాయి అడిగారు. బిల్డింగ్ నిర్మాణాలు తర్వాగ పూర్తి చేస్తామని గంతల చెప్పిన వాయిదాల దాటిపోయాయి అని గుర్తు చేస్తూ తర్వగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ అరోరా, డిప్యూ డైరెక్టర్ డాక్టర్ విపిన్ వర్గీస్ పాల్గొన్నారు.

తెలంగాణాలో రాబోయే కాలంలో మరిన్ని పెట్టుబడులు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలంగాణాలో రాబోయే కాలంలో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సలుజా తెలిపారు. తెలంగాణలో 2 గిగావాట్ల సోలార్ సెల్, 4.1 గిగావాట్ల సోలార్ మోడ్యూల్ తయారీ కేంద్రం కలవన్నారు. ఈ తయారీ కేంద్రాలలో సుమారు ఐదు వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు. ప్రీమియర్ ఎనర్జీస్ భవిష్యత్తు ప్రణాళికలు తెలిపేందుకు బంజారా హిల్స్‌లోని తాజ్ కృష్ణ హొటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్, డైరెక్టర్ సుధీర్ రెడ్డిబీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నందకిషోర్ ఖండేల్వాల్‌బీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ డైరెక్టర్ రేవతి రోహిణిబీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రీమియర్ ఎనర్జీస్‌కు ఈ రంగంలో 30ఏళ్ల అనుభవం కలదన్నారు. తెలంగాణాలో ప్రధాన కార్యాలయం ఉందన్నారు. మొదట తెలంగాణలో 4 గిగావాట్ల సెల్, మోడ్యూల్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 3000 కోట్ల పెట్టుబడితో ఐదు వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రణా ళికలు రూపొందించామని చెప్పారు. ఈ వ్యూహాత్మక కారణాలతో కొన్ని పెట్టుబడులను ఇతర రాష్ట్రాలకు మళ్లించామన్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో కొత్త పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నామన్నారు.

ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్-2025

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎంఐఎఫ్), భారతదేశంలో ప్రభావవంతమైన ఆవిష్కరణలను నడిపించడంలో అగ్రగామి, తన ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్ 10వ ఎడిషన్‌ను జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో విజయవంతంగా నిర్వహించింది. వ్యాపార, సామాజిక ప్రభావ నిపుణుల నేతృత్వంలోని రెండు కఠినమైన జ్యూరీ రౌండ్ల ద్వారా ఏడుగురు మార్గదర్శక ఆవిష్కర్తలను ఎంపిక చేసి సత్కరించారు. భారతదేశ వ్యాపార, సామాజిక రంగాలలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికే ఈ వేడుకలో 1,000కి పైగా ఎంట్రీల నుండి ఎంపిక చేసిన అగ్రగామి ఆవిష్కర్తలు ప్రతిష్టాత్మక గౌరవాన్ని అందుకున్నారు. ఇంద్ర వాటర్ - వికేంద్రీకృత, మాడ్యులర్ వాటర్ ట్రీట్మెంట్ సిస్టమ్ ద్వారా పారిశ్రామిక మరియు మురుగు నీటి శుద్ధికి ఆవిష్కరణాత్మక పరిష్కారం. స్కైరూట్ ఏరోస్పేస్ - ప్రపంచ ఉపగ్రహ ఆపరేటర్లకు ఖర్చుతో కూడుకున్న, ఆన్-డిమాండ్ యాక్సెస్ కల్పించడం ద్వారా అంతరిక్ష రంగంలో గేమ్-చేంజర్. ఈ ఆవిష్కరణలు భారతదేశ పరిశ్రమల భవిష్యత్తును కొత్త ఉత్కృష్టత స్థాయికి తీసుకెళ్లేలా చేస్తాయి.

గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర - మొయినాబాద్ : గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు ఇటీవల నూతనంగా ఏర్పాడిన మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయ అజీజ్‌నగర్లో ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్యాలయంలోని చేసిన వివిధ శాఖలను సంబందించిన శాఖలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. శివారు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలోని మున్సిపల్ కార్యాలయాల్లో మౌళిక వసతుల కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయుల చైర్మన్ మధుసూదన్రెడ్డి మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్, మేనేజర్ జమీల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే మోత్కుపల్లి గ్రామలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఫిరంగి భాస్కర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - దుండిగల్ : దేశాభివృద్ధి కొరకు మహిళా సాధికారత ఎంతో అవసరమని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడు దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సప్తపది గార్డెన్స్‌లో శుక్ర వారం ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదర్శ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ఇంట్లో ఒక పురుషుడు చదువుకుంటే ఆ ఇళ్లు మాత్రమే అభివృద్ధి చెందుతుందని, అదే ఒక మహిళ చదువు ఆ కుటుంబంతో పాటు సమాజాభివృద్ధికి దోహదపడుతుందని, మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినపుడే దేశాభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ ధన్ రాజ్ యాదవ్, గాజుల సుజాత, విజయలక్ష్మి, నాయకులు సాంబశివా రెడ్డి, ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చలసాని భారతి, శ్రీలత, పద్మ, సుజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక రక్షణ సాంకేతికతలో ఆస్ట్రేలియాతో ముందడుగు

సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బొగ్గు మైనింగ్‌లో అధికోత్పత్తి, యంత్రాలు, ఆధునిక రక్షణ సాంకేతికతలో ఆస్ట్రేలియా కంపెనీలతో ముందడుగు వేస్తామని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన 13 ఆస్ట్రేలియా కంపెనీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ రానున్న కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని, కనుక భారీ ఖనిజ ఉత్పత్తి యంత్రాలను, అత్యాధునిక రక్షణ, భద్రత వ్యవస్థలను సింగరేణి సమకూర్చుకునే ఉద్దేశంతో ఉందన్నారు. అలాగే సోలార్ విద్యుత్తు ఉత్పాదనను కంపెనీ భారీగా పెంచే ఆలోచన చేస్తుందని, విద్యుత్తును నిల్వ ఉంచుకునే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంలకు కూడా తమ వద్ద అవకాశం ఉంటుంది అన్నారు. ఇంకా సింగరేణి సంస్థ చేపట్టనున్న పలు వ్యాపార విస్తరణ చర్యలను కూడా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వ్యాపార విస్తరణ చర్యలకు అవసరమైన యంత్రాలు, వ్యవస్థల ఏర్పాటుకు ఆస్ట్రేలియన్ కంపెనీలు సహకరించవచ్చని సూచించారు. ఆస్ట్రేలియా కంపెనీల ఉత్పత్తులను పరిశీలించి మేలైన, లాభదాయకమైన వాటికి అవకాశం ఇవ్వటం జరుగుతుందన్నారు. లాంగ్ వాల్ టెక్నాలజీ, ఇతర సాంకేతికతల్లో, ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓబీ బొగ్గు తవ్వకాన్ని మరింత సమర్థంగా నిర్వహించేందుకు, ఉత్పాదకత పెంచేందుకు అవకాశం ఉన్న యంత్ర పరిజ్ఞానం అవసరమై ఉందన్నారు అలాగే మెరుగైన దంపుల భద్రత, సమాచార వ్యవస్థలకు కూడా తమ వద్ద అవకాశం ఉందన్నారు. సింగరేణి సంస్థ తరఫున సీఎండీ శ్రీ ఎన్.బలరామ్‌తో పాటు డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (పి.పి) కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్, జీఎం కో-ఆర్డినేషన్ ఎస్డిఎం సుభాని, జీఎం (సిపిపి) మనోహర్, ఒరిసెంట్, విల్సన్ మైనింగ్ సర్వీసెస్, మైన్సైట్, డీటీఎస్ ఏసియా పసిఫిక్, ఆర్ ఎం ఈ గ్లోబల్, మినరల్ టెక్నాలజీస్ పాల్గొన్నారు.

సూర్య ధనంజయ్‌కు "ఉమెన్ ఆఫ్ ది అవార్డు" ప్రదానం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: అమెరికా చికాగోకు చెందిన సుబ్రదర్ అమిర్ అలీ ఖాన్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ అండ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటీలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య సూర్య ధనంజయ్‌కి ఉమెన్ ఆఫ్ ది 2025 అవార్డును శాలువా మెమెంటో, పూలమాల కిరీటం, సర్టిఫికెట్‌తో అవార్డు అంద చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిపుల్ కోడ్ చైర్మన్ జస్టిస్ వామన్‌రావు దేశ్పాండే ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో గత 30 సంవత్సరాలుగా అపారమైన సేవలందించి జాతీయ అంతర్జాతీయ సంస్థలతో ఎన్నో అవార్డులు తీసుకొని మహిళాభివృద్ధికి విద్య వ్యాప్తికి కృషి చేస్తున్న చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయకు ఈ అవార్డు ప్రదానం చేయడం గర్వకారణమని నిర్వాహకులు, వక్తలు అన్నారు. అవార్డు గ్రహీత ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో అన్నింట సమానమని ఆకాశంలో సగం అని వారి అభివృద్ధికి ఆటంకం కలిగించడం అంటే ప్రజా సంక్షేమానికి గొడ్డలి పెట్టడం వంటిదే అని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవితేజ విద్యావేత్తలు ఇట్టా ఉదయశ్రీ రెడ్డి, యాస్మిన్ కౌసర్ కోఆర్డినేటర్లు రాజేందర్ ముదిరాజ్, కుమారి సృజన గౌడ్, కుమారి రేషు వైష్ణవి, కుమారి తాసిల్ సభ ప్రసంగించారు.

లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీంను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలాని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను పూర్తి చేయుటపై, తాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టవలసిన చర్యలపై ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల గ్రౌండింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను పూర్తి చేయుటపై మొదటి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతం చేయాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజషన్ స్కీం)ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి ఎల్ఆర్ఎస్ సద్వినియోగం చేసుకునేలా చేయాలని అన్నారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్ ఇంట్రా పనులను మార్చి 15వ తేదీ వరకు గ్రౌండింగ్ చేపట్టి 20వ తేదీ వరకు పనులు పెండింగులో లేకుండా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులపై మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకై చేసుకున్న దరఖాస్తులలో అర్హత ఉన్న దరఖాస్తుల గ్రౌండింగ్ చేయుటలో వేగం పెంచి పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో అర్హులైన దరఖాస్తులకు మంజూరీ ఇచ్చే విధంగా పని చేయాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, మండలాల నుండి ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత అవసరం



విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: సమాజంలోని మహిళలకు సాధికారత అవసరమని బిజెపి నాయకులు, కార్పొరేటర్ రావుల శేషగిరి ఆకాంక్షించారు. శుక్రవారం మూసాపేట్ పరిధిలో అభినందన్ గ్రాండ్ బాంక్వెట్ హాల్లో సాయి అలేఖ్య సంస్కృతిక సంఘ సేవ సంస్థ రెమిడీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బిజెపి నాయకులు, గాజులరామారం 129 డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి దంపతులు పాల్గొన్నారు.

ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం లోనే ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాము మేము పరిస్థితుల ప్రభావం వల్ల కొన్ని చేయలేని పనులు మిగిలిపోయిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మీరు చేసి పేరు తెచ్చుకుంటే నాకు సంతోషమేనని, ప్రజలకు ఏ ఇబ్బంది రాకుండా చూస్తే చాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్న మాటలు చూస్తుంటే వారి మాటలకు చేష్టలకు బాధ కలుగుతుందని అన్నారు. తను ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు అభివృద్ధి చేసిన పనులే సరిగ్గా చెప్పుకోలేదని ఇతరులు చేసే పనులు లేని పనుల గురించి తాను ఏనాడు చెప్పనని అన్నారు. మాట్లాడే విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. గత 65 ఏళ్ల పాలనలో ఏ ప్రభుత్వం హయాంలో ఎన్ని పనులు జరిగాయో తెలుస్తుందని అన్నారు. బిటి రోడ్డు సిసి రోడ్డు సబ్ స్టేషన్లు ఇంకా ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి అన్ని వివరాలు ఉంటాయని వివరించారు. అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతుంటే తాను ఏనాడు విమర్శించలేదని వారు అభివృద్ధి పనులు చేస్తే తనకు సంతోషంగా ఉంటుందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు ఎవరు చేసిన అది ఆమోదయోగ్యమేనని అంజయ్య అన్నారు. అసలు ఎత్తైన ప్రదేశం షాద్ నగర్ నియోజకవర్గానికి లక్ష్మీదేవి పల్లి ద్వారా నీళ్లు అందించాలన్న ఆలోచన కెసిఆర్ దేనని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. అలాంటి మంచి పని చేపట్టేందుకు కొంత కాలయాపన జరిగినప్పటికీ, 2023వ సంవత్సరం మే నెల 1వ తేదీ నాడు ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం మొత్తం 5646 కోట్ల 20 లక్షలు కేటాయించడం జరిగిందని జీఓ ప్రతిని చూపించారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలను కాగితాలతో పోల్చుతున్న కాంగ్రెస్ నాయకులు వీలైతే అలాంటి జీవోలు తీసుకొచ్చి చూపించాలని చెప్పారు. తను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పాలిటెక్నిక్ కళాశాల మంజూరు మే 18న 2023లో మంజూరు చేయడం జరిగిందన్నారు. దీనికి 16 కోట్ల 49 లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు.

9న ఓంకార్ స్వరూప్ శ్రీ లహరికృష్ణ అమృత్ గీతాయన్ హిందీ ఆడియో అల్బమ్ విడుదల

విశాలాంధ్ర-బషీర్ బాగ్: వేద శాస్త్రాల సారాంశాన్ని తెలియజేసే' ఓంకార్ స్వరూప్ శ్రీ లహరికృష్ణ అమృత్ గీతాయన్' అనే హిందీ ఆడియో అల్బమ్‌ను ఈ నెల 9న సాయంత్రం 5 గంటలకు బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారాభవన్‌లో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమాధికారి కె.రవీందర్, ఫిజియోథెరపిస్టు ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి మాట్లాడుతూ తమిళనాడు తిరునల్వేలి జిల్లాలోని మనుజ్యోతి ఆశ్రమ అధ్యక్షులు డి.ఉపాజ్ నవరాజా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగు తుందన్నారు. ముఖ్య అతిథులుగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, గాయకులు పద్మశ్రీ అనూప్ జలోట, ప్రముఖ సాహితీవేత్త డా.అహల్య మిశ్రా, దా.గజల్ శ్రీనివాస్, పలువురు ఆధ్యాత్మికవేత్తలు కతలు హాజరవుతారని వివరించారు. తెలుగు రాష్ట్రాలు తమిళనాడు నుంచి శ్రీమన్నారాయణ శ్రీ లహరికృష్ణ భక్తులతోపాటు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు. సమావేశంలో మనుజ్యోతి ఆశ్రమ ప్రతినిధి టీ.జైప్రకాష్, జిప్పి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం మహిళ ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్‌నగర్ పట్టణ డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ విజయలక్ష్మి పాల్గొని. మహిళా దినోత్సవం గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలు ఏ రంగంలో నైనా తక్కువ కాదని అన్ని రంగాలలో మహిళలు ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు సమాజంలో గొప్పవారని వారికి సాటి ఎవరూ లేరని మహిళలు చేసే పనులు ఎవ్వరు వెలకట్టలేవని మహిళలను సమాజంలో గౌరవించాలని సూచించారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనిలను బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- ఆమనగల్లు : గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆమనగల్లు మండలం చప్ట తండాలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. మేడిగడ్డ-శంకర్ కొండల మధ్య బ్రిడ్జ్ నిర్మాణాన్ని పరిశీలించారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం విరివిగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఇ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ అభిషేక్, ఎంపిఓ వినోద, మాజీ జడ్పీ చైర్మన్ బాలాజీ సింగ్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, మాజీ వైస్ ఎంపీపీ అనంత రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ పార్టీ అధ్యక్షుడు జగన్, మనయ్య, రాములు, విజయ్ రాథోడ్, రాంజ్య, బాబా భాస్కర్, మల్లేష్, శంకర్, హరిలాల్, కిషన్, రాజ్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డాబర్ ఆమ్లా హెయిర్ ఆయిల్ క్యాంపెయిన్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఈ మహిళా దినోత్సవం సందర్భంగా, భారతదేశపు అత్యంత నమ్మకమైన హెయిర్ ఆయిల్ బ్రాండ్ డాబర్ ఆమ్లా, సామాజిక నిబంధనలను సవాలు చేసే మహిళల ధైర్యం, ఆత్మవిశ్వాసం, స్థితిస్థాపకతను గౌరవించే ఒక బలీయమైన ప్రచారాన్ని ప్రారంభించింది. ఐ యామ్ బిగ్, ఐ యామ్ బ్రేవ్, ఐ యామ్ బ్యూటిఫుల్.. అనే శీర్షికతో సాగే ఈ క్యాంపెయిన్ విజయానికి తమదైన మార్గాలను ఏర్పరుచుకుని, తమ ప్రయాణాలను శక్తితో, దయతో స్వీకరించే మహిళలకు ఒక గీతంగా పనిచేస్తుంది. దశాబ్దాలుగా, డాబర్ ఆమ్లా మహిళల జీవితంలో ఒక ముఖ్యమైన భాగం, వారి జుట్టును బలోపేతం చేయడమే కాకుండా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఈ ప్రచారం బ్రాండ్ ప్రధాన తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. బలమైన జుట్టు బలమైన మూలాలతో ప్రారంభమైనట్లే, నిజమైన ఆత్మవిశ్వాసం ఆత్మవిశ్వాసం నుండి వస్తుంది, అందుకే మేము ఈ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

నిర్వీర్యమవుతున్న చట్టాలను పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కార్పొరేట్ కబంద హస్తాల్లోకి వెళ్లిన మీడియాను, వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను రక్షించుకోడానికి ఉధృతంగా జర్నలిస్టు సంఘాలు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ కార్మిక సంఘ జాతీయ నాయకులు పి. ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ట్రేడ్ యూనియన్ ఆర్గనైజేషన్ గా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) చైతన్యవంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అధ్యక్షతన 'జర్నలిజం- వృత్తి సంఘం' అనే అంశంపై, 33 జిల్లాల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులకు ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, సామాజిక స్పృహ కలిగిన ఈ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘానికి ఎంతో ఉద్యమ చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం మీడియా రంగంలో వస్తున్న మార్పులపై జర్నలిస్ట్ సంఘం వర్క్ షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మునుముందు జిల్లా, మండల స్థాయిలో సైతం జర్నలిస్టులను చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యాజమాన్యాల టార్గెట్లతో మండల, డివిజన్ స్థాయిలో పనిచేసే జర్నలిస్టులు బెదిరిపోతున్నారని పేర్కొన్నారు. దీంతో సమాజంలో జర్నలిస్టుల పట్ల చులకన భావం ఏర్పడుతుందన్నారు. విధి నిర్వహణలో సామాజిక స్పృహతో ముందుకు వెళుతూ పరాయికరణ నుండి బయట పడాల్సిన అవసరం ఉందని సూచించారు. సమాజంలో మళ్లీ పాత్రికేయుల పాత్ర కీలకమైన పరిస్థితులు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాలని, ఉత్తమ పౌరులుగా జీవించాలని ఆయన సూచించారు.

మహిళలతోనే ప్రగతి

మహిళా దినోత్సవ సదస్సులో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మహిళల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యమని, వారి ప్రమేయం లేకుండా సమాజ పురోగతి అసాధ్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు లేని రంగం కనిపించదని, పైగా పురుషులకు ఏమాత్రం తీసిపోనివిధంగా సత్తా చాటుతున్నారని కొనియాడారు. 'న్యూ జెన్ - సస్టైనబుల్ ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈఎస్) - అందరికీ శ్రేయస్సు' పై నోవాటెల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన అంతర్జాతీయ సదస్సులో సీఎం ప్రసంగించారు. ఆర్థిక వృద్ధిలో మహిళల పాత్ర గణనీయంగా పెరిగిందని, వారు లేని రంగం ఏదీ లేదన్నారు. సంపాదనలో పురుషులను మహిళలు అధిగమిస్తున్నారని, వారు పనిచేసే రంగాల్లో అపారమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారని కొనియాడారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మహిళల కష్టాలను తాను స్వయంగా చూసి... అనేక పథకాలు తీసుకొచ్చిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 'నా తల్లి వంటతో పడే ఇబ్బందులు చూశాను. ఇది దీపం పథకాన్ని ప్రారంభించడానికి నన్ను ప్రేరేపించింది. మరలా ఇప్పుడు దీపం 2.0 కింద మహిళలపై గ్యాస్ భారాన్ని మరింత తగ్గించడానికి మేము మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. డ్వాక్రా గ్రూపుల ఏర్పాటు కూడా విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆర్థిక వృద్ధిలో వీటి పాత్ర అత్యంత కీలకంగా మారింది' అని చంద్రబాబు అన్నారు. కాలానుగుణంగా మహిళలు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కోరారు. అమరావతిలో టాటా గ్రూపు భాగస్వామ్యంతో నైపుణ్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా మహిళలకు ఆయా రంగాల్లో వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేసుకునే నైపుణ్యాన్ని నేర్పించి వారి ఆర్థిక వృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా 42.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ కోసం ప్రణాళికలు రూపొందించామని, దీనికి మహిళల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆర్థికాభివృద్ధిలో ఏపీని అగ్రగామిగా నిలపాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో మహిళలంతా భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

2028లో జాతీయ స్థాయి క్రీడాపోటీలు: మంత్రి మండిపల్లి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అత్యుత్తమ క్రీడా పాలసీని రాష్ట్రంలో ప్రవేశ పెట్టినట్లు క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శాసనసభలో శుక్రవారం మంత్రి మాట్లాడుతూ... చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత భారతదేశంలోనే ఏ రాష్ట్రానికి దక్కని గౌరవం ఇక్కడి క్రీడాకారులకు దక్కేలా చేశారన్నారు. 2028లో జాతీయ క్రీడలు (నేషనల్ గేమ్స్) అమరావతి కేంద్రంగా ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గత పాలనలో వైఫల్యాలు, రాజకీయ జోక్యం ఎక్కువగా ఉండటంతో అసోసియేషన్లు తప్పుదారులు పట్టాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఈ-రిజిస్ట్రేషన్ ద్వారా ఆటగాళ్లందరికీ క్రీడా పాలసీ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. యాప్‌లో నేరుగా వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. తప్పు జరగకుండా, క్రీడాకారులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అనారోగ్యంతోనే అసెంబ్లీకి 'నిమ్మల'

- ఆరోగ్యంపై శ్రద్ధపెట్టకుంటే ఎలా: లోకేశ్
- మంత్రికి రామకృష్ణ పరామర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర శాసనసభలో శుక్రవారం ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి నిమ్మల రామానాయుడు సెలైన్ ఎక్కించేందుకు చేతికి పెట్టిన కాన్యులాతోనే నీరసంగా సభకు వచ్చారు. ఈక్రమంలో మంత్రి నారా లోకేశ్... నిమ్మల పనిపైనే కాకుండా కాస్త ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని ఆయనతో సరదాగా అన్నారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేస్తానంటే సస్పెండ్ చేయిస్తానని చమత్కరించారు. రామానాయుడు విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కోరడంతో శాసనసభలో నవ్వులు విరిశాయి. అనంతరం సభకు విరామం ప్రకటించిన సమయంలో లాబీలో మరలా ఎదురుపడగా...లోకేశ్ మరోసారి ఆయనను ఆప్యాయంగా పలకరించారు. ఆరోగ్యం బాగాలేనప్పుడు విశ్రాంతి తీసుకోకుండా ఇలా తిరుగుతుంటే ఎలా అని ప్రశ్నించారు. నిన్నటితో పోలిస్తే ప్రస్తుతం ఫర్వాలేదని, ఆరోగ్యం సహకరించడం వల్లే అసెంబ్లీకి రాగలిగానని చెప్పారు. ప్రశాంత నిద్ర వల్లే ఆరోగ్యం కుదుటపడుతుందని నిమ్మలకు మంత్రి లోకేశ్ సూచించారు. మాట వినకపోతే నా యాపిల్ వాచ్‌ని మీ చేతికి పెట్టి నిద్రను మానిటర్ చేస్తానని లోకేశ్ చెప్పడంతో...ఈరోజు సభ పూర్తయిన తర్వాత మీ మాట ప్రకారమే విశ్రాంతి తీసుకుంటానని రామానాయుడు అన్నారు. అలాగే సెక్రటేరియట్‌కు వచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కూడా మంత్రి రామానాయుడు జ్వరంతో బాధపడుతున్నారని తెల్సుకుని పరామర్శించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

- సొసైటీ సమస్యను పరిష్కరించండి
- ప్రభుత్వానికి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విన్నపం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ పట్టణ ప్రాంతాల్లో 3 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 4 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ..నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్టుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం తరపున జర్నలిస్టులు 17 యేళ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. నున్న మామిడి మార్కెట్ ఎదురుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం ఉమ్మడి ఏపీలో వైఎస్ఆర్ 480/2008 జీవో ద్వారా సుమారు మూడున్నర ఎకరాలు సొసైటీకి కేటాయించారని, అనంతరం బైపాస్ రోడ్ రావడంతో ఎకరం 30 సెంట్లు భూమి పోయిందని...2 ఎకరాల 15 సెంట్లు మాత్రం భూమి ఇప్పుడు ఉందన్నారు. 2019కు ముందు టిడ్కో ఇళ్లు కట్టివ్వాలని ఆనాటి సీఎం చంద్రబాబు ఆదేశాలు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. కేటాయించిన స్థలాన్ని ప్లాట్లుగా ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి ఆ రోజు ఆ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆతర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో. జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కూడా ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణం ప్రధాన ప్రత్యామ్నాయంగా కనిపిస్తోందన్నారు. ఈ సొసైటీలో 150 మంది వరకు ఉండగా 14 మంది చనిపోయారని, వారి కుటుంబాలకు కూడా న్యాయం చేయాలన్నారు. స్థలం ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణ శాఖ నేతృత్వంలో ఇళ్లు నిర్మాణం చేస్తే బాగుంటుందని సూచించారు. ఇటీవల జర్నలిస్టు సొసైటీకి కేటాయించిన స్థలం కొంత వరకు ఆక్రమణలకు కూడా గురైనట్లు తన దృష్టికి వచ్చిన వెంటనే స్థానిక తహాశీల్దార్‌కు వివరించి వాటిని తొలగించాలని చెప్పామన్నారు. జిల్లా కలెక్టర్ కు కూడా ఈ విషయాలను ఇప్పటికే తెలియచేసి, సర్వే చేయించాలని కోరామన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల రెక్కాడితేగానీ డొక్కాడని వారు చాలా మంది ఉన్నారని, వారికి సరైన జీతభత్యాలు కూడా ఉండని పరిస్థితి అని, పేదలకు స్థలాలు ఇచ్చిన విధంగా జర్నలిస్టుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. దీనిపై గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పందిస్తూ ..జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సమస్య ఎప్పటి నుంచో తన దృష్టిలో కూడా ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఈ ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సమాచారశాఖ సమీక్షా సమావేశంలో కూడా సీఎం సానుకూలంగా స్పందించారని, వారి వారి స్థాయిని బట్టి, గృహనిర్మాణ శాఖ నుంచి నిర్మాణాలు చేపట్టే ఆలోచన చేస్తామని చెప్పారు. కేంద్రం నుంచి అనేక పథకాలు ఉన్నాయని, సబ్సిడీ స్కీంలు కూడా వర్తించే అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కూర్చుని మాట్లాడి జర్నలిస్టుల ఇళ్ల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు.

స్కూలు కిట్లు, గుడ్లు, చిక్కీల్లో రూ.1000 కోట్ల ఆదా

- విద్యారంగాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం
- ఒక క్లాస్-ఒక టీచర్ మా విధానం
- ఈ నెలలోనే మెగా డీఎస్సీ
- మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఇచ్చే స్కూల్ కిట్లు, చిక్కీ, గుడ్ల కొనుగోళ్ల టెండర్లలో అవకతవకలను అరికట్టి... వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర ఖజానాకు వెయ్యికోట్లు ఆదా చేయబోతున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. టెండర్లలో పారదర్శక విధానాలు అమలుచేయడం ద్వారా పెద్దఎత్తున ఖజానాకు నిధులు ఆదా చేయబోతున్నామన్నారు. ఒక్క చిక్కీలోనే 63 కోట్లు (36 శాతం) ఆదా చేశాం, రాబోయే ఐదేళ్లలో రూ.300 కోట్లకు పైగా ఖజానాకు ఆదా అవుతాయని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, పాఠ్యాంశాల్లో మార్పులు, మౌలికసదుపాయాలపై అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. స్కూల్ కిట్లలోనూ 8 నుంచి 9 శాతం వరకు అంటే రూ.70 కోట్లవరకు ఆదా అవుతుంది. కోడిగుడ్లలోనూ 10 నుంచి 12 శాతం తగ్గింది. రేట్లు తగ్గించడంతోపాటు నాణ్యత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించామని లోకేశ్ తెలిపారు. ముఖ్యంగా విద్యావ్యవస్థలో సంస్కరణల అమలుపై దృష్టిసారించామన్నారు. స్కూల్ కిట్ల విషయంలో థర్డ్ పార్టీతో పర్యవేక్షణ చేయిస్తున్నాం. పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు బరువుగా ఉన్నట్లు ఎక్కువగా ఫిర్యాదులు రావడంతో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, పుస్తకాల బరువు తగ్గించేందుకు మహారాష్ట్ర మోడల్‌లో సెమిస్టర్ విధానం తెస్తున్నామన్నారు. రాబోయే మూడేళ్లలో ఏపీ విద్యావిధానాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తామన్నారు. ఉపాధ్యాయుల శిక్షణకు ప్రపంచస్థాయి ఇనిస్టిట్యూట్‌ను అమరావతిలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. శిక్షణ కోసం ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ఇక్కడకు ఉపాధ్యాయులు వచ్చేలా ప్రతిష్ఠాత్మకమైన సంస్థను ఏర్పాటుచేస్తామన్నారు. సంస్కరణల అమలును ఈ ఏడాది జూన్ కల్లా పూర్తిచేసి... నైతిక విలువలతో కూడిన విద్యావిధానానికి శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి తెలిపారు.

1994 నుంచి 2024 వరకు డీఎస్సీల ద్వారా 2.53 లక్షల మంది ఉపాధ్యాయులను నియమించగా, టీడీపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు 71 శాతం అంటే 1,80,272 పోస్టులు భర్తీచేశామని మంత్రి లోకేశ్ గణాంకాలను వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో 16,347 పోస్టుల భర్తీకి మార్చిలో నోటిఫికేషన్ ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఏపీ చరిత్రలో మొదటిసారి ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా ప్రచురిస్తామన్నారు. వచ్చే మంత్రివర్గంలో ఉపాధ్యాయుల బదిలీ చట్టాన్ని ఆమోదిస్తామన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతం చేయడానికి వన్ క్లాస్ - వన్ టీచర్ ఉండాలని తాము భావిస్తున్నామని, ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. పాఠ్యాంశాల్లో మార్పులు ముఖ్యంగా మహిళల పట్ల గౌరవం పెంచేలా, పాఠ్యపుస్తకాల్లో ఇంగ్లీషు, తెలుగు రెండూ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎయిడెడ్ వ్యవస్థ గందరగోళంగా ఉందని, దీనికి శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక విధానం రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఉండదు

కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై పరిశీలన: మంత్రి అనగాని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రస్తుతానికి జిల్లాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వద్ద గానీ, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ పరిశీలనలో గానీ ఎటువంటి ప్రతిపాదనలు లేవని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కొత్తగా రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి రెండు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లే మూడు రెవెన్యూ డివిజన్లను సవరించి అద్దంకి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఆ జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదన వచ్చిందని, శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలంటూ ఆ జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక వచ్చిందని చెప్పారు. ఈ రెండు డివిజన్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం పరిశిలీస్తుందని తెలిపారు. ఎమ్మిగనూరు, ఉదయగిరి కేంద్రాలను కూడా రెవెన్యూ డివిజన్లుగా మార్చాలని స్థానిక ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లాల పున:వ్యవస్థీకరణపై సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జిల్లాల విభజనను అస్తవ్యస్తంగా చేశారన్నారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా నిర్ణయాలు జరిగిన కారణంగానే, చాలా చోట్ల నిరసనలు జరిగాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో అనేక ప్రజా సమస్యలతో పాటు ఉద్యోగుల ఆందోళన, పీఆర్సీ అంశాలను పక్కదారి పట్టించేందుకే జగన్..జిల్లాల విభజనను తెరపైకి తీసుకువచ్చారన్నారు. కనీసం కేబినెట్ లో కూడా సమగ్రంగా చర్చించకుండా...రాత్రికి రాత్రి నోటిఫికేషన్ విడుదల చెయ్యాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అశాస్త్రీయంగా చేసిన కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రాంతాల మధ్య విభేదాలు తలెత్తే పరిస్థితి తెచ్చారన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు అనేక చోట్ల గందరగోళంగా తయారయ్యాయని, భౌగోళికంగానూ ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాల్లో మౌలిక సదుపాయలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాల ఏర్పాటు సమయంలో పారదర్శకంగా, సమగ్రంగా వ్యవహరించకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఉద్యమాలు చెలరేగాయని చెప్పారు.

ఆదర్శ కమ్యూనిస్టులు

కోడూరు సాంబశివరావు, రాజేశ్వరి విగ్రహావిష్కరణలో ముప్పాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి: నిరంతరం పేదల కోసం పనిచేసిన ఆదర్శమూర్తులు కోడూరు సాంబశివరావు, రాజేశ్వరి దంపతులని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రజా ఉద్యమాలలో ముందుండి పనిచేసిన ఆదర్శ జంటగా నిలిచారని కొనియాడారు. కడదాకా ఎత్తిన జెండా దించకుండా నిబద్ధత గల కమ్యూనిస్టుగా కోడూరు సాంబశివరావు నిలిచారని కొనియాడారు. కోడూరు సాంబశివరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని మైలార్ నగర్‌లో ఏర్పాటు చేసిన కోడూరు సాంబశివరావు, రాజేశ్వరి దంపతుల విగ్రహాలను ముప్పాళ్ల నాగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సహచర ఉద్యమకారుడిగా ఎన్నో పోరాటాలు చేశామని గుర్తుచేసుకున్నారు. మంగళగిరి పట్టణంలో ఇళ్లస్థలాలు ఇప్పించడంలో సాంబశివరావు కీలక పాత్ర పోషించారన్నారు. తన ముగ్గురు కుమారులను కూడా నిబద్ధత గల కమ్యూనిస్టులుగా తీర్చిదిద్దారన్నారు. వేములపల్లి శ్రీకృష్ణ ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆయన గెలుపునకు అహర్నిశలు కృషి చేశారని గుర్తుచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కోడూరు సాంబశివరావు దంపతులు ప్రజా ఉద్యమాలలో ముందుండే వారన్నారు. సహచర ఉద్యమకారులైన చిన్ని పిచ్చయ్య, తోట గోపయ్య, చిమ్మన నాగభూషణంతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. విజయవాడ సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమ కమ్యూనిస్టుగా కోడూరు సాంబశివరావు అనేక పోరాటాలు చేశారన్నారు. ఓవైపు తన వృత్తి కొనసాగిస్తూ... ఉద్యమాలలో చురుగ్గా పాల్గొంటూ జీవితాన్ని సమతుల్యం చేసుకున్నారన్నారు. మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ అమరుల ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని తిరుపతయ్య అన్నారు. తొలుత వక్తలను 4వ వార్డు శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ వేదికపైకి ఆహ్వానించారు. ద్వారకానగర్ వద్ద ఏర్పాటుచేసిన సీపీఐ స్థూపాన్ని జంగాల అజయ్‌కుమార్, పార్టీ జెండాను చిన్ని తిరుపతయ్య ఆవిష్కరించారు. ముందుగా కోడూరు సాంబశివరావు దంపతుల మీద ప్రజానాట్యమండలి నాయకులు ఆరేటి రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, కంచర్ల కాశయ్య, సంధుపట్ల భూపతి, అల్లక తాతారావు ఆలపించిన గేయాలు ఉత్తేజపరిచారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వర రావు, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, పట్టణ మాజీ కార్యదర్శి పత్తేవరపు వెంకట శివప్రసాద్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వర రావు, టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, మహిళా నేత ఆరుద్ర భూలక్ష్మి, కోడూరు సాంబశివరావు, రాజేశ్వరి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో టీడీఆర్ బాండ్ల అక్రమాలపై స్పష్టత

నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విశాఖపట్నంలో టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అక్రమాలపై రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు సీఐడీ విచారణ కొనసాగుతుందని, నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. టీడీఆర్ బాండ్ల జారీలో ఒక్క విశాఖపట్నంలోనే కాకుండా తణుకు, తిరుపతిలో కూడా అక్రమాలు జరిగాయన్నారు. తణుకులో రూ.63.24 కోట్ల విలువైన బాండ్లు ఇవ్వాల్సి ఉండగా రూ.754 కోట్లకు బాండ్లు జారీ చేశారని, గ్రామీణ ప్రాంతాలలో భూమి ఇచ్చి పట్టణంలో ఉన్న ఇంటి అడ్రస్ ఇవ్వడంతో ఆ ఇంటి విలువ ఆధారంగా బాండ్లు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. తిరుపతిలో రూ.170.99 కోట్ల విలువైన 29 బాండ్లు జారీ చేశారన్నారు. ప్రస్తుతం టీడీఆర్‌లు నిలిపివేశామన్నారు. రాష్ట్రంలో 965 టీడీఆర్ బాండ్ల జారీ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలతో పాటు అన్ని అంశాలపై మూడో నెలల్లో స్పష్టత ఇస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితురాలు సుశీల మృతి

అసోసియేషన్ నేతల నివాళి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి, ప్రభుత్వాల నిర్లక్ష్యానికి మరో బాధితురాలు వెలగ సుశీల శుక్రవారం మృతిచెందారు. నారాకోడూరుకు చెందిన ఆమె ఏజెంట్‌గా చేరి ప్రజల నుంచి వసూలు చేసిన సుమారు రూ.60 లక్షలు కంపెనీకి కట్టారు. 2015లో కంపెనీ మూతపడటంతో ఆమె ఎంతో ఒత్తిడికి గురయ్యారు. డబ్బులు రావని మానసిక ఒత్తిడికి గురైన ఆమె గుండె నొప్పితో మరణించారని అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ తెలిపారు. సుశీల భౌతికకాయానికి అసోసియేషన్ తరపున పొన్నూరు శేఖర్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్య కళాశాలలు ప్రభుత్వమే నడపాలి

- జీవో 107, 108 రద్దు చేయాలి
- చంద్రబాబుకు ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ వైద్య విద్యామండలి (ఎన్ఎంసీ) అనుమతించిన 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడిపేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. ప్రతులను మంత్రులు సత్యకుమార్, నారా లోకేశ్‌కు పంపారు. జీఓ 107, 108 రద్దు చేసి వైద్య విద్య అందరికీ అందుబాటులో తేవాలన్నారు. రాష్ట్రంలో అందరికీ వైద్య విద్య అభ్యసించే అవకాశం కల్పించడానికి గత ప్రభుత్వం కోరిక మేరకు ఎన్ఎంసీ ... 17 మెడికల్ కళాశాలకు అనుమతిస్తూ నిధులు కల్పించిందన్నారు. నాడు ఒకేసారి మెడికల్ కళాశాలలను ప్రారంభించడానికి ఆర్థిక పరిస్థితులు సరిపోవడంలేదని, మొదటి విడతలో ఐదు కళాశాలలు, రెండవ విడత ఐదు, మూడో విడత ఏడు కళాశాలు ప్రారంభిస్తామని వైసీపీ ప్రభుత్వం తెలిపిందని గుర్తుచేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో విద్యార్థులు చెల్లించే రుసుంతో కళాశాలల అభివృద్ధికి తోడ్పడతారనే ఉద్దేశంతో జీవో 107, 108 అమలుపరిచారని పేర్కొన్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్ యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే జీవో 107, 108 రద్దు చేస్తామని ప్రకటించారని లేఖలో పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు

మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : గిరిజన ప్రాంతాల్లో ఒక్కొక్కటీ రూ.50 కోట్ల వ్యయంతో 5 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శాసనసభలో వెల్లడించారు. వైద్య, ఆరోగ్యశాఖలో 9 నెలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ వరకూ 69 మంది లక్షల మంది విద్యార్థులకు హెల్త్ రికార్డులు రూపొందించామని చెప్పారు. కోటీ 40 లక్షల మందికి వివిధ వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టుల్ని నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్‌కు చికిత్స అందిస్తున్నామన్నారు. స్టెమీ కార్యక్రమంలో భాగంగా ఒక్కొక్కటీ రూ.45 వేల ఖరీదు చేసే ఇంజక్షన్లు ఉచితంగా ఇచ్చి 2,140 ప్రాణాలను కాపాడామన్నారు. గతంలో పేదలకు అందుబాటులో లేని ఎంఆర్ఐ స్కాన్‌లను కూడా చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఆశాల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడంతో పాటు రూ.1.50 లక్షలు గ్రాట్యుటీని మంజూరు చేస్తూ ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారని మంత్రి వివరించారు.

మహిళా సాధికారతతోనే సమాజ అభ్యున్నతి

డీజీపీ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మహిళా సాధికారతతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమని వక్తలు పేర్కొన్నార. డీజీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సతీమణి సీమాగుప్తా ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహిళలు అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారని, ప్రగతిపథంలో పయనిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు సీమాగుప్తా బహుమతులు ప్రదానం చేశారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఐజీపీ రాజకుమారి, డీఐజీ కమ్యూనికేషన్స్ ఎస్ఎస్‌జె లక్ష్మి, డీసీపీ సరిత, మహిళా ఉద్యోగునులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

ఇది ఎప్పటికీ గెలవని యుద్ధం

కేంద్రంపై స్టాలిన్ విమర్శలు

చెన్నై: జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విధానంతో హిందీని తమపై రుద్దుతున్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం మరో పోస్టు పెట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై ఆయన విరుచుకుపడ్డారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పటికీ గెలవని యుద్ధం మొదలుపెట్టారు. 'చెట్టు ప్రశాంతంగా ఉండాలని అనుకున్నా... గాలి ఊరుకోదు. అలాగే... మమ్మల్ని రెచ్చగొట్టిన ఆయనకు వరుసగా లేఖాస్త్రాలు సంధిస్తున్నాం. ఎన్ఈపీని తిరస్కరిస్తున్న తమిళనాడు... విద్యావిధానంలో ఇప్పటికే అనేక లక్ష్యాలు సాధించింది. ఎల్‌కేజీ విద్యార్థి పీహెచ్‌డీ హోల్డర్‌కు ఉపన్యాసం ఇచ్చినట్లు ఉంది. మేం దిల్లీ ఆదేశాలు తీసుకోం.

త్రిభాషా విధానంపై బీజేపీ సర్కారు చేస్తున్న సంతకాల ప్రచారం హాస్యాస్పదంగా ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అంశాన్నే ప్రధాన అజెండాగా చేసుకొని బరిలో దిగాలని సవాల్ విసురుతున్నా. పథకాల దగ్గర నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఇచ్చే అవార్డుల వరకు అన్నింటికీ హిందీ పేర్లు పెట్టారు. దేశంలో అధికంగా ఉన్న హిందీయేతర ప్రజలను ఇది ఉక్కిరిబిక్కిరి చేస్తుంది' అని స్టాలిన్ పేర్కొన్నారు.

వికటన్‌కు ఊరట

చెన్నై: వందేళ్ల చరిత్ర గల తమిళ మీడియా సంస్థ వికటన్‌కు మద్రాస్ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈ మ్యాగ్జైన్ వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ఏ కార్టూన్ కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆగ్రహంతో ఆ సంస్థ వెబ్‌సైట్‌ను బ్లాక్‌చేసిందో... ఆ కార్టూన్ తీసివేయాలన్న ముందస్తు షరతు ఇందులో ఉంది. షరతుకు అంగీకరించిన పక్షంలోనే, ఆ వెబ్‌సైట్ మళ్లీ తెరమీద ప్రత్యక్షమవుతుందన్న ఆదేశాలు మధ్యంతరం కావచ్చు. అంతిమతీర్పు మిగిలే ఉండవచ్చు. కానీ, న్యాయస్థానం ఇలా అతిజాగ్రత్తగా వ్యవహరించడం మిగతా మీడియా సంస్థలకు ఉత్తేజాన్నిచ్చే అంశమైతే కాదు. అక్రమవలసదారులంటూ కాళ్లకూ చేతులకూ గొలుసులు కట్టి, ముఖానికి మాస్కులు పెట్టి అమెరికా తన విమానాల్లో మన పౌరులను పంజాబ్‌లో దించేసినందుకు దేశం యావత్తూ బాధపడింది, అవమానపడింది. ఇంత అమానుషంగా, అగౌరవంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించకపోతే ఎలా అని విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించాయి. ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదని తప్పుబట్టాయి. ఓ కార్టూన్‌కు సంబంధించి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఫిర్యాదుతో వికటన్ మ్యాగజైన్‌పై కేంద్రం చర్యలు తీసుకుంది. కార్టూన్ ఫిబ్రవరి 10న ప్రచురితమైతే, ఐదురోజుల అనంతరం కేంద్రప్రభుత్వం తన వెబ్‌సైట్ బ్లాక్ చేసిందనీ, ఫిబ్రవరి 25 వరకూ తనకు అధికారికంగా సమాచారమివ్వలేదని వికటన్ వాదించింది.

శీష్ మహల్‌లో కూర్చొని పనిచేయను: రేఖా గుప్తా

న్యూదిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం దేశరాజధాని అభివృద్ధికి నోచుకోలేదని దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆరోపించారు. ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజల గురించి ఆలోచించకుండా శీష్ మహల్ నిర్మించుకోవడంలో బిజీగా ఉన్నారని ఎదురుదాడి చేశారు. ఆయనలా తాను మహల్‌లో కూర్చొని పని చేసే సీఎంను కానన్నారు. 24 గంటలు ప్రజల మధ్యే ఉంటూ వారి కోసం పని చేసే ముఖ్యమంత్రినని చెప్పారు. దేశ రాజధానిలో ఓ మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేఖా గుప్తా పాల్గొన్నారు. దిల్లీలో మహిళను సీఎం చేయడంతో సులభంగా అధికారం తమ చేతిలో పెట్టుకోవచ్చని బీజేపీ నేతలు ఈ పదవి కట్టబెట్టినట్లు వస్తున్న వార్తలపై ఆమె స్పందిస్తూ మహిళలపై ఉన్న గౌరవంతోనే దేశరాజధానికి తనను సీఎంగా నియమించారని అన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న తనను కేవలం ప్రజలు మాత్రమే నియంత్రించగలరని తెలిపారు. పార్టీ నేతలు కేవలం తనకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తారే తప్ప అధికారం తమ గుప్పిట్లో పెట్టుకోవాలనే ఆలోచన వారికి ఉండదని చెప్పారు. తామంతా ప్రధాని మోదీ అధ్వర్యంలో కలిసికట్టుగా దేశరాజధానిని అభివృద్ధి బాటలో నడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. 'అధికారం చేపట్టిన మొదటి రోజే శీష్ మహల్‌లో ఉండబోనని చెప్పాను. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న డబ్బును విశ్రాంతి, సౌకర్యం కోసం ఉపయోగించుకునే హక్కు నాకు లేదు. ఆ ఆస్తి దిల్లీ ప్రజలది' అని రేఖా గుప్తా అన్నారు.

బెంగళూరు యూనివర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు

బెంగళూరు: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గౌరవార్థం ఆయన పేరును కర్నాటక ప్రభుత్వం ఓ యూనివర్సిటీకి పెట్టింది. బెంగళూరు సెంట్రల్ యూనివర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని ఆ రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్వయంగా అసెంబ్లీలో శుక్రవారం ప్రకటించారు. మన్మోహన్ సింగ్ 2024 డిసెంబర్ 26న తుది శ్వాస విడిచారు. ఆయన మరణం తర్వాత దేశంలో ఒక యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం ఇదే తొలిసారి. బెంగళూరు సెంట్రల్ యూనివర్సిటీని 2017లో స్థాపించారు. 2024లో తన 92వ ఏట కన్ను మూసిన మన్మోహన్ సింగ్ ఆధునిక ఆర్థిక సంస్కరణల రూపకర్తగా కీర్తిని సంపాదించారు. భారతదేశానికి ఆయన 13వ ప్రధానిగా పనిచేశారు. ఆయన 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా కొనసాగారు.

బిజూను అవమానిస్తారా?

- పంచాయతీ దివస్ తేదీ మార్పుపై బీజేడీ, కాంగ్రెస్ ఆందోళన
- ఒడిశా అసెంబ్లీలో గందరగోళం
- స్పీకర్ పోడియం వద్ద ప్రతిపక్ష సభ్యుల నిరసన

న్యూదిల్లీ: ప్రతిపక్ష సభ్యుల నిరసనల నడుమ ఒడిశా అసెంబ్లీలో తీవ్ర గందరగోళం నెలకొంది. రెండో దశ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రతిపక్ష బీజేడీ, కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ వెల్ వద్దకు దూసుకెళ్లి... బీజేపీ ప్రభుత్వం బిజూపట్నాయక్‌ను అగౌరవ పర్చడం సహా మహిళల భద్రత వంటి అంశాలపై నినదించారు. శాసనసభ సమావేశమైన వెంటనే ప్రశ్నోత్తరాలు చేపట్టగా... ప్రతిపక్ష సభ్యులు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మార్చి 5న మాజీ ముఖ్యమంత్రి బిజు పట్నాయక్ జయంతి రోజున కాకుండా పంచాయతీ రాజ్ దివస్‌ను ఏప్రిల్ 24న నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. దివంగత బిజు పట్నాయక్ వారసత్వాన్ని తుడిచిపెట్టే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వం బిజూ జయంతి నుండి పంచాయతీ రాజ్ దివస్ వేడుకలను వేరు చేసిందని మండిపడ్డారు. 1993 నుండి బిజూపట్నాయక్ జయంతి రోజున పంచాయతీ రాజ్ దివస్‌ను జరుపుకుంటున్నామని బిజూ జనతాదళ్ (బీజేడీ) ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఒడిశా వెలుపల చేసినట్లుగా ఏప్రిల్ 24నే పంచాయతీ రాజ్ దివస్‌ను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసి... మార్చి 5న సెలవు కూడా రద్దు చేసింది. బీజేడీ, కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ... ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీజేడీ సభ్యుడు అధిరాజ్ పాణిగ్రాహి, కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినిపతి స్పీకర్ సురామ పాధి పోడియంపైకి ఎక్కి మైక్రోఫోన్‌ను పగలగొట్టడానికి ప్రయత్నించారు. ఆ తర్వాత సభ మధ్యాహ్నం వరకు వాయిదా పడింది. అయితే సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. కాగా 2024 జూన్‌లో ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అకృత్యాలు పెరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. కాగా సభ వెలుపల, బిజూ పట్నాయక్ విగ్రహం దగ్గర బీజేడీ సభ్యులు ధర్నా చేయగా, మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర కాంగ్రెస్ సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు బీజేపీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని సమర్థిస్తూ... ప్రతిపక్ష సభ్యులు సభలో కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. "బిజూ పట్నాయక్ పట్ల బీజేపీ ప్రభుత్వానికి అత్యున్నత గౌరవం ఉంది. ఈ విషయాన్ని సభలో చర్చించడానికి వారు సిద్ధంగా లేరు" అని పంచాయతీ రాజ్ మంత్రి రబీ నారాయణ్ నాయక్ అన్నారు. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 5 వరకు కొనసాగనున్నాయి.

మోదీకి 'తారీఫ్' తప్ప 'టారిఫ్' పట్టదు

ట్రంప్ బెదిరింపులపై ప్రధాని మౌనం ఆక్షేపణీయం: జైరాం రమేశ్

న్యూదిల్లీ: ప్రధాని మోదీకి తారీఫ్ (ప్రశంసలు) తప్ప టారిఫ్ (సుంకాలు) గురించి పట్టదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. అమెరికా ప్రతీకార సుంకాలు బెదిరింపులకు దీటైన బదులు ఇచ్చేందుకు 56 అంగుళాల ఛాతిగల ప్రధాని ఎందుకు జంకుతున్నారని ఎద్దేవా చేశారు. జైరాం రమేశ్ శుక్రవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా బెదిరింపులపై మోదీ మౌనాన్ని ఆక్షేపించారు. కేంద్ర బడ్జెట్ రెండవ దశ సమావేశాల్లో భాగంగా పార్లమెంటులో అమెరికా తీరును ఉమ్మడిగా ఎండగట్టాలన్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అమెరికా రాయబారిగా... ఆ దేశానికి అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని జైరాం రమేశ్ దుయ్యబట్టారు. 'మన ప్రధానికి ప్రశంసలు మాత్రమే వినిపిస్తాయని, ఆయనకు సుంకాల గురించి పట్టదు. ప్రశంసలు తగ్గించి సుంకాలపై మాట్లాడండి'అని సూచించారు. అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన అన్ని నిబంధనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరగరాస్తున్నారని, ప్రతీకార సుంకాలంటూ విచిత్ర నిర్ణయం తీసుకున్నారన్నారు. '1995లో డబ్ల్యూటీఓలో చేరిన 170 దేశాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందుకోసం రాజీ కుదరడానికి 10ఏళ్లు పట్టింది. ఇప్పుడు వచ్చిన ట్రంప్ తన విచిత్ర ఆలోచనలతో అంతర్జాతీయ వాణిజ్యానికి దశ-దిశ నిర్దేశించాలని చూస్తున్నారు. డబ్ల్యూటీఓ అంటే వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్... వరల్డ్ ట్రంప్ ఆర్గనైజేషన్ కాదు' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. అక్రమ వలసరాదరుల నెపంతో భారతీయులను అమానీయ విధానంతో అమెరికా నుంచి స్వదేశానికి తరలించడాన్ని ఆక్షేపించారు. చిన్న దేశాలు కూడా అమెరికాను ఎండగడుతుంటే 56 అడుగుల ఛాతీగల ప్రధాని నోరు మెదపడం లేదన్నారు. 'భారత్ లాంటి దేశాన్ని ట్రంప్ బెదిరిస్తున్నారు. ఇది తేలికగా తీసుకునే అంశం కాదు. అమెరికాను ఎండగట్టేందుకు ప్రధాని 56 అంగుళాల ఛాతి ఏమైంది? 1971 నవంబరులో అమెరికాకు అప్పటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌తో ఇందిరా గాంధీ ఏం చెప్పారో గుర్తుందా? భారత్ ప్రతిష్ఠను దిగజార్చేందుకు నిక్సన్, హెన్రీ కిస్సింగర్ ప్రయత్నించారు కానీ ఇందిరా గాంధీ దీటుగా బదులిచ్చారు. 'భారత్ ప్రయోజనాల కోసం ఏం చేయాలో అదే చేస్తా' అని వారితో అన్నారు' అని జైరాం రమేశ్ తెలిపారు. ఇప్పుడున్న ప్రధానికి 'నమస్తే ట్రంప్'... 'ట్రంప్ మంచి మిత్రుడు' అంటూ ఆయనను హత్తుకోవడమే సరిపోతోందని విమర్శించారు. భారత్‌ను ట్రంప్ లక్ష్యంగా చేసుకోవడాన్ని తేలికగా తీసుకోలేమని, ఇది దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన అంశమని జైరాం రమేశ్ అన్నారు.

'పార్లమెంటులో ప్రధాని మౌనం వీడకుండా విదేశీ వ్యవహారాల మంత్రిని పంపారు... ఆయన అమెరికాకు ప్రతినిధిగా మాట్లాడారు. ప్రతీకార సుంకాలంటూ అమెరికా బెదిరింపులను సమష్టిగా తిప్పికొట్టాలి' అని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు అఖిలపక్షాన్ని పిలవదని దుయ్యబట్టారు. విదేశాంగ మంత్రి, హోంమంత్రి ఉపన్యాసాలు మాత్రమే ఇస్తారని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

మౌలికవసతులు, సంక్షేమానికి పెద్దపీట

- కర్నాటక బడ్జెట్ రూ.4.8 లక్షల కోట్లు
- అన్ని థియేటర్లలో సినిమా టికెట్ గరిష్ట ధర రూ.200

బెంగళూరు: ఆర్థిక సంవత్సరం 2025-26 కు సంబంధించి కర్నాటక బడ్జెట్‌ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.4,08,647 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలను సభ ముందుకు తీసుకువచ్చారు. మౌలికవసతుల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు, మైనారిటీల అభివృద్ధి, మహిళా సాధికారత, ఇతర రంగాలకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. 'ముఖ్యమంత్రి మైనారిటీ కాలనీ అభివృద్ధి కార్యక్రమం' కింద రూ.1000 కోట్లతో ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇది 2025-26లో అమలు చేయబడుతుంది. వక్ఫ్ ఆస్తుల మరమ్మతులు, ముస్లిం శ్మశాన వాటికల రక్షణ కోసం రూ. 150 కోట్లు కేటాయించారు. ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ వర్గాలలో సాధారణ వివాహాలను ప్రోత్సహించడానికి ప్రతి జంటకు రూ.50,000 సహాయం అందిస్తారు. బడ్జెట్ లో జైన పూజారులు, సిక్కుల ప్రధాన గ్రంథీలు, మసీదుల పేష్-ఇమామ్ ల గౌరవ వేతనాన్ని నెలకు రూ.6000కి పెంచారు. అసిస్టెంట్ గ్రాంథ్స్, ముజ్జిన్ల గౌరవ వేతనం నెలకు రూ.5000గా నిర్ణయించబడింది. కేటగిరీ 2బీకి చెందిన మైనారిటీ కాంట్రాక్టర్లు ఇతర వర్గాల మాదిరిగానే రూ.2 కోట్ల వరకు ప్రభుత్వ కాంట్రాక్టులను పొందుతారు. సినీ రంగానికి సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలను సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు వెలువరించింది. కన్నడ సినిమాలను ప్రోత్సహించడానికి ఓటీటీ ప్లాట్‌ఫామ్ రూపకల్పన, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సినిమా థియేటర్లలో గరిష్టంగా టికెట్ ధరను రూ.200గా నిర్ణయించారు. మల్టీప్లెక్స్ లతో సహా రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో అన్ని షోలకు ఇదే రేటు ఉంటుందని సీఎం సిద్దరామయ్య వెల్లడించారు. సామాన్యులకు సినిమాను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ ప్రమాణాలతో మైసూర్ లో ఒక ఫిల్మ్ సిటీ నిర్మించేందుకు 150 ఎకరాల భూమిని ఇస్తున్నట్లు అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. దీని నిర్మాణానికి రూ. 500 కోట్ల బడ్జెట్ ను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. బెంగళూరులో మౌలిక సదుపాయాల కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. సొరంగ రహదారుల నిర్మాణానికి రూ.19,000 కోట్లు, 40.5 కి.మీ. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.8,916 కోట్లు, బ్రాండ్ బెంగళూరు ప్రాజెక్టుకు రూ. 1,800 కోట్లు కేటాయించారు. ఇక మహిళా సాధికారత కోసం సిద్దరామయ్య సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 10 పట్టణ ప్రాంతాల్లోని ఇందిరా క్యాంటీన్లను జాతీయ జీవనోపాధి మిషన్ మహిళా స్వయం సహాయక బృందాలు నిర్వహిస్తాయి.

ఆర్థిక సమతుల్యత, పన్ను సంస్కరణలు

కర్నాటక ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో హామీ ఇచ్చిన పథకాల అ కోసం రూ. 51,034 కోట్లు కేటాయించింది. ఇది జీఎస్డీపీలో 3 శాతం. జీతాలు, వేతన జీవులపై పన్నును రూ.200 నుంచి రూ.300కి పెంచడానికి ప్రొఫెషనల్ ట్యాక్స్ చట్టాన్ని సవరించనున్నారు. వార్షిక గరిష్ట పరిమితిని రూ.2,500గా నిర్ణయించనున్నారు.

నక్సలిజంపై కీలక ప్రకటన

కర్నాటక నక్సల్ రహితంగా మారినందున నక్సల్స్ వ్యతిరేక దళాన్ని రద్దు చేస్తారు. లొంగిపోయిన నక్సలైట్ల పునరావాసం కోసం ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.10 కోట్లతో ప్రణాళికను రూపొందించనున్నారు. బడ్జెట్ లో ప్రకటించిన ఈ పథకాలు రాష్ట్రంలోని వివిధ వర్గాల సంక్షేమానికి, బెంగళూరు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ముఖ్యమైనవిగా పరిగణించబడుతున్నాయి.

విదేశాంగ శాఖ అధికారి ఆత్మహత్య

న్యూదిల్లీ: విదేశాంగశాఖకు చెందిన అధికారి జితేంద్ర రావత్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. భవనంపై నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నారు. శుక్రవారం దిల్లీలోని చాణక్యపురి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై ఆ శాఖ స్పందించింది. విదేశాంగశాఖకు చెందిన రెసిడెన్షియల్ సొసైటీలో అధికారులు నివాసం ఉంటున్న భవనం టెర్రస్ పైనుంచి దూకి రావత్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన తన తల్లితో పాటు ఆ ఇంట్లో ఉంటున్నారు. రావత్ భార్య, ఇద్దరు పిల్లలు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో నివసిస్తున్నారు. కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతూ ఆయన చికిత్స తీసుకుంటున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని దిల్లీ పోలీసులు తెలిపారు. విదేశాంగ శాఖ ఆయన మృతిని ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేసింది. 'ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి అన్ని రకాలుగా సాయం అందిస్తున్నాం. కేసు విచారణలో ఎప్పటికప్పుడు దిల్లీ పోలీసులతో సంప్రదింపులు చేస్తున్నాం' అని పేర్కొంది. బాధిత కుటుంబం గోప్యత దృష్ట్యా ఇతర వివరాలేవీ వెల్లడించడం లేదని తెలిపింది.

ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు

చెన్నై: ఎండ వేడిని తట్టుకునేలా ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు ఆ శాఖ అధికారులు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఎండల నుంచి వాహనచోదకులకు ఉపశమనం కలిగించేలా ప్రధాన నగరాల్లోని సిగ్నల్స్ వద్ద పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెన్నైను విభజించి కొత్తగా రూపొందిన ఆవడి పోలీసు కమిషనర్ కార్యాలయ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులకు కమిషనర్ శంకర్ ... ఏసీ హెల్మెట్లు అందజేశారు. ఫైబర్‌తో రూపొందించిన హెల్మెట్‌లో బ్యాటరీ ద్వారా ఏసీ యంత్రం పనిచేసి ట్రాఫిక్ పోలీసులకు ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తుందని అధికారులు తెలిపారు.

మహిళలకు సాధికారత అవసరం: సుప్రీం

న్యూదిల్లీ: మహిళలకు సానుభూతి కాదని, సమాజంలో సాధికారత అవసరమని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళా జడ్జీలలో ఒకరైన జస్టిస్ ఎం.త్రివేది మౌఖికంగా ఈ వ్యాఖ్యలు చేశారు. బాధితురాలి పట్ల అందరి సానుభూతి ఉందని లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా నిందితుడి తరపున వాదిస్తున్న న్యాయవాది సమర్థిస్తుండగా... న్యాయమూర్తి దీనికి ఖండించారు. 'మహిళలకు సానుభూతి అవసరం లేదు. చట్టాలను సమర్థవంతంగా, కఠినంగా అమలు చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించాలి' అని జస్టిస్ త్రివేది పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై సీనియర్ న్యాయవాది స్పందిస్తూ ఇళ్లలో మహిళలకు అధికారం ఇవ్వాలని, అది జరుగుతోందని అన్నారు. ఈ వ్యాఖ్యలను జడ్జి మరోసారి ఖండించారు. కేవలం ఇళ్లలో ఉన్న మహిళల గురించి మాత్రమే కాదని అన్నారు. సమాజంలో ప్రతి చోటా ఉన్న మహిళలందరికీ సాధికారత అవసరమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. నిందితుడు ఏడు నెలలుగా జైలులో ఉన్నాడని న్యాయవాది వాదించారు. తమిళనాడుకి చెందిన ఈ కేసు అత్యాచారానికి సంబంధించినది. బాధితురాలి మెడపై చిన్న గాయం మాత్రమే ఉందని, హత్యాయత్నం కేసు కాదు. దీంతో శిక్షను పున:పరిశీలించాల్సి ఉందని న్యాయవాది వాదించారు. బాధితురాలి మెడపై ఉన్న గుర్తు సాధారణ గాయం కాదని, నైలాన్ తాడుతో గొంతు కోసి హత్య చేసేందుకు యత్నించారని జడ్జి పేర్కొన్నారు. రెండు కోర్టులు ఈ తీర్పును ధృవీకరించాయి. శిక్ష పరిమితిపై సుప్రీంకోర్టు రాష్ట్రానికి నోటీసులు జారీ చేసింది.

తమిళంలో ఇంజినీరింగ్, వైద్య విద్య

సీఎం స్టాలిన్‌కు అమిత్ షా విజ్ఞప్తి

రాణీపేట: ఇంజినీరింగ్, వైద్య విద్యను తమిళ భాషలో బోధించాలని తమిళనాడు సీఎం స్టాలిన్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కోరారు. హిందీ భాషను వ్యతిరేకిస్తూ స్టాలిన్ చేస్తున్న వ్యాఖ్యలకు కౌంటర్‌గా అమిత్ షా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్థానిక భాషల్లో పరీక్షలు రాసే వీలు కల్పించిందని, ఇప్పుడు సీఐఎస్ఎఫ్ పరీక్షను తమిళంలోను రాయవచ్చని మంత్రి పేర్కొన్నారు. తమిళనాడులోని రాణీపేటలో జరిగిన 56వ సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమిళ విద్యార్థుల లబ్ధి కోసం ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో బోధించాలని సీఎం స్టాలిన్‌ను కోరుతున్నట్లు అమిత్ షా తెలిపారు. భారతీయ సంస్కృతిని బలోపేతం చేయడంలో తమిళనాడు కీలక పాత్ర పోషించిందన్నారు. పరిపాలనా సంస్కరణలైనా, ఆధ్యాత్మిక చింతనైనా, విద్య అయినా... దేశ సమగ్రత, ఐక్యత అయినా తమిళనాడు పాత్రను విస్మరించలేమన్నారు.

మహిళా ఎమ్మెల్సీలపై నితీశ్ ఎదురుదాడి

పాట్నా: బాలికా విద్యపై చర్చ సందర్భంగా బీహార్ సీఎం నితీశ్ కుమార్ సహనం కోల్పోయారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఆర్జేడీపై విరుచుకుపడ్డారు. లాలూ ప్రసాద్ యాదవ్ తన భార్య రాబ్డీదేవిని సీఎం చేయడాన్ని ఎద్దేవా చేశారు. బీహార్ శాసనమండలిలో బాలికా విద్యపై శుక్రవారం చర్చ జరిగింది. తన ప్రాంతంలో బాలికల కోసం తగినన్ని పాఠశాలలు లేవని ఆర్జేడీ ఎమ్మెల్సీ ఊర్మిళా ఠాకూర్ తెలిపారు. విద్య కోసం కిలోమీటర్ల దూరంలోని స్కూళ్లకు వెళ్లేందుకు బాలికలు ఇబ్బందిపడుతున్నట్లు ఆమె చెప్పారు. దీనికి విద్యా శాఖమంత్రి సునీల్ కుమార్ ఇచ్చిన సమాధానంపై ఊర్మిళా ఠాకూర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బెగుసరాయ్ జిల్లాలో పరిస్థితిని ఆమె వివరించారు. దీంతో సీఎం నితీశ్ కుమార్ అసహనం వ్యక్తం చేశారు. 'బాలికల విద్య కోసం మేం ఏం చేశామో మీకు తెలుసా? మేం అధికారంలోకి వచ్చే వరకు బీహార్‌లో గ్రామీణ బాలికలు చాలా అరుదుగా స్కూళ్లకు వెళ్లేవారు' అని అన్నారు. నితీశ్ కుమార్ వ్యాఖ్యలను ఊర్మిళా ఠాకూర్ ఖండించారు. 'సార్ దయచేసి అలా అనకండి. నేను కూడా ఒక గ్రామం నుంచి వచ్చా. నేను పాత తరానికి చెందినదానిని. అయినప్పటికీ నా పాఠశాల విద్యను పూర్తి చేశా' అని అన్నారు. ఇంతలో మరో ఆర్జేడీ ఎమ్మెల్సీ మున్నీదేవి రాజక్ తన సీటు నుంచి పైకి లేచారు. 'ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు మాకు ఉంది. దానికి సమాధానం చెప్పడం మీ పని' అని అన్నారు. దీంతో మున్నీదేవిని సముదాయించేందుకు ఊర్మిళా ఠాకూర్ ప్రయత్నించారు. సహనం కోల్పోయిన నితీశ్ కుమార్ తన సీటు నుంచి లేచిన ఆయన ప్రతిపక్షంపై విరుచుకుపడ్డారు. 'మహిళల కోసం మేం ఏమి చేశామో మీకు తెలియదు. మీరు మహిళలు కావచ్చు. కానీ మీ సహకారం ఏమిటి' అని ప్రశ్నించారు. మండలిలో ప్రతిపక్ష నాయకురాలైన రాబ్డీదేవిపై మాటల దాడి చేశారు. ఆమె భర్త (లాలూ ప్రసాద్ యాదవ్) మునిగిపోతున్నప్పుడు తన భార్యను సీఎం చేశారు. మీ పార్టీ (ఆర్జేడీ) ఏమీ చేయలేదు. మీకు ఏమీ తెలియదు. మహిళల కోసం ఏమి చేసినా, అది నేనే చేశా. ఇప్పుడు మహిళలకు ఎలాంటి సమస్యలు లేవు' అని అన్నారు. దీంతో మండలిలో గందరగోళం చెలరేగడంతో నితీశ్ కుమార్ బయటకు వెళ్లిపోయారు.

నా చావుకు భార్యే కారణం

కంపెనీ వెబ్‌సైట్‌లో ఉద్యోగి ఆత్మహత్య లేఖ



ముంబై: మహారాష్ట్రలోని ముంబైలో ఓ కంపెనీలో పనిచేసే ఉద్యోగి తన చావుకు భార్యే కారణమని లేఖ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి ముందు తన సూసైడ్ నోట్‌ను కంపెనీ వెబ్‌సైట్‌లో పెట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. ముంబైకి చెందిన నిశాంత్ త్రిపాఠి స్థానికంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఆయన సహారా హోటల్లో రూమ్ బుక్ చేసుకుని దిగాడు. ఆత్మహత్యకు ముందు తన గది బయట 'నన్ను ఆటంక పరచొద్దు' (డు నాట్ డిస్టర్బ్) అనే బోర్డు తగిలించాడు. దాంతో సిబ్బంది ఆయన గది తలుపు తట్టలేదు. మూడు రోజులైనా త్రిపాఠి గది నుంచి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చి మారు తాళంతో గది తెరిచి చూశారు. అప్పటికే అతడు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తన భార్య అపూర్వ పారిఖ్, అత్త ప్రార్థన మిశ్రా వేధింపులే తన ఆత్మహత్యకు కారణమని నిశాంత్ తన ఆత్మహత్య లేఖలో రాశాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి నీలం చతుర్వేది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ నోట్‌లో నిశాంత్ తన భార్యపై తనకున్న ప్రేమను... భార్య, అత్త కలిసి తనను ఏవిధంగా వేధించారో వివరించాడు. భార్య కారణంగా చనిపోతున్నా ఆమెపై ప్రేమే ఉందని పేర్కొన్నాడు. 'నువ్వు ఈ లేఖ చదివేటప్పటికీ నేను ఈ లోకంలో ఉండను. నా ఆఖరి రోజుల్లో జరిగిన ప్రతి ఘటన నిన్ను ద్వేషించాల్సినదే. కానీ నేను అలా చేయలేదు. అయినా నేను నిన్ను ప్రేమించాను. ఇప్పుడు ప్రేమిస్తున్నాను. నాలో నీపై ఉన్న ప్రేమ ఇకపై కూడా చెరిగిపోదని నీకు ప్రమాణం చేస్తున్నా' అని నిశాంత్ తన ఆత్మహత్య లేఖలో పేర్కొన్నాడు. మీతో నేను పడిన యాతన అంతా మా అమ్మకు తెలుసు. నా చావుకు మీరు ఇద్దరే కారణం. చనిపోతే దయచేసి మా అమ్మ దగ్గరికి వెళ్లకండి. ఆమెను ప్రశాంతంగా బాధపడనివ్వండి' అని భార్య, అత్తను అభ్యర్థించాడు. నిశాంత్ తల్లి కూడా కొడుకు మరణం గురించి తన ఎక్స్ ఖాతాలో హృద్యమైన పోస్టు పెట్టారు. 'నా జీవితం ఓడింది. నా కొడుకు నన్ను వదిలి వెళ్లిపోయాడు. నేను ఇప్పుడు ఒక జీవచ్ఛవాన్ని అయ్యాను. తను నా అంతిమ సంస్కారాలు చేయాల్సి ఉంది... కానీ నేను నా కొడుకు అంత్యక్రియలు చేశాను. నా కుమార్తె తన అన్నకు తల కొరివి పెట్టింది. నాకు, నా బిడ్డకు ఈ కఠోర పరిస్థితి నుంచి బయటపడే ధైర్యం కావాలి' అని తన పోస్టులో పేర్కొన్నారు.